10-10-25 Samayam_Layout 1 10/10/2025 6:12 AM Page 1

SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 10 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 10 అక్టోబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |




## స్థానిక ఎన్నికల ప్రక్రియకు

# బ్రేక్

## బీసీ రిజర్వేషన్ల జీవో 9పై హైకోర్టు స్టే

- నోటిఫికేషన్ పైనా స్టే విధిస్తూ ఆదేశాలు
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- రెండురోజుల పాటు హైకోర్టులో సమగ్ర వాదనలు
- నోటిఫికేషన్ ఇచ్చాక కోర్టులు జోక్యం చేసుకోరాదన్న ఏజీ

**తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్ పడింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలు జీఓ 9పై హైకోర్టు స్టే విధించింది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పైనా స్టే విధించి షాక్ ఇచ్చింది. ఈ మేరకు బీసీ రిజర్వేషన్లపై విచారణను 4 వారాలపాటు వాయిదా వేసింది. అనంతరం రెండు వారాల్లోపు అన్ని పార్టీలు కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది.**

**హైదరాబాద్, అక్టోబర్ 9:** గురువారం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో రెండో రోజు వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ వాదనలు విన్న న్యాయస్థానం.. తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించింది. అయితే, జీవో 9 విడుదల అనంతరం హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ మేరకు బుధవారం పిటిషన్లపై న్యాయస్థానం విచారణ చేపట్టి నేటికి వాయిదా వేసింది. ఇవాళ మరోసారి విచారణ చేపట్టిన ధర్మాసనం.. ప్రభుత్వం తరపు వాదనలు విని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ తాత్కాలికంగా నిలిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తరఫున సమగ్రమైన కౌంటర్‌ను దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిన తర్వాత.. రెండు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లకు సూచించింది. హైకోర్టు ఆదేశాలతో స్థానిక సంస్థల ఎన్నికల పక్రియపై సందిగ్ధత నెలకొంది. ఈ క్రమంలో బీసీలకు స్థానిక సంస్థల

మిగతా 2 లో



## రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

- స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను నిలిపివేత

02

## మార్కెట్ కమిటీల్లో సదుపాయాలకు


# మాస్టర్ ప్లాన్

- రైతు సేవా కేంద్రాలను పునర్వ్యవస్థీకరించండి
- భూసారం పెంపుతో లాభసాటిగా సేంద్రీయ సాగు
- రాష్ట్రంలో రైతు బజార్ల ఆధునీకరణ
- రైతుకు ధర దక్కాలి.. వినియోగదారునికి ధర తగ్గాలి
- వ్యవసాయ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు



**అమరావతి:** రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్రంలో ఉన్న 218 మార్కెట్ కమిటీల స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. గురువారం సచివాలయంలో వ్యవసాయశాఖ, అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. ఈ సమీక్షకు మంత్రి కె.అచ్చెన్నాయుడు, వ్యవసాయ అనుబంధ

మిగతా 2 లో



## నేడు నెల్లూరు జిల్లాలో సీఎం పర్యటన


5



3

## సర్కార్ నడవట్లేదు.. నడుస్తున్నది

- మహిళలకు ఉచిత బస్సు.. మగాళ్లపై ఛార్జీల భారం
- బస్ భవన్ వద్ద బీఆర్ఎస్ నేతల ఆందోళన




## రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

వైద్యారోగ్యశాఖ డైరెక్టర్‌గా కేవీఎన్ చంద్రశేఖర్‌బాబు

వ్యవసాయశాఖ డైరెక్టర్‌గా మనజీర్ జిలానీ సమూన్

ఏపీపీఎస్సీ సెక్రటరీగా పి.రవి శుభాష్

.. వివరాలు 5లో

## నేడు ఏపీ కేబినెట్ భేటీ

పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం

.. వివరాలు 5లో

## పేదలకు వైద్యం అందకుండా

# ప్రభుత్వం కుట్రలు

### ప్రైవేట్‌కు మెడికల్ కాలేజీల అప్పగింత

నర్సీపట్నంలో మెడికల్ కాలేజీ నిర్మాణాల పరిశీలన

కూటమి ప్రభుత్వంపై జగన్ ఘాటు విమర్శలు



**అనకాపల్లి:** పేదలకు వైద్యవిద్యను దూరం చేసే కుట్రలు ప్రభుత్వం చేస్తోందని మాజీ సిఎం, వైకాపా అధినేత జగన్ ఆరోపించారు. తన హయాంలో 17 మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తే వాటిని ప్రైవేట్ పరం చేస్తున్నారని దుయ్యబట్టారు. పేదల కోసం మేం ఆలోచన చేస్తే పెద్దల కోసం చంద్రబాబు ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. దీంతో పేదలు వైద్యానికి దూరం అవుతారని అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై జగన్ ఘాటుగా వ్యాఖ్యానించారు. గురువారం నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శించిన ఆయన, ప్రభుత్వం చేపడుతున్న ప్రైవేటీకరణను కుట్రగా వర్ణించారు. పేదలకు ఉపయోగపడే ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరంగా మార్చడం ద్వారా వారిని

మిగతా 2 లో



## హైకోర్టు వద్ద ఉద్రిక్తత

- బీసీ సంఘాల నేతల ఆందోళన
- సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు

రాష్ట్ర హైకోర్టు వద్ద బీసీ సంఘాల నేతలు ఆందోళనకు దిగారు. సీఎం డౌన్ డౌన్ అంటూ కోర్టు వద్ద బీసీ సంఘాలు నేతలు నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేశారు.

3

## అమెరికా, భారత్ బంధాలు పెంచాలి

అమెరికా ప్రతినిధుల బృందంతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



2



## ముంబైలో బ్రిటన్ ప్రధాని స్టార్మర్కు

# మోడీ స్వాగతం

### ఇరుదేశాల సంబంధాలు బలోపేతంపై స్టార్మర్ వ్యాఖ్యలు

### భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని కితాబు

**ముంబై:** రెండు రోజుల పర్యటనలో భాగంగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ భారత్‌లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ముంబయిలో ప్రధాని మోదీ–స్టార్మర్ భేటీ అయ్యారు. ఈ సమావేశం కోసం రాజ్‌భవన్‌కు వచ్చిన యూకే ప్రధానిని మోదీ స్వాగతించారు. దీనికి సంబంధించిన చిత్రాలను విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్

మిగతా 5 లో

## ఇజ్రాయెల్, హమాస్ మొదటి దశ శాంతి ఒప్పందం

ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకం చేశాయని ట్రంప్ వెల్లడి


ట్రంప్ చొరవను స్వాగతించిన ప్రధాని మోడీ

4

## జూబ్లీహిల్స్‌పై బీజేపీలో బొంతు పేరు

4

ఎంపీ అర్వింద్ కీలక ప్రతిపాదన



# మొక్కజొన్నకు మద్దతు ధర

## ప్రభుత్వమే సేకరించాలని నిర్ణయం



**హైదరాబాద్,అక్టోబర్9:** తెలంగాణలో మొక్కజొన్న రైతులకు శుభవార్త. మొక్కజొన్న పంటను మద్ధతు ధరకు సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం రైతుల్లో ఆనందాన్ని నింపింది. మొక్కజొన్న పంట సేకరణ అంశంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. రైతుల సమస్యలను వివరించి, మద్దతు ధరకు కొనుగోళ్లను ప్రారంభించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది కూడా కేంద్రం సహకారం లేకుండానే సుమారు 160 కోట్ల వ్యయంతో మొక్కజొన్న, జొన్న పంటలను మద్ధతు ధరకు సేకరించింది. రైతులను నష్టాల నుండి రక్షించేందుకు ఇదే విధానాన్ని ఈసారి కూడా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెసర, మినుము, సోయా చిక్కుడు, కంది, వేరుశనగ వంటి పంటలను సేకరించడంలో కేంద్ర ప్రభుత్వం 25శాతం సీలింగ్ విధించింది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఆ పరిమితిని మించి పంటల సేకరణ కొనసాగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని మరోసారి కోరింది.. కేవలం మద్ధతు ధర ప్రకటించి వదిలేయడం కాకుండా, మొక్కజొన్న, జొన్న పంటల కొనుగోలుకు రాష్ట్రానికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. అలాగే, మిగతా పంటలపై ఉన్న 25 శాతం సీలింగ్‌ను పూర్తిగా ఎత్తివేయాలని కూడా రాష్ట్రం కోరింది. రైతుల ఆదాయాన్ని రక్షించడానికి, పంటలకు న్యాయమైన ధరలు లభించేలా చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల తెలిపారు.

# భారీ మొత్తంలో మాదకద్రవ్యాల పట్టివేత

## హైదరాబాద్‌లో ఈగిల్ టీమ్ దాడులు



**హైదరాబాద్, అక్టోబర్ 9:** హైదరాబాద్ నగరంలో పోలీసులు భారీ మొత్తంలో మాదకద్రవ్యాలను పట్టుకున్నారు. జీడిమెట్లలో 220 కిలోల ఎఫిడ్రిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.72 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దేశీయంగా రూ.10 కోట్లు ఉంటుందన్నారు. నగరంలోని ఓ రసాయన పరిశ్రమలో తయారు చేసినట్లు గుర్తించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. మరొకరు పరారీలో ఉన్నారని పోలీసులు వెల్లడించారు. ఈ మాదకద్రవ్యాల తయారీలో ప్రధాన నిందితుడిగా శివరామకృష్ణ ఉన్నట్లు గుర్తించారు. డ్రగ్ తయారీకి వాడిన ఫార్ములాను సైతం స్వాధీనం చేసుకున్నారు. ఈగిల్ టీమ్ దాడిలో ఈ ఘటన వెలుగు చూసింది.

# రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాట

## రేవంత్ సర్కార్ చేతకానితనం వెల్లడైంది

## బీసీ రిజర్వేషన్లపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ,అక్టోబర్9:** కాంగ్రెస్ పార్టీ బీసీలను రాజకీయంగా వాడుకుంటోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. బీసీలకు న్యాయం చేయాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి ఏనాడూ లేదని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 9పై హైకోర్టు స్టే విధించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. రిజర్వేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానం దురదృష్టకరమని పేర్కొన్నారు. రేవంత్ సర్కార్ చేతకానితనం కారణంగానే.. ఈ తీర్పు వెలువడిందని విమర్శించారు. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు. అందుకే ముందగానే ప్లాన్ 'బీ'ని సిద్ధం చేసుకుని ఇవాళ హైకోర్టులో తూతూమంత్రంగా వాదనలు వినిపించిందని కిషన్ రెడ్డి విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే.. సుప్రీంకోర్టు రిజర్వేషన్లపై 50? క్యాప్‌ను నిర్దేశిరచిందని గుర్తు చేశారు. ఈ విషయం తెలిసినా.. రాజ్యాంగపరమైన నిబంధనలపై కనీస అవగాహన లేకుండా రేవంత్ సర్కారు వ్యవహరించిందని పేర్కొన్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# స్టే రావడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వం

## మైండ్ అప్లై చేయని నేతలు: రామ్‌చందర్ రావు

**హైదరాబాద్,అక్టోబర్ 9 :** బీసీ రిజర్వేషన్లపై స్టే రావడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామ్‌చందర్ రావు ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్‌లకు బీజేపీ మద్దతు పలుకుతోందని స్పష్టం చేశారు. బీసీల అంశాని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ది కోసం వాడుకుంటోందని విమర్శించారు. గవర్నర్‌కి పంపిన తర్వాత బిల్లు కోసం 3 నెలల సమయం ఉంది.. ఎందుకు తొందర పడుతునారని సూచించారు. బిల్లు ఆమోదానికి 3 నెలల సమయం ఉండగా ఎందుకు బిల్లు తెచ్చారో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాల్సిన అవసరం ఉందని రామ్‌చందర్ రావు నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల పట్ల చిత్తశుద్ధి లేదు కాబట్టే.. ఇలాంటి పరిస్థితి వచ్చిందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటుందని మాట్లాడుతారు తప్ప.. కనీసం రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ నేతలు మైండ్ అప్లై చేశారా.. అని ఎద్దేవా చేశారు. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ఇచ్చిన బాధ్యత మీది. ఆర్డినెన్సు తెచ్చింది మీరు.. బిల్లు తెచ్చింది మీరు.. కానీ బీజేపీనీ అంటునారని రామ్‌చందర్ మండిపడ్డారు. మీరిచ్చిన హామీని మీరు అమలు చేయకుండా బిజెపిపై విమర్శలు ఎలా చేస్తారని అన్నారు.

# స్థానిక ఎన్నికల ప్రక్రియకు బ్రేక్

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9పై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై స్టే ఇచ్చింది. రిజర్వేషన్ల అంశంపై విచారణను ఆరువారాలకు వాయిదా వేసింది. నాలుగు బీసీ రిజర్వేషన్లపై రెండురోజుల పాటు సుదీర్ఘంగా వాదనలు విన్న ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గురువారమే స్థానిక సంస్థల ఎన్నికల కోసం నోటిఫికేషన్ విలువడింది. నోటిఫికేషన్‌పై సైతం హైకోర్టు స్టే విధించింది. దాంతో ఎన్నికల పక్రియ నిలిచిపోనున్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు కోసం ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల జీవో నంబర్ 9ని జారీ చేసింది. ఈ జీవోను సవాల్ చేస్తూ బుట్టెంబారి మాధవరెడ్డి, సముద్రాల రమేశ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా ఆర్ కృష్ణయ్య, వీ హన్మంతరావుతో పాటు పలువురు ఇంప్లీడ్ పిటిషన్లు వేశారు. ఆయా అన్ని పిటిషన్లను సీజే జస్టిస్ ఏకే సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ ప్రారంభించింది. తాజాగా రిజర్వేషన్ల అంశంపై గురువారం సైతం వాదనలు కొనసాగాయి. ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడిందని కోర్టుకు చెప్పారు. కొందరు ఇది నోటిఫికేషన్ కాదంటున్నారని.. అది తప్పని ఏజీ చెప్పారు. నోటిఫికేషన్‌కు సంబంధించిన పత్రులను ఏజీ ధర్మాసనం ఎదుట ఉంచారు. నోటిఫికేషన్ వచ్చాక న్యాయస్థానాల జోక్యం ఉండదని.. నోటిఫికేషన్ వచ్చాక జోక్యం చేయొద్దని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. అయితే, రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదని పిటిషనర్లు తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రెండువారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లు, ప్రభుత్వానికి నాలుగు వారాలు సమయం ఇచ్చింది. మళ్లీ నాలుగు వారాల తర్వాత రిజర్వేషన్ల అంశంపై విచారణ జరుగనున్నది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో రెండు రోజుల పాటు సుదీర్ఘ వాదనలు జరిగాయి.ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు.




# అమెరికా, భారత్ బంధాలు పెంచాలి

## అమెరికా ప్రతినిధుల బృందంతో సీఎం భేటీ

**హైదరాబాద్:** తెలంగాణకు వచ్చిన అమెరికా హడ్సన్ ఇన్స్టిట్యూట్‌కు చెందిన 16 మంది ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సచివాలయంలో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇండియా ఫౌండేషన్ సారథ్యంలో ప్రతినిధి బృందం భారత్‌లోని పలు రాష్ట్రాల్లో పర్యటిస్తోందని తెలిపారు. అమెరికా తీసుకుంటున్న నిర్ణయాలు, అనుసరించే విధానాలన్నీ సానుకూల దృక్పథంతో ఉండాలని ఆయన సూచించారు. అమెరికా, భారత్ మధ్య సంబంధాలను మరింత పెంపొందించేలా ఉండాలని సీఎం ఆకాంక్షించారు. ఇటీవల అమెరికా పెంచిన రాయితీలు, వీసాలపై కఠిన నిబంధనలన్నీ ఆందోళన కలిగించాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు దేశాల మధ్య ఆర్థిక వృద్ధికి దోహదపడే విధానాలు అనుసరిస్తే ప్రపంచానికి ఆదర్శవంతంగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు.



# హైకోర్టు వద్ద బీసీ సంఘాల నేతల ఆందోళన

## సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా నినాదాలు

**హైదరాబాద్,అక్టోబర్ 9:** బిసి రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు స్టే విధించడంతో హైకోర్టు ఎదుట బీసీ సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. గేట్ నెం.4 దగ్గర నినాదాలు చేస్తూ.. రోడ్డుపై బైఠాయించారు. సీఎం డౌన్‌డౌన్ అంటూ కోర్టు వద్ద బీసీ సంఘాలు నేత లు నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం తొందరపాటు చర్యల వల్లే బీసీలకు అన్యాయం జరిగింది అని బీసీ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. బీసీలకు పదవులు వస్తుంటే అగ్రకులస్తులు ఓర్వలేకపోతున్నారు అని వారు మండిపడ్డారు. బీసీల నోటి కాడ ముద్దను లాక్కున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రి పదవులు మొత్తం అగ్రవర్ణాలకే. కనీసం ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ పదవులైనా బీసీలకు దక్కొద్దా..? అని ప్రభుత్వాన్ని బీసీ నేతలు నిలదీశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. జీవో అమలును నిలిపివేస్తూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ కౌంటర్లపై అభ్యంతరాలకు దాఖలుకు పిటిషనర్లకు 2 వారాల గడువు విధించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు కోర్టు వాయిదా వేసింది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పైనా స్టే విధించి షాక్ ఇచ్చింది. బీసీ రిజర్వేషన్లపై రెండు రోజుల పాటు హైకోర్టులో సుదీర్ఘ విచారణ కొనసాగిన సంగతి తెలిసిందే. ఏజీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర కేబినెట్ బీసీ జనగణన నిర్వహించాలనే నిర్ణయం తీసుకుందని తెలిపారు. సర్వే ప్రకారం రాష్ట్రంలో బీసీల జనాభా 57.6 శాతం ఉందని ఆయన పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు ఏజీ తెలిపారు. ఈ తీర్మానం సామాజిక న్యాయం దిశగా ముఖ్యమైన అడుగని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రపతి బిల్లుకు ఆమోదం తెలపకపోయినా, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అది చట్టబద్ధమైనదే అని ఏజీ పేర్కొన్నారు.

### నేడు తెలంగాణ బంద్

స్థానిక ఎన్నికల ప్రక్రియకు హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో బీసీల నాయకులు, సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9 అమలుతో పాటు.. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌పై కూడా తెలంగాణ హైకోర్టు స్టే విధించడాన్ని బీసీ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. జీవో నంబర్ 9 అమలుపై స్టే ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ నాయకులు హైకోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. ఈ పరిణామాలపై అసంతృప్తి చెందిన బీసీ సంఘాలు నేడు(శుక్రవారం) రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. మంత్రి వాకిటి శ్రీహరి స్పందిస్తూ.. బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై రిజర్వేషన్లు అడ్డుకున్నాయని ఆరోపించారు. కోర్టు తీర్పు కాపీ చూసిన తర్వాత సుప్రీంకోర్టుకు వెళ్లడంపై నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

## స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను నిలిపివేత

**హైదరాబాద్, అక్టోబర్ 9:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను నిలిపేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు సెప్టెంబర్ 29న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఎన్నికల ప్రక్రియ ఆపేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా జరుగనున్న ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలపై జారీ చేసిన గెజిట్‌ను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పు మేరకు సెప్టెంబర్ 29న విడుదల చేసిన ఎన్నికల నోటిఫికేషన్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. హైకోర్టు ఆదేశాలు అందిన వెంటనే ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తూ ఎన్నికల కమిషన్ గెజిట్ విడుదల చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి వచ్చిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కూడా తాత్కాలికంగా రద్దు అయ్యింది. ఎన్నికల ప్రక్రియను కొనసాగించాలా లేదా అన్నదానిపై హైకోర్టు తుది ఆదేశాల తర్వాతే నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల వేళ ఊపందుకున్న రాజకీయ వాతావరణం కొంత శాంతించింది.

# జూబ్లీహిల్స్‌పై బీజేపీలో బొంతు పేరు

## ఎంపీ అర్వింద్ కీలక ప్రతిపాదన

**హైదరాబాద్, అక్టోబర్ 9:** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అభ్యర్థిపై బీజేపీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ నేత బొంతు రామ్మోహన్ పేరును తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్ రావుకు ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రతిపాదించారు. బొంతు రామ్మోహన్‌ను పార్టీలోకి తీసుకుని జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలని ఆయన కోరారు. బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల మేనేజ్‌మెంట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. బొంతు రామ్మోహన్‌కు బ్యాక్‌గ్రౌండ్ ఉందని అర్వింద్ స్పష్టం చేశారు. అనంతరం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేపై అర్వింద్ స్పందించారు. బీసీలపై సీఎం రేవంత్ కపట ప్రేమ చూపిస్తున్నారని మండిపడ్డారు. బీసీల ఆత్మగౌరవంతో రేవంత్ ఆడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ సవరణ చేయకుండా బిల్లు ఉంటుందా..? అర్వింద్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ అభయ్ పాటిల్, రాష్ట్ర సంస్థ ఇంచార్జ్ చంద్రశేఖర్ తివారి, ఎ÷-లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా హ్యామ్ రోడ్ల నిర్మాణం

## దశలవారీగా పనులు వేగవంతం చేయాలన్న భట్టి

## మొదటి దశలో రూ.10,986 కోట్లతో నిర్మాణం: కోమటిరెడ్డి



**హైదరాబాద్,అక్టోబర్ 9 :** రాష్ట్రవ్యాప్తంగా హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులను దశలవారీగా వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సూచించారు. గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమక్షంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. హ్యామ్ రోడ్ల నిర్మాణ పక్రియలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. రోడ్ల రూపకల్పనలో ట్రాఫిక్ సర్వేలను పరిగణనలోకి తీసుకోవాలని, రోడ్లు ఎక్కువగా ఉపయోగించే ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. హ్యామ్ ప్రాజెక్ట్ మొదటి దశకు సంబంధించిన టెండర్లను అతి త్వరలో పిలవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్ల నిర్మాణం పారదర్శకంగా, నాణ్యతతో కూడిన విధంగా జరగాలని ఆయన పేర్కొన్నారు. అధికారులు, శాఖ ఇంజనీర్లు, ప్రాజెక్ట్ కన్సల్టెంట్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దశల వారీగా హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రోడ్ల నిర్మాణం చేపడతామని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. మొదటి దశలో రూ.10,986 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు కోమటిరెడ్డి చెప్పారు. మొదటి దశ రోడ్ల నిర్మాణానికి వచ్చే నెలలో టెండర్లు పిలుస్తామన్నారు. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రెండు వంసల హ్యామ్ రోడ్లు.. జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి నాలుగు వరుసల రోడ్ల నిర్మాణం చేస్తామని వివరించారు.

10-10-25 Samayam_Layout 1 10/10/2025 6:12 AM Page 3



# సర్కార్ నడవట్లేదు.. సర్కస్ నడుపుతున్నారు

- మహిళలకు ఉచితబస్సు.. మగాళ్లపై భారం
- బస్ భవన్ వద్ద బిఆర్ఎస్ నేతల ఆందోళన
- ఎండి నాగిరెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చిన కేటీఆర్



**హైదరాబాద్,అక్టోబర్ 9:** రాష్ట్రంలో సర్కారు నడపట్లేదు.. సర్కస్ నడుపుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. బస్ భవన్ వద్ద నిరసనలో భాగంగా ఆయన మాట్లాడారు. ఉదయం మా పార్టీ నేతలను గృహ నిర్బంధం చేశారు.. తర్వాత వెళ్లవచ్చన్నారు. ఇక్కడికి వచ్చాక మళ్లీ అరెస్టు చేస్తున్నారు. ఏం చేస్తున్నారో అర్థం కావట్లేదు. ఉచిత బస్సు పథకం పెట్టి ఆర్టీసీని నష్టాల్లోకి నెట్టారు. ఆ నష్టాలను భరించాల్సింది ప్రభుత్వమే. మహిళలకు ఉచిత బస్సు కల్పించి.. పురుషులకు రెట్టింపు వసూళ్లు చేస్తున్నారు. ఒక్కో కుటుంబంపై టికెట్ ధరల భారం పెరిగింది. ఆర్టీసీ బస్సు పాసుల ధరలు 25 శాతం పెంచారు. మెట్రో నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీని తరిమేశారు. మెట్రో, ఆర్టీసీ లేకుండా మొత్తం ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతోందని కేటీఆర్ అన్నారు. అనంతరం బస్ భవన్‌లో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి భారత రాష్ట్ర సమితి నేతలు వినతిపత్రం అందజేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు తదితరులు వెళ్లారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ చలో బస్ భవన్‌కు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. ఈ క్రమంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా పలువురు గులాబీ నేతలను గృహనిర్బంధం చేసారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అలాగే వివేకానంద గౌడ్, శంభీర్ పూర్ రాజు, సాయిబాబా తదితరులను కూడా గృహనిర్బంధం చేశారు. ఇక మాజీ మంత్రి , మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కూడా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. పెంచిన బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని చలో బస్ బవన్ కార్యక్రమానికి బయలుదేరుతున్న సబితా ఇంద్రారెడ్డిని పోలీసులు అడ్డుకొని గృహనిర్బంధం చేశారు. అంతేకాకుండా... బీఆర్ఎస్ బస్ భవన్ పిలుపు నేపథ్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని బస్ భవన్ వద్ద పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

# న్యాయవ్యవస్థలో బీసీలు రావాల్సి ఉంది

- తమవారు లేకపోవడంతోనే అన్యాయం
- బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరం
- మాజీ ఎంపీ వీహెచ్, ఆది శ్రీనివాస్ ఆవేదన



**హైదరాబాద్, అక్టోబర్ 9:** బీసీ రిజర్వేషన్ల అంశంపై మాజీ ఎంపీ వీ. హనుమంత రావు మాట్లాడుతూ...కోర్టు తీర్పు చాలా బాధ కలిగించిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తమ నోటి దగ్గరి ముద్దను లాక్కున్నారని మండిపడ్డారు. తారిఖ్ పే తారిఖ్ అని కోర్టు మరో తారిఖ్ ఇచ్చిందని పేర్కొన్నారు. రిజర్వేషన్లపై ప్రభుత్వం తరపున చేయాల్సింది చేశామని చెప్పారు. అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చే సమయంలో తాము అడ్డుకోలేదని.. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే అడ్డుకుంటారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థలో బీసీలు వచ్చే వరకు తమకు అన్యాయం జరుగుతూనే ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరమని కాంగ్రెస్ నేత, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'హైకోర్టు తీర్పుతో చాలా నిరాశ చెందాం. బీసీ రిజర్వేషన్ల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసింది. కేంద్రం సహకరించకపోయినా, గవర్నర్ పట్టించుకోకపోయినా, ప్రతిపక్షాలు కలిసి రాకపోయినా సీఎం రేవంత్ రెడ్డి ఒంటరి పోరాటం చేశారు. కులగణనతో పాటు డెడికేటెడ్ కమిషన్ వేసి బీసీల లెక్క తేల్చాము. బీసీల నోటికాడి బువ్వ అందకుండా పోయింది.. అయినా మేం నిరాశ చెందం.. పోరాటం కొనసాగుతుంది. తప్పకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించి పెడుతాం. బీసీలు ఎవరూ అధైర్యపడొద్దు.. సీఎం రేవంత్ నాయకత్వంలో తప్పనిసరిగా రిజర్వేషన్లు సాధించుకుందాం' అని అన్నారు. హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సీఎంతో సమావేశం కానున్నారు. స్థానిక ఎన్నికలపై హైకోర్టు స్టే నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. న్యాయనిపుణులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ నిర్వహించనున్నారు. నోటిఫికేషన్ స్టేపై సుప్రీం కోర్టుకు వెళ్లే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. హైకోర్ట్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. బీసీ సంఘాల నేతలు, కార్యకర్తలు రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు. 'వుయ్ వాంట్ జస్టిస్', 'బీసీ వ్యతిరేకుల్లారా ఖబడ్దార్' అంటూ నినాదాలు చేశారు. మరోవైపు బీసీ రిజర్వేషన్ల అంశంపై హై కోర్టు స్టే విధించిన నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో పోటీ చేయనున్న కాంగ్రెస్ అభ్యర్థులు అయోమయంలో ఉన్నారు. పీసీసీ ఆదేశాలతో పలువురు స్థానిక నేతలు నామినేషన్ దాఖలు చేశారు. హైకోర్టు స్టే ఇవ్వడంతో ఎన్నికలు జరుగుతాయా? లేదా? అన్న ఆందోళనలో ఉన్నారు.

# నోటికాడ ముద్ద లాగేసుకున్నారు


- నోటిఫికేషన్ ఇచ్చాక స్టే ఎలా ఇస్తారు
- సుప్రీం తీర్పును పట్టించుకోని హైకోర్టు
- రిజర్వేషన్లపై సీఎం స్పష్టం చేయాలి
- లేకుంటే బంద్‌తో సత్తా చాటుతాం
- బిజెపి ఎంపి, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య



**హైదరాబాద్, అక్టోబర్ 9:** తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేలా జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించడంపై బిజెపి రాజ్యసభ సభ్యుడు,.బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. ఈ సందర్భంగా హైకోర్టు వద్ద ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు..బీసీల నోటికాడ ముద్దను ఆపారని ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తొందరపాటు చర్యలతో అన్యాయం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ స్పందన చూశాక బంద్‌కు పిలుపునిస్తామని పేర్కొన్నారు. కొంతమంది బీసీలకు పదవులు వస్తుంటే ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. త్వరలో బీసీల సత్తా ఏంటో చూపిస్తామని ఆర్.కృష్ణయ్య ధీమా వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సాయంత్రంలోగా స్పందించక పోతే తెలంగాణ బంద్‌కు పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు. ఎన్నికల పక్రియను రెండు వారాల పాటు ఆపడమనేది దురదృష్టకరం. ఎందుకంటే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎన్నికలను ఆపొద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా రెండు వారాల పాటు ఎన్నికలను వాయిదా వేయడం తాము తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 56 శాతం బీసీ ప్రజల హక్కులకు విఘాతం కలిగిస్తుంది. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. నోటికాడి అన్నం ముద్దను లాక్కున్నారు. నిన్నటి నుంచి విచారణ జరిపిన కోర్టు.. మరో రెండు రోజులు సమయం తీసుకుని ఇంకా విస్తృతంగా విచారణ చేపట్టాల్సి ఉండేదన్నారు. ఎందుకు ఆదరబాదరగా స్టే విధించాల్సి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాం అని ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు. ఈరోజు సాయంత్రంలోగా ప్రభుత్వం స్పందన ఏంటో చూస్తాం. తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చి రాష్టాన్ని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. బీసీల్లో ఏంతో చైతన్యం వచ్చింది.. ఊరురా స్పందన తెలుపుతాం. సీఎం ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో.. సాయంత్రంలోగా ప్రకటించాలి. లేదంటే పెద్ద ఎత్తున బంద్ నిర్వహిస్తాం. దేశాన్ని కదిలించేలా బంద్ ఉంటుంది. ఏం తమాషాగా ఉందా..? బీసీలంటే అంత చులకనగా ఉందా..? ముఖ్యమంత్రి పదవులు రావు మంత్రి పదవులు రావు.. లేక లేక సర్పంచ్ అవకాశం వస్తే వాటిని కూడా లాగేసుకోవడం సరికాదు. ఈ సమాజంలో బీసీల సత్తా ఏంటో చూపిస్తాం. స్టే విధించడం చాలా దురదృష్టకరం. రేపట్నుంచి రాస్తారోకోలు, ధర్నాలు చేస్తామని ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు.

# బీసీలను మరోసారి మోసం చేసిన కాంగ్రెస్

- జీఓ నిలవదని తెలిసీ స్థానిక స్టంట్
- 42శాతం రిజర్వేషన్లకు ఎలా చట్టబద్ధత వస్తుందో తెలియదా
- హామీ మేరకు ఎన్నికలకు వెళ్లాలి
- మాజీమంత్రి గంగుల కమలాకర్



**హైదరాబాద్, అక్టోబర్ 9:** రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మరోసారి మోసం చేసిందని మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బీసీల రిజర్వేషన్ జీఓ ద్వారా సాధ్యం కాదని, రాజ్యాంగ సవరణ జరిగితేనే ఫలితం ఉంటుందని ప్రతి అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టంగా చెప్పామని పేర్కొన్నారు. ఈ విషయంలో తమిళనాడు వెళ్లి కూడా అధ్యయనం చేసి వచ్చి వివరించామన్నారు. బీసీలను అవమానం చేసేలా ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. జీఓ న్యాయస్థానంలో నిలబడదని సీఎం, మంత్రులు, అందరికీ తెలుసని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలు జరపాల్సిందేనని డిమాండ్ చేశారు. బీహార్, మహారాష్ట్ర ప్రభుత్వాలు చేసిన తప్పిదాలు చేయవద్దని కోరారు. 42శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది హెచ్చరించారు.ఎన్నికలకు తొందర లేదు, రిజర్వేషన్లకు చట్టబద్దత కల్పించిన తర్వాతే నిర్వహించాలన్నారు. చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి ఢిల్లీకి కదలాలని, రిజర్వేషన్ల అంశం తేలే వరకు హైదరాబాద్ రావద్దని సూచించారు. 56 సార్లు సొంత పనుల కోసం ఢిల్లీ వెళ్లిన సీఎం బీసీల కోసం ఒక్కసారి ఢిల్లీ వెళ్లి పోరాడాలని సూచించారు. రాహుల్ గాంధీని ఖుషీ చేసేందుకు, పదవులు కాపాడుకునేందుకు కాంగ్రెస్ నేతలు స్టంట్ చేస్తున్నారని మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. రాహుల్ గాంధీ కోసం తెలంగాణలో బీసీలను బలి పెట్టి రోడ్లపైకి తీసుకొచ్చారని ఆరోపించారు.స్టే వస్తుందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెప్తూ వచ్చారు.హైకోర్టులో కేసు వేసింది కాంగ్రెస్ నేతలేనని పేర్కొన్నారు. ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డెడ్ అనేలా కాంగ్రెస్ వ్యవహరించిందని రవిచంద్ర, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రచారం కోసం బీసీ రిజర్వేషన్లను ఉపయోగించుకుందని విమర్శించారు. అమలు కాదని తెలిసి కూడా మోసపూరిత జీవో తీసుకొచ్చి ఆగం చేశారని మండిపడ్డారు. బీసీల ఆగ్రహ జ్వాలలో కాంగ్రెస్ కూలిపోవడం ఖాయమని పేర్కొన్నారు. బీసీల నోట్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మన్ను కొట్టిందని,అంబేద్కర్ రాజ్యాంగం తమకు పట్టదు అన్నట్లుగా ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని అన్నారు.




# ఆరు గ్యారంటీల తరహాలోనే 42శాతం డ్రామాలు

## 55 ఏళ్లు అధికారంలో ఉన్నా బీసీలకు మొండిచేయి

## సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపాటు

**హైదరాబాద్, అక్టోబర్ 9:** ఆరు గ్యారంటీల తరహాలోనే 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు ఆడుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. 55 ఏళ్లు కేంద్రంలో అధికారంలో ఉండి కాంగ్రెస్ ఏనాడైనా బీసీ రిజర్వేషన్ల కోసం పాటు పడిందా? అంటూ ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే మీ కాంగ్రెస్ నేతలు జాతీయ నాయకులతో ఢిల్లీ వేదికగా కొట్లాడాలని హితవు పలికారు. కలిసి వచ్చేందుకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. మాయ మాటలు చెప్పి గత ఎన్నికల్లో బీసీలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ లబ్ది పొందాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయన్నారు. 22 నెలలుగా బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కొట్లాడాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి.. గల్లీలో కొట్లాడుతున్నట్లు డ్రామా క్రియేట్ చేశారు తప్పా.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధించడం పట్ల ఏనాడూ చిత్తశుద్ధి ప్రదర్శించలేదని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం, 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చట్ట బద్ధత కోసం కేంద్రాన్ని పట్టుబట్టాల్సిన రేవంత్‌రెడ్డి తెలివిగా దాన్ని పక్క దోవ పట్టించారని.. బీసీల పట్ల తమకు నిజంగానే ప్రేమ ఉన్నట్లు చాటుకునేందుకు తూతూ మంత్రంగా జీవో ఇచ్చి కొత్త నాటకానికి తెరతీశారని.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేశారన్నారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా మీ డ్రామాలు ఆపాలని.. బీసీలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే 42శాతం పెంపు విషయమై ఢిల్లీలో కొట్లాడాలని చెప్పారు. పార్లమెంట్‌లో చట్టం చేయించి, షెడ్యూల్ 9లో చేర్చాలని.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ పోరాటంలో అఖిల పక్షాలను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. ఢిల్లీ వేదికగా యుద్ధ భేరి మోగించాలని.. ద్యమ పార్టీగా బీఆర్ఎస్ ఎల్లప్పుడూ బీసీల కోసం గొంతెత్తుతుందని.. ఢిల్లీని నిలదీస్తుందన్నారు.

# 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం

## బిఆర్ఎస్, బిజెపిలకు చిత్తశుద్ధి లేదన్న టీపీసీసీ చీఫ్



**హైదరాబాద్,అక్టోబర్ 9:** బీసీల విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి అందరికీ తెలుసని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలకు వెళ్తామన్నారు. దేశంలోనే తొలిసారి కులగణన చేసింది తమ ప్రభుత్వమేనని చెప్పారు. బీసీల సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమాలను వాళ్లు గమనిస్తున్నారని చెప్పారు. బీసీలకు మేలు చేయడాన్ని భారత రాష్ట్ర సమితి, భాజపా నేతలు తట్టుకోలేక పోతున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంలో భారత రాష్ట్ర సమితి, భాజపా నేతలు హైకోర్టులో ఇంప్లీడ్ కాలేదన్నారు. ఈ పార్టీల నేతలు చరిత్రహీనులుగా మిగిలిపోతారని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో మరోమారు చర్చించి ముందుకు వెళతామని అన్నారు.

# ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక స్టేలు ఇవ్వలేదు

## తాజాగా హైకోర్టు స్టేపై ఎంపీ మల్లు రవి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:** ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత సుప్రీంకోర్టుగాని, హైకోర్టుగాని స్టే ఇచ్చిన దాఖలాలు లేవని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి తెలిపారు. గతంలో సుప్రీంకోర్టు మూడు నెలల్లోగా రాష్ట్రపతి, గవర్నర్ బిల్లుకు ఆమోదం తెలపకపోతే.. ఆమోదం పొందినట్టుగా భావించాల్సి ఉంటుందని చెప్పిందని గుర్తుచేశారు. పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్లు ఇవ్వడంతో చాలామంది నామినేషన్లు వేశారని పేర్కొన్నారు. ఎన్నికలు పెట్టకపోవడంతో పంచాయతీకి రావాల్సిన నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి రావడం లేదని స్పష్టం చేశారు. చట్టం ప్రకారం బీసీ రిజర్వేషన్లు చేశామని మల్లు రవి తెలిపారు. అసెంబ్లీలో పెట్టామని, అన్ని పార్టీలు కూడా మద్దతు తెలిపాయని పేర్కొన్నారు. బీసీలు 56 శాతం ఉన్నారని రిపోర్ట్ వచ్చిందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం 10శాతం వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించిందని చెప్పారు. 50? సీలింగ్ అప్పుడే దాటిందని అన్నారు. హైకోర్టు స్టే ఇవ్వడం ప్రజాస్వామ్య వ్యవస్థను పక్కన పెట్టినట్టు గుర్తించాల్సిందే అని వెల్లడించారు. రిజర్వేషన్లపై జడ్జిమెంట్ రావడం అంటే ప్రజాస్వామ్యం గురించి చాలా లోతుగా అసెంబ్లీలో, పార్లమెంట్లో చర్చ జరగాలని ఆయన సూచించారు. న్యాయ వ్యవస్థను గౌరవిస్తున్నామని ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని రక్షించే వ్యవస్థ న్యాయవ్యవస్థ అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత శాస్త్రీయంగా తెలంగాణలో కులగణన చేశారని తెలిపారు. బీసీ కులగణన ప్రతి కుటుంబ ఆర్థిక, రాజకీయ, సామాజిక స్థితులు తెలుసుకున్నారని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు దానికి అడ్డుకట్ట వేసినట్లైందని అసహనం వ్యక్తం చేశారు. న్యాయ నిపుణులతో చర్చించి ప్రభుత్వం ఏ విధంగా ముందుకు వెళ్లాలన్న దానిపైన ఆలోచన చేస్తామని ఆయన వివరించారు. రాష్ట్రంలో 42? రిజర్వేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎంపీ మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు.



## సంపాదకీయం



# సంక్షామ హాస్టళ్ల తీరు మారేదెప్పుడు?

సంక్షేమ హాస్టళ్లు ప్రాణాలు తీస్తున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో పిల్లలు ఇటీవలి కాలంలో మృత్యు ఒడికి చేరారు. ఇందుకు రకరకాల కారణాలు ఉన్నాయి. అయితే అన్ని కారణాలు ఒకే విధంగా ఉన్నాయి. ఇందులో సర్కార్ వారి నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. విద్యారంగం, సంక్షేమ హాస్టళ్ల విషయంలో ఇరు తెలుగు రాష్ట్రాల్లో నిర్లక్ష్యం తాండవిస్తోంది. ఓట్ల పథకాలపై ఉన్న శ్రద్ధ హాస్టళ్లపై లేదు. పాఠశాలల అభివృద్ధిపై లేదు. వైద్యరంగం అభివృద్ధిపై లేదు. సర్కార్ వారి మాటలు నమ్మి పిల్లలను హాస్టళ్లకు పంపిన తల్లిదండ్రులు క్షోభకు గురవుతున్నారు. సాంఘిక, ఆర్థిక అసమానతల కారణంగా చదువులు అర్ధాంతరంగా ఆగిపోకూడదన్న సంకల్పంతో గురుకులాలు, వసతి గృహాలు ఏర్పాటయ్యాయి. ఆరోగ్యకరమైన, గౌరవ ప్రదమైన, స్వేచ్ఛాయుత పరిస్థితుల్లో ఎదిగే అవకాశాలను, సౌకర్యాలను పిల్లలకు అందిస్తూ ఉన్నత విద్యావంతులను చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. అణగారిన వర్గాల విద్య, ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సామాజిక అన్యాయం, దోపిడీల నుంచి వారిని రక్షించాల్సి ఉంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేటీకరణ విధానాలతో విద్య అంగడి సరుకుగా మారిపోయింది. రాజ్యాంగం నిర్దేశించిన కర్తవ్యాల అమలు ఊసేలేదు. సరళీకరణ విధానాలతో కుటుంబాలు గడవడమే కష్టమవుతున్న పరిస్థితుల్లో పేద, అణగారిన వర్గాలకు చెందిన లక్షల మందికిపైగా పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లే ఆధారమవుతున్నాయి. వీటికి సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడం, డైట్ ఛార్జీలు చెల్లించకపోవడం ఆనవాయితీగా మారిపోయింది. మెనూ అమలు ఊసేలేదు. పౌష్టికాహారం అందకపోవడం, తాగునీటి కాలుష్యం, అపరిశుభ్రత తదితర కారణాల వల్ల తరచూ అతిసార, విషజ్వరాలు, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులకు గురవడం సర్వసాధారణమైపోయింది. విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనలు సైతం వెలుగుచూస్తున్నాయి. తెలంగాణలో ఘనత వహించిన కెసిఆర్ పాలనలో హాస్టళ్లు ఘనంగా వెలిగాయని, ఇప్పుడు హాస్టళ్లలో మరణ మృదంగం మోగుతోందని ఇటీవలి కాలంలో కెటిఆర్ బృందం ఘోషించింది. మరి పదేళ్లలో హాస్టళ్లు బాగుంటే..బాగుచేసి ఉంటే ఇప్పుడే ఎందుకు ఈ అధ్వాన్న పరిస్థితి వచ్చిందో నాటి బిఆర్ఎస్ పాలకులు చెప్పలేకపోయారు. పదేళ్ల అధికారం మత్తులో అంతా బాగుందని ప్రచారం చేసుకున్నారు. బంగారు పళ్లెంలో పిల్లలు భోంచేస్తున్నారని బిల్డప్ ఇచ్చారు. ఇక ఇప్పుడ రేవంత సర్కార్ కూడా అంతకు మించి అన్నట్లుగా వ్యవహరిస్తోంది. రకరకాల స్కూళ్ల పేరుతో ఊదరగొడుతోంది. స్కూళ్లనే అభివృద్ధి చేసి,పిల్లలను తల్లిదండ్రులకు చేరువ చేసి,హాస్టళ్లను తగ్గించాలన్న ప్రణాళిక ఉన్నట్లు చెప్పారు. కానీ అలా జరగలేదు. స్కూళ్లలోనే హాస్టల్ వసతులు కల్పించి, పిల్లలను తల్లిదండ్రులకు చేరువ చేస్తామన్న ఆలోచన బాగానే ఉన్నా అదీ కార్యరూపం దాల్చలేదు. కస్మోటిక్ ఛార్జీలు పెంచామని చెప్పారు. కానీ ఏ హాస్టల్‌లో ఏ మేరకు సౌకర్యాలు ఉన్నాయో గుర్తించడం లేదు. అందరి సంక్షేమమే తమ లక్ష్యమంటూ ఊదరగొడుతున్న ప్రభుత్వాలు అధికారం అనుభవించడం కోసం నానా కబుర్లు చెప్పి కాలం గడిపేస్తున్నారు. చంద్రబాబు సమీక్షించని రంగం లేదు. అలాగే అడుగు ముందుకు పడిన దాఖలాలు కూడా లేవు. దీంతో హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకుంటున్న చిన్నారుల ఆలనా పాలనా పట్టించుకునే వారే లేకుండా పోయారుజ ఏళ్ల తరబడి కలుషిత నీరు తాగుతున్నా, మెనూ ప్రకారం ఆహారం అందకపోయినా, హైకోర్టు చీవాట్లు పెట్టినా పరిస్థితుల్లో మార్పేమీ రావడం లేదు. గిరిజన ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇటీవల ఓ గిరిజన హాస్టల్‌లో ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడ్డారు. మంత్రులు వెళ్లి పరామర్శించారు. హాస్టళ్లను తనిఖీ చేశారు. కానీ మార్పు లేదు. పార్వతీపురం జిల్లా కురుపాం గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో కలుషిత నీరు తాగడం వల్లే 9, 10 తరగతులు చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారు. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకూ చదువుతున్న 611 మంది బాలికల్లో 140 మంది పచ్చకామెర్లకు గురై జిల్లా కేంద్ర, విశాఖ కెజిహెచ్‌లలో చికిత్స పొందుతున్నారు.విద్యార్థులకు తగినన్ని మరుగుదొడ్లు, బాత్రూమ్‌లు లేకపోతే ఎలా? అవసాన దశలో ఉన్న హాస్టల్ భవనాలు కూలిపోతే విద్యార్థులేం కావాలి? మన ఇంట్లో పిల్లల్ని నేలపై పడుకో బెడతామా? ఏటా ప్రభుత్వం కేటాయించే కోట్ల రూపాయలు ఏమవుతున్నాయి? అన్నదానికి సమాధానం లేదు.పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు లేదనడానికి కురుపాం హాస్టల్ దుస్థితే నిదర్శనం. ఆర్ఒ సిస్టమ్ పాడై, పరిశుభ్రమైన తాగునీరు అందుబాట్లో లేకపోవడమే విద్యార్థినుల ప్రాణాంతక పచ్చకామెర్లకు ప్రధాన కారణం. పిల్లలు ఇళ్ల వద్ద చనిపోతే ప్రభుత్వానిది బాధ్యతెలా అవుతుందని, నష్టపరిహారం ఎలా ఇస్తామని పార్వతీపురం జిల్లాకే చెందిన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి వ్యాఖ్యానించారు. కనీస మౌలిక వసతులు కల్పించడంలో వైఫల్యం వల్లే వారు హాస్టళ్లలో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారన్న విషయాన్ని పట్టించుకోక పోవడం సమంజసమా? బాధితులు, గిరిజనులు డిమాండ్ చేసిన విధంగా? మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించడంతోపాటు సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. పిల్లలకు, వృద్ధులకు హాస్టళ్లు ఉన్నాయని, పశువులకు కూడా హాస్టళ్లు ఏర్పాటు చేస్తామని ఇటీవల సిఎం చ చంద్రబాబు ప్రకటించారు. పిల్లల హాస్టళ్లను మెరుగుచేయకుండా పశువులకు హాస్టల్ అనడం సమంజస మేనా? ఆర్థిక, సామాజిక అంతరాలకు అతీతంగా నవతరాన్ని తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వాలు కార్యాచరణలోకి దిగితేనే ఇటువంటి పరిస్థితులను అధిగమించగలం. ఆ దిశగా ప్రజలంతా సంఘటితంగా ఒత్తిడి తేవాలి. ప్రభుత్వాలు కూడా ఇంకా ఎంతోకాలం మభ్య పెట్టే పనులు మానుకోవాలి. స్కూళ్లను బలోపేతం చేసే యత్నాలు ముమ్మరం చేయాలి. నిధులు కేటాయించాలి. అప్పుడే భావితరం ఆరోగ్యవంతంగా చదువుకుని సమాజంలోకి అడుగపెట్టగలదు.

# ఇజ్రాయెల్, హమాస్ మొదటి దశ శాంతి ఒప్పందం

- ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకం చేశాయని ట్రంప్ వెల్లడి
- ట్రంప్ చొరవను స్వాగతించిన ప్రధాని

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:** గాజాలో యుద్ధం ముగించేందుకు ఇజ్రాయెల్, హమాస్ మొదటి దశ శాంతి ఒప్పందానికి అంగీకరించాయని, ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకం చేశాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. దీనిపై తాజాగా ప్రధాని మోదీ స్పందించారు. ట్రంప్ శాంతి ప్రణాళికకు సంబంధించి మొదటి దశ ఒప్పందాన్ని స్వాగతించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బలమైన నాయకత్వానికి ఇది అద్దంపడుతోందన్నారు. బందీలను విడుదల చేయడం, గాజా ప్రజలకు మెరుగైన మానవతా సాయం అందేలా చూడటం వల్ల శాశ్వత శాంతికి బాటలు పడతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఇజ్రాయెల్– హమాస్ మధ్య యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (ఆనీనిజీటె ÷ుసబీపూ) 21 సూత్రాల శాంతి ఫార్ములాను సూచించిన సంగతి తెలిసిందే. దానిని భారత్, రష్యా, చైనా సహా పలు దేశాలు ఆహ్వానించాయి. తాజాగా ఆ దిశగా తొలి అడుగుపడిందని అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. గాజా మొదటి దశ శాంతి



ఒప్పందానికి ఇజ్రాయెల్, హమాస్‌లు అంగీకరించినందుకు గర్వంగా ఉంది. ఈ నిర్ణయంతో హమాస్ చేతిలో బందీగా ఉన్నవారంతా త్వరలోనే విడుదల అవుతారు. ఇజ్రాయెల్ తన బలగాలను వెనక్కి తీసుకుంటుందని ప్రకటించారు. అలాగే సోమవారం బందీలు విడుదల కావొచ్చని చెప్పారు. అలాగే ఈ విషయంపై ఫోన్ కాల్‌లో ట్రంప్ మాట్లాడుతుంటే బందీల కుటుంబాలు ఆసక్తిగా వింటున్నట్లు ఉన్న ఒక వీడియోను వైట్‌హౌస్ పోస్ట్ చేసింది. శాంతి ఒప్పందాన్ని హమాస్ సైతం ధ్రువీకరించింది. గాజాలో యుద్ధానికి ముగింపు పలికేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని పేర్కొంది. ఆక్రమిత ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ దళాల పూర్తి ఉపసంహరణ, మానవత సాయానికి అనుమతి, ఖైదీల మార్పిడి చోటుచేసుకోనుందని వెల్లడించింది. ఈ ఒప్పందం వేళ.. రష్యా స్పందించింది. ట్రంప్ అత్యున్నత ప్రతిపాదనలను చేసినట్లు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ అభివర్ణించారు. ఒప్పందంలో నిబంధనలకు అందరూ కట్టుబడి ఉండాలని, గాజాలోకి అన్నిరకాల నిత్యావసరాల సరఫరాలను కొనసాగించాలని ఐరాస పేర్కొంది. ఈ పరిణామాల వేళ అమెరికా అధ్యక్షుడు 'పీస్ ప్రెసిడెంట్' అని వైట్‌హౌస్ అభివర్ణించింది. ఆయన చేతిలో ఒక్క ÷ల్ పట్టుకొని నడిచివస్తోన్న ఫొటోను షేర్ చేసింది. ఇదిలాఉంటే.. తనకు నోబెల్ శాంతి బహుమతిపై ఉన్న ఆశలను ట్రంప్ మరోసారి వ్యక్తంచేశారు. శాంతి బహుమతి విజేతను నార్వేజియన్ నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించనున్న నేపథ్యంలో దానిగురించి శ్వేతసౌధంలో రిపోర్టర్లతో మాట్లాడారు. నోబెల్ సంగతి తనకు తెలియదని, అయితే ఏడు యుద్ధాలు ఆపానని, ఎనిమిదో యుద్ధాన్ని కూడా ఆపబోతున్నట్లు చెప్పారు.

# బంగ్లాదేశీయుల అక్రమ తిష్ట

## 28మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:** ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత ప్రభుత్వం.. దేశంలోని అక్రమ వలసదారుల ఏరివేత పై ఢిల్లీ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. నివాసితుల సంక్షేమ సంఘాలను విదేశీ దేశాలకు స్థలాలను నియమించడం లేదా అద్దెకు ఇవ్వడం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. 'అక్రమ బంగ్లాదేశ్ వలసదారుల'పై పెద్ద ఎత్తున దాడిలో భాగంగా మూడు వేర్వేరు జిల్లాల్లో 28 మందిని అరెస్ట్ చేశారు. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా.. ఆగ్నేయ పోలీసు జిల్లాలో ఇద్దరు మైనర్లతో సహా 11 మంది అక్రమ వలసదారులను అదుపులోకి తీసుకున్నారు. రాజధానిలో అక్రమంగా నివసిస్తున్న 13 మంది బంగ్లాదేశ్ జాతీయులను దక్షిణ జిల్లాలో అదుపులోకి తీసుకున్నారు. ఈ రోజు ప్రారంభంలో వాయువ్య జిల్లా నుండి నలుగురు బంగ్లాదేశ్ వలసదారులను అరెస్టు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో దేశంలోని వివిధ నగరాల్లోని అక్రమ వలసదారులను గుర్తించే పనిలో పోలీసులు, ఇతర అధికారులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా సౌత్ ఈస్ట్ డిస్టిక్ట్ర పోలీసులు 28 మంది అక్రమ బంగ్లాదేశ్ వలసదారులను గుర్తించి అరెస్టు చేసింది. వారు భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్నట్లు గుర్తించింది. విచారణలో వారంత పశ్చిమ బెంగాల్‌లోని ఖుల్నా సరిహద్దు ద్వారా ఇతర వ్యక్తులతో పాటు భారత దేశంలోకి అక్రమంగా ప్రవేశించారని ఒప్పుకున్నారని తెలిపారు.. మొత్తం 28 మంది అక్రమ వలసదారులను అరెస్ట్ చేసి.. ఇప్పుడు తాత్కాలిక నిర్బంధ కేంద్రంలో ఉంచినట్లు అధికారులు తెలిపారు. అలాగే వారిని దేశం నుంచి బహిష్కరించడానికి అవసరమైన చట్టపరమైన లాంఛనాలు జరుగుతున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత.. భారత ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటి వరకు మొత్తం 235 మంది అక్రమ బంగ్లాదేశీయులను బహిష్కరించినట్లు ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు.



# సీజేఐ గవాయ్‌పై దాడి యత్నం కేసు

## రాకేశ్ సభ్యత్వాన్ని రద్దు చేసిన బార్ అసోసియేషన్

## సుప్రీంలో ఎంట్రీని నిధిస్తూ ప్రకటన విడుదల



**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:** సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ చర్యలు ప్రారంభించింది. రాకేశ్ సభ్యత్వాన్ని రద్దు చేసింది. దీంతోపాటు న్యాయస్థానం ప్రాంగణంలోకి కూడా ప్రవేశించకుండా ఆయన ఎంట్రీ కార్డును రద్దు చేసింది. తాజా ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించింది. సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పై ఓ న్యాయవాది దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఇలాంటి అస్థిరమైన ప్రవర్తన కోర్టు అధికారికి పూర్తిగా తగదని, వృత్తిపరమైన నీతిని తీవ్రంగా ఉల్లంఘించడమేనని పేర్కొంది. సుప్రీంకోర్టు గౌరవాన్ని కూడా కాలరాయడమేనని తెలిపింది. న్యాయవాది రాకేశ్ కిశోర్ చేసిన దాడి స్వతంత్ర న్యాయవ్యవస్థపై.. పవిత్రమైన కోర్టు గది కార్యకలాపాలపై జరిగిన ప్రత్యక్ష దాడిగా అభివర్ణించింది. కాగా.. ఘటన నేపథ్యంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇప్పటికే రాకేశ్ కిశోర్ లాయర్ లైసెన్స్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇటీవల ఓ కేసు విచారణ సమయంలో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై లాయర్ కిశోర్ తన కాలి బూటుతో దాడికి యత్నించారు. భద్రతా సిబ్బంది అప్రమత్తమై దాన్ని అడ్డుకొని ఆయన్ను బయటకు తరలించారు. ఈ క్రమంలో ఆయన 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీజేఐ స్పందిస్తూ.. ఇలాంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయలేవన్నారు. ఈ ఘటనను ప్రధాని మోదీతో సహా పలు రాజకీయ పార్టీల అగ్రనేతలు, న్యాయవాదుల సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు.

# బిహార్ ఎన్నికల్లో ఏఐ వీడియోలపై ఆంక్షలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 :** బిహార్ ఎన్నికల్లో ఏఐ వీడియోల వినియోగంపై ఎలక్షన్ కమిషన్ తాజాగా ఆంక్షలు విధించింది. అభ్యర్థులు తమ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా ఏఐ వీడియోలతో ఎలాంటి ప్రచారం చేయకూడదని స్పష్టం చేసింది. స్వేచ్ఛాయుత వాతావరణంలో, న్యాయబద్ధంగా ఎన్నికలు జరిగేలా ఈ చర్య తీసుకున్నట్టు చెప్పింది. కృత్రిమ మేధ దుర్వినియోగం కాకూడదని పేర్కొంది. ఏఐతో తప్పుదారి పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేయడం వంటి చర్యలకూ దూరంగా ఉండాలని పేర్కొంది. ఇతర సందర్భాల్లో ఏఐ వాడిన సమయంలో ఈ విషయాన్ని ఆయా డిజిటల్ కంటెంట్‌పై కనబడేనలా చూపించాలని కూడా ఎన్నికల సంఘం పేర్కొంది. సోషల్ మీడియాపై దృష్టి పెట్టేందుకు ఇప్పటికే ఈసీ పలు చర్యలు తీసుకుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈసీ తాజా ప్రకటనతో ఏఐ వీడియోలు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌లో(ఎమ్‌సీసీ) పరిధిలోకి వచ్చాయి. దీంతో, ఏఐకి సంబంధించిన నిబంధనలకు అన్ని పార్టీలు కచ్చితంగా కట్టుబడి ఉండాలి. ఎమ్‌సీసీ ప్రకారం, ఇతర పార్టీల ప్రోగ్రామ్‌లు, విధానాలపైనే రాజకీయ కామెంట్స్‌ను పరిమితం కావాలి. వ్యక్తిగత జీవితాలు, ప్రజాజీవితంతో నిమిత్తం లేని అంశాలను ప్రచారంలో వినియోగించకూడదు. వాస్తవాలను వక్రీకరించడం, తప్పుడు ఆరోపణలు గుప్పించడం కూడా చేయకూడదు. నవంబర్ 6 – 11 తేదీ మధ్య బిహార్ ఎన్నికలను రెండు దశల్లో నిర్వహించనున్నారు. నవంబర్ 14న తుది ఫలితాలను విడుదల చేస్తారు. ఈసారి ఎన్నికల నిర్వహణలో సుమారు 8.5 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది పాల్గొననున్నారు.

# 2లక్షల లంచం డిమాండ్‌తో దొరికిపోయిన తాసిల్దార్



**నల్లగొండ, అక్టోబర్ 9:** నల్లగొండ జిల్లా చిట్యాల మండల తహసీల్దార్ కృష్ణ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. గుండ్రంపల్లి గ్రామ పరిధిలోని వ్యవసాయ భూమికి సంబంధించన మ్యూటేషన్ కోసం రూ.2 లక్షలు డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. తహసీల్ కార్యాలయంలో వ్యూహం ప్రకారం మాటువేసిన ఏసీబీ అధికారులు గురువారం తహసీల్దార్ గుగులోత్ కృష్ణా , మరో ప్రైవేట్ వ్యక్తి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకుని నాంబర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని వెల్లడించారు. ఎవరైనా ప్రభుత్వ సిబ్బంది లంచాలకు పాల్పడితే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

# 20న తిరుమలలో దీపావళి ఆస్థానం

## ఆర్జిత సేవలను రద్దు చేసిన టీటిడి

తిరుమల, అక్టోబర్ 9: తిరుమల శ్రీవారి ఆలయంలో దీపావళి పండుగ సందర్భంగా అక్టోబరు 20 తేదీన దీపావళి ఆస్థానాన్ని టీటీడీ శాస్త్రోక్తంగా నిర్వహించనుంది. దీపావళి ఆస్థానం కారణంగా అక్టోబరు 20న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.దీపావళి నాడు ఉదయం 7 నుండి ఉదయం 9 గంటల వరకు బంగారు వాకిలి ముందు గల ఘంటా మండపంలో దీపావళి ఆస్థానం జరుగుతుంది. ఆస్థానంలో భాగంగా శ్రీమలయప్పస్వామి దేవేరులతో కలిసి ఘంటా మండపంలో ఏర్పాటుచేసిన సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేస్తారు. సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనులవారిని కూడా స్వామివారి ఎడమ పక్కన మరొక పీఠంపై దక్షిణ ఆభిముఖంగా వేంచేపు చేస్తారు. ఆ తరువాత స్వామివారికి ప్రత్యేక పూజ, హారతి, ప్రసాద నివేదనలను అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. దీంతో దీపావళి ఆస్థానం పూర్తవుతుంది. కాగా సాయంత్రం 5 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని, ఆలయ నాలుగు మాడ వీధులలో విహరించి భక్తులను కటాక్షించనున్నారు.



# మార్కెట్ కమిటీల్లో మౌలిక సదుపాయాలకు మాస్టర్ ప్లాన్

మొదటి పేజీ తరువాయి

కార్పొరేషన్ ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఖరీఫ్ సాగు, రబీ ప్రణాళిక, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై సమీక్షలో చర్చించారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో గ్రాస్ వాల్యూ అడిషన్ పై సీఎం దిశా నిర్దేశం చేశారు. అలాగే ఈ నెల 11వ తేదీన ప్రధాని మోదీ ప్రారంభించనున్న పీఎం ధన్ ధాన్య కృషి యోజనపై కూడా సమీక్షలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."రైతులకు లాభం రావాలి... వినియోగదారునికి ప్రయోజనం కలగాలి. ఈ విషయంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పని చేయాలి. రైతు బజార్లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి. పత్తికొండలో ఇటీవల కాలంలో టమాటో పంటకు ధర తగ్గింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ పంటను రైతు బజార్లకు తరలించి.. వినియోగదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలి. కోల్డ్ చైన్ లాంటి వ్యవస్థలను ఉపయోగించుకుని టమాటో పంటలకు ధర తగ్గకుండా చూసుకోవాలి. రైతు బజార్లను ఆధునీకరించాలి. అర్బన్ ప్రాంతాల్లో రైతు బజార్ల ఆధునికీకరణకు భూమి ఎంత వరకు అవసరమవుతుందో అంచనా వేయాలి. రైతు బజార్లకు అనుసంధానంగా మొబైల్ రైతు బజార్లను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించండి. మార్కెట్ కమిటీలను, రైతు బజార్లను అనుసంధానం చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. దీని ద్వారా నిధుల సమీకరణ చేపట్టి... వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పన జరిగేలా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను సద్వినియోగం చేసుకుంటూ కోల్డ్ చైన్, అగ్రి ప్రాసెసింగ్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలి." అని సీఎం ఆదేశించారు.

**ఎరువుల వినియోగం తగ్గించేలా రైతుల్లో అవగాహన**

"రైతు సేవా కేంద్రాలను పునర్ వ్యవస్థీకరించేలా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకోవాలి. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడిన రైతులకు సేవలందించేలా రైతుసేవా కేంద్రాలను తీర్చిదిద్దాలి. రైతులకు వివిధ రకాల ప్రభుత్వ సేవలు అందించే విషయంలో రైతుసేవా కేంద్రాలే కీలక పాత్ర పోషించాలి. ఎక్కువ యూరియా వేస్తే ఎక్కువ పంట వస్తుందని.. ఆదాయం వస్తుందని రసాయన ఎరువులు, పురుగు మందులు ఎక్కువ వాడేస్తున్నారు. తద్వారా భూసారం క్షీణించడంతో పాటు వ్యాధులు వస్తున్నాయి. రసాయన ఎరువులు అధికంగా ఉపయోగించిన ఉత్పత్తుల వినియోగం కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. మంచి పోషక విలువలు అందించటం ద్వారా భూసారం పెంచాలి... దాని ద్వారా ఉత్పాదకత పెంచాలి. 2026 ఖరీఫ్ సీజన్లో సేంద్రీయ సాగు పెంచేలా, ఎరువుల వినియోగం తగ్గించేలా రైతుల్లో అవగాహన పెంచాలి. ప్రకృతి సేద్యం ద్వారా పర్యావరణంతో పాటు ఆరోగ్యపరంగా, ఆర్థికంగా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలి. ఎలాంటి మార్పులు జరగాలన్నా... క్షేత్రస్థాయిలో ఉండేవారికి పూర్తి స్థాయి అవగాహన ఉండేలా చూడాలి. భూసారం పెంచే పోషకాల విషయంలో లోపాలను సవరించి తదుపరి ప్రణాళికలు చేసుకోవాలి. దశలవారీగా రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి." అని సీఎం అన్నారు.

**రబీ సీజన్‌కు పక్కా ప్రణాళిక**

"రబీ సీజన్ కోసం 23 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని సమీక్షలో అధికారులు వివరించారు. ఇప్పటికే జిల్లాలకు 41 వేల మెట్రిక్ టన్నుల యూరియాను జిల్లాలకు సరఫరా చేశామని అధికారులు చెప్పారు. పోర్టుల్లో 79,527 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలున్నాయని వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."రబీ సాగు కోసం భూసార పరీక్షలు చేసి... ఆ డేటా ప్రకారం మైక్రో న్యూట్రియంట్స్ వేసుకునేలా రైతును ప్రోత్సహించండి. వచ్చే సీజన్‌కు భూసార పరీక్షలపై ఓ ప్రామాణిక విధానాన్ని రూపొందించండి. దుకాణాల వారీగా, రైతుసేవా కేంద్రాల వారీగా రికార్డులు నవీకరణ



చేయాలి. భూసార పరీక్షల రిపోర్టుల ఆధారంగా ఎకరాకు ఎంత ఎరువు వినియోగించాలో రైతులకు దిశా నిర్దేశం చేయాలి. యూరియా ఎవరు తీసుకున్నారనే విషయాన్ని పూర్తి స్థాయిలో రికార్డులు నిర్వహించాలి. రైతులు, కౌలు రైతులకు ఎంత యూరియా సరఫరా చేశారన్న అంశంపై రికార్డులు పక్కాగా ఉండాలి. సాగు విస్తీర్ణం ప్రకారం ఎరువుల సరఫరా జరగాలి. యూరియాను డైవర్ట్ చేసిన ఉదంతాలు ఇటీవల కాలంలో చూశాం. ఆధార్ ఆథంటికేషన్ చేసి ఎరువుల సరఫరా జరగాలి. ఈ ఏడాది 90.91 లక్షల మెట్రిక్ టన్నుల మేర పంట ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. 51 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం. ఇది గత ఏడాదితో పోలిస్తే 44 శాతం అధికం. టార్పాలిన్లు రైతులకు అందుబాటులో ఉంచాలి." అని చంద్రబాబు చెప్పారు.

**ధన-ధాన్య కృషి యోజన కింద రైతులకు కలిగే లాభాలపై అధ్యయనం**

"హెడ్డీ బర్లీ పొగాకును రైతులు తక్కువ ధరకే అమ్ముకోకుండా చూడాలి. ప్రభుత్వం కొనుగోలు చేసిన పొగాకుకు రైతులకు రూ.96 కోట్లు చెల్లింపు చేశాం. హెచ్డీ బర్లీ పొగాకు పంటకు మార్కెట్ ఉండేలా చూడాలి. దీని కోసం పంటను కూడా అవసరమైన మేరకు నియంత్రించుకోవాల్సిన అవసరం ఉంది. నాలుగు జిల్లాల్లో పొగాకుకు క్రాప్ హాలిడే ప్రకటించండి. త్వరలో ప్రధాని ప్రారంభించబోయే ధన-ధాన్య కృషి యోజన కింద ఏ పంటకు ఎక్కువ లాభం వస్తుందో చూసుకుని ఆ పంటలను ప్రోత్సహించాలి. పప్పు దినుసుల విషయంలో వందశాతం కొనుగోళ్లు చేస్తామని కేంద్రం చెబుతోంది. ఈ పథకంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలి.. రైతులకు ఎంత వరకు లబ్ధి చేకూరుతుందో చూడండి. గతంలో ఏపీ కంటే కర్ణాటకలో సెరీకల్చర్ సాగు తక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు కర్ణాటక రాష్ట్రం... ఏపీ కంటే 8 రెట్లు అధికంగా సెరీకల్చర్ రంగంలో ఉత్పత్తి చేస్తోంది. ఎందుకు ఈ స్థాయిలో గ్యాప్ వచ్చిందో విశ్లేషించండి. సిల్క్ ఉత్పత్తికి సంబంధించి యంత్రాలను ఎంఎస్ఎంఈలో పెట్టి.. వాటిని సబ్సిడీ మీద సరఫరా చేసేలా చూడండి. బిల్ గేట్స్ ఫౌండేషన్ తో అగ్రిటెక్ పై కూడా పని చేస్తున్నాం. సెరీ కల్చర్ విషయంలో బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారం తీసుకోండి. పట్టు పురుగుల సాగు ఉండే చోట ఇతర పంటల సాగులో ఎరువుల వినియోగం తక్కువగా ఉండేలా చూడండి. వ్యవసాయ -సెరీకల్చర్ శాఖలు సమన్వయంతో పని చేయాలి. ప్రతీ పంటపైనా వ్యవసాయ విశ్వవిద్యాలయాలు అధ్యయనం చేయాలి. రైతులకు వచ్చే పంట ఆదాయం, ఇతర ప్రత్యామ్నాయాలపై రీ-ఓరియంటేషన్ జరగాలి." అని ముఖ్యమంత్రి సూచించారు.

**ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా ప్రొత్సాహం**

"ఉల్లి, టొమాటో, మిర్చి, మామిడి పంటల విషయంలో సాగు ఖర్చులు ఎంత వరకు ఉన్నాయో ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలి. ఆయా పంటలకు ధరలు తగ్గకుండా ప్రణాళికలు చేసుకోవాలి. టేబుల్ వెరైటీతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు పంపితే అసలు ధరలు పడిపోయి నష్టం వాటిల్లే అవకాశం ఉండదు. స్థానిక అవసరాలు, ఎగుమతులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ఎంతమేర పంపించాలన్న దానిపై ముందస్తు ప్రణాళికలు ఉండాలి. అరటి పంటకు దేశీయంగానూ, విదేశాల్లోనూ పెద్ద ఎత్తున వినియోగం ఉంది. ఉద్యాన పంటలను దేశీయ మార్కెట్లతో పాటు ఎగుమతులు చేసేందుకు, లాజిస్టిక్స్ సవాళ్లు లేకుండా చూసుకోవాలి. వ్యవసాయ రంగంలో అనుబంధ ఉత్పత్తులుగా వచ్చే పుట్టగొడుగుల సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి. సర్క్యులర్ ఎకానమీలోకి పుట్ట గొడుగుల సాగును తీసుకురావాలి. రాష్ట్రంలో ఉన్న ఆవుల విసర్జితాలతో జీవామృతం తయారు చేసి ప్రకృతి వ్యవసాయానికి అనుసంధానించాలి. ఆవు పేడను దుబాయ్ దేశంలో ఖర్జూరపంటకు ఎరువుగా వినియోగిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో కూలీల వ్యయం తగ్గేందుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలి. ప్లాంటేషన్, హార్వెస్టింగ్ మేనేజ్మెంట్ అనేదే పకృతి సేద్యంలో కీలకం. కాఫీ గింజలకు సోకిన బెరిబోరర్ తెగులు నివారణకు జీవామృతం వినియోగించాలి." అని ముఖ్యమంత్రి చెప్పారు.

**జీలుగ, పట్టు ఉత్పత్తులను పరిశీలించిన సీఎం**

ఈ సమీక్ష సమావేశంలో జీలుగు ఉత్పత్తులను సీఎం చంద్రబాబు పరిశీలించారు. గిరిజన ప్రాంతాల్లో తయారు చేసిన జీలుగు బెల్లాన్ని ముఖ్యమంత్రి రుచి చూశారు. అరకు కాఫీ తరహాలోనే జీలుగు ఉత్పత్తులను ప్రోత్సహించాలని సీఎం ఆదేశించారు. అటవీ ప్రాంతంలో వెదురు ఉత్పత్తుల విషయంలో దృష్టి సారించాలన్నారు. గిరిజన రైతులకు ఎక్కువ ఆదాయం లభించేందుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలని సీఎం సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి వివిధ పంటలకు సంబంధించిన మద్దతు ధరలు ప్రకటిస్తూ ముఖ్యమంత్రి పోస్టర్ రిలీజ్ చేశారు. నాణ్యమైన పట్టుగూళ్లతో తయారు చేసిన ఉత్పత్తులను సీఎం చంద్రబాబు పరిశీలించారు. పట్టుగూళ్లతో తయారు చేసిన వస్త్రాలను, బొకేలను రాష్ట్రానికి వచ్చిన అతిథులకు అందించే దిశగా ఆలోచన చేయాలని సీఎం సూచించారు. పట్టుగూళ్లతో తయారు చేసిన బొకేను మంత్రి అచ్చెన్నాయుడు అందించి.. మల్బరీ పట్టు వస్త్రాన్ని సీఎం చంద్రబాబుకు బహుకరించారు.

## నేడు నెల్లూరు జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన

**అమరావతి :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు అమరావతి సచివాలయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సీఎం నెల్లూరు చేరుకోనున్నారు. నెల్లూరు అర్బన్ లోని మైపాడు గేట్ వద్ద చిరు వ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. 30 కంటైనర్లతో సిద్ధం చేసిన 120 షాప్ లను సీఎం పరిశీలించనున్నారు. ఆ కార్యక్రమం అనంతరం వెంకటాచలం మండలం, ఎడగాలి గ్రామానికి చేరుకుని అక్కడ నిర్మించిన నంద గోకులం లైఫ్ స్కూల్‌ను సీఎం ప్రారంభిస్తారు. అక్కడి విద్యార్థులతో ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు. అక్కడికి సమీపంలోనే గోశాలకు హాజరై నంది పవర్ ట్రెడ్ మిల్ మిషిన్, నంద గోకులం సేవ్ ద బుల్ ప్రాజెక్టులు, ఎడగాలిలో నూతనంగా నిర్మించిన విశ్వసముద్ర బయో ఎనర్జీ ఎథనాల్ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం సాయంత్రం 6.30 గంటలకు సీఎం విజయవాడ చేరుకోనున్నారు.

# ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తాం

మొదటి పేజీ తరువాయి

పాల్గొని ఆయన మాట్లాడారు. ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణంపై ఈ నెల 14న సమావేశం ఉందని గుర్తు చేశారు. ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణంపై ఈనెల 14న సమావేశం నిర్వహిస్తామని, అలానే ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తామని మత్స్యకారులకు పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఇక పవన్ కల్యాణ్ మాట్లాడుతూ..' రూ.323 కోట్లతో సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి కేంద్రం సానుకూలం ఉంది. ఉప్పాడ-కొణపాక మధ్య తీరరక్షణ పనులు ప్రారంభించాం. పరిశ్రమల వ్యర్థాల శుద్ధిపై మూడు విడతల్లో పరిశీలిస్తాం. మత్స్యకారులు ఎక్కడికి చెబితే అక్కడికి మూడ్రోజుల్లో వస్తాను. వ్యర్థాలు ఎక్కడ కలుస్తున్నాయో.. అక్కడికే బోటులో వెళ్తాను. ప్రజలను వంచించాలని నాకు ఎప్పుడూ ఉండదు. ప్రజలకు న్యాయం చేయలేనప్పుడు రాజకీయాలు వదిలేసి వెళ్లిపోతాను. 100 రోజుల సమయం ఇస్తే.. కాలుష్యం తగ్గింపుపై ప్రణాళిక రూపొందిస్తాను' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. కాకినాడలోని కలెక్టరేట్ లో ఉప్పాడ ప్రాంతానికి చెందిన మత్స్యకార ప్రతినిధులు, అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడిన పవన్ వారి సమస్యలను తెలుసు కున్నారు. ఈ సమావేశంలో ఉప్పాడ మత్స్యకారుల సమస్యలపై చర్చించామని పవన్ కల్యాణ్ తెలిపారు. చేపల వేటపై 7



వేలకు పైగా కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఏటా రూ.20 వేలు ఇస్తున్నామని డిప్యూటీ సీఎం అన్నారు. పరిశ్రమల వ్యర్థాల వల్ల మత్స్య సంపద తగ్గిపోతోందనే ఆందోళన ఉందన్నారు. పరిశ్రమలకు వ్యతిరేకం కాదని మత్స్యకారులు చెబుతున్నారు. పరిశ్రమల వ్యర్థాల వల్ల మత్స్యసంపద తగ్గిపోతుందని ఆందోళన చెందుతున్నారు. వ్యర్థాలను శుద్ధి చేయకుండా వదలడం వల్ల మత్స్యసంపద దెబ్బతింటుందని చెబుతున్నారు. ఈ సమస్యను మనమంతా కలసి పరిష్కరించుకుందామని హామీ ఇచ్చారు.

# పేదలకు వైద్యం అందకుండా కుట్రలు



మొదటి పేజీ తరువాయి

అన్యాయానికి లోనుచేస్తారని జగన్ ఆరోపించారు. తమ పాలనలో ప్రతి జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయబడిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రైవేట్ ఆస్పత్రులు ఎక్కువ ఛార్జీలు వసూలు చేయడం వల్ల పేదవారికి వైద్యం అందించడం అసాధ్యమవుతుందని, అందుకే ప్రభుత్వ వైద్య కళాశాలలు అందుబాటులోకి తెచ్చినట్లని పేర్కొన్నారు. నర్సీపట్నంలో 52 ఎకరాల్లో మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టడం, కోవిడ్ సంక్షోభంలో రూ.500 కోట్లు ఖర్చు చేసి, ఈ మెడికల్ కాలేజీ పూర్తయిన తర్వాత 600 బెడ్లతో పేదలకు ఉచిత వైద్యం అందించనున్నట్టు జగన్ అన్నారు. అయితే, ప్రైవేట్ పరంగా మార్చడం వల్ల పేదవారికి వైద్యం ఎలా అందుతుందన్న ప్రశ్నను జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 17 మెడికల్ కాలేజీలలో ఏడు కాలేజీలు పూర్తయ్యాయని.. అందులో 5 కాలేజీలలో 2023-24 సీట్లతో క్లాసులు ప్రారంభమయ్యాయని ఆయన అన్నారు. విజయనగరం, పాడేరు మెడికల్ కాలేజీల క్లాసులు కూడా మొదలైనట్లు జగన్ పేర్కొన్నారు. ఐతే అమరావతిలో లక్ష ఎకరాల భూమి, రోడ్లు, డ్రైనేజ్, కరెంట్, నీళ్లు కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నా, మెడికల్ కాలేజీలకు 5,000 కోట్లు ఖర్చు చేయలేదని, వాటిని ప్రైవేట్ పరంగా మార్చడం పేదవారికి అన్యాయం చేస్తున్నదని ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ ఆధునిక మెడికల్ కాలేజీలు పేదలకు ఉచిత వైద్యం, మెడిసిన్ చదవడానికి అవకాశాలు అందించే దేవాలయాలు, వాటిని ప్రైవేట్ పరంగా మారుస్తూ రాజకీయ లాభాల కోసం వినియోగించడం తట్టుకోలేమని ఆయన అన్నారు. జగన్ వెంట బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, విడుదల రజని తదితరులు ఉన్నారు.

# ఆంక్షలు బేఖాతర్

## జగన్ కాన్వాయ్‌లో భారీగా జనం రాక

## అడుగడుగునా జనంతో మమేకం

## స్టీల్ ప్లాంట్ కార్మికులకు భరోసా

**అనకాపల్లి :** మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అనకాపల్లి జిల్లా పర్యటన నేపథ్యంలో జాతీయ రహదారిపై జనం గుమిగూడొద్దని పోలీసులు ఆంక్షలు విధించినా అందుకు విరుద్ధంగా వైకాపా శ్రేణులు భారీగా చేరారు. అయితే, రోడ్డు మార్గంలో వెళ్తున్న జగన్‌ను కలిసేందుకు ప్రజలు, వైకాపా కార్యకర్తలు రోడ్లపైకి చేరుకున్నారు. పోలీసులు విధించిన ఆంక్షలను జగన్ లెక్కచేయకుండా మార్గమధ్యంలో అక్కడక్కడా ఆగుతూ ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల అంబులెన్సులు సైతం వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. విశాఖపట్నంలో జగన్ రోడ్ షో జనసందోహం మధ్ద కొనసాగింది. తాడేపల్లిలోని తన నివాసం నుంచి విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ఆయన విశాఖ ఎయిర్ పోర్ట్ నుంచి నర్సీపట్నం రోడ్డు మార్గాన బయల్దేరారు.. పోలీసులు షరతుల మధ్య జగన్ టూర్ పై ఉత్కంఠ కొనసాగగా, పోలీసులు నిర్దేశించిన పెందుర్తి., అనకాపల్లి మీదుగా మెడికల్ కాలేజ్ దగ్గరకు చేరుకున్నారు. కాకాని నగర్ దగ్గర వైఎస్ జగన్‌ను వైజాగ్ స్టీల్ ఎ÷-లాంట్ కార్మికులు కలిశారు.. ఈ సందర్భంగా తమ సమస్యలపై జగన్‌కు వినతి పత్రం అందజేశారు. స్టీల్ ప్లాంట్ కార్మికులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని జగన్ భరోసా ఇచ్చారు.. 10 నిముషాలకు పైగా కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడారు. ఆ తర్వాత రోడ్ షోలో జగన్ ను కలిశారు న్యాయవాదులు.. తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు.. అండగా ఉంటానని లాయర్లకు హామీ ఇచ్చారు.. మరోవైపు, వైఎస్ జగన్‌ను కలిసేందుకు బల్క్ డ్రగ్ పార్క్ బాధితులు.. నక్కపల్లి మండలానికి చెందిన 16 గ్రామాల మత్స్యకారులు రాగా.. జి.భీమవరం వద్ద పోలీసులు అడ్డుకున్నారని వైసీపీ నేతలు చెబుతున్నారు.. జగన్‌ను కలిసేందుకు అనుమతి లేదని పోలీసుల అంటుండగా.. కలిసి తీరుతామని పట్టుబట్టారు మత్స్యకారులు. అయితే, వైఎస్ జగన్ రోడ్డు షోకు పెద్ద ఎత్తున తరలివచ్చారు వైసీపీ శ్రేణులు.. ఓవైపు పోలీసులు ఆంక్షలు ఉన్నా.. వాటిని లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో వచ్చి జగన్‌కు స్వాగతం పలికారు.. ఇక, వారికి అభివాదం చేస్తూరోడ్‌లో ముందుకు సాగారు.

# అభివృద్ధిని అడ్డుకునే కుట్రలో జగన్

**అమరావతి :** అభివృద్ధిని అడ్డుకునేందుకు జగన్ అనేక కుట్రలు చేస్తున్నారని వైద్యారోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. కోర్టుల్లో పిటిషన్లు వేసిన సందర్భాలూ చాలా ఉన్నాయన్నారు. గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. పేదలకు మంచి చేయాలనే పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. మెడికల్ కళాశాల్లో ఎన్ని మొండి గోడలు ఉన్నాయో అందరూ చూశారు. పీపీపీ విధానంలో ప్రైవేటుకు అమ్మేస్తున్నారంటూ వైకాపా నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారు. శాసనసభ, మండలిలో చర్చకు రమ్మంటే పారిపోయారు. కేవలం అబద్ధాలే ఆలంబనగా జగన్ ప్రచారం చేస్తున్నారు. నర్సీపట్నం పర్యటనకు కారణమేంటో జగన్ స్పష్టంగా చెప్పగలరా అని ప్రశ్నించారు. ప్రజల్ని రెచ్చగొట్టేలా బలప్రదర్శనకే ఆయన పర్యటించారు తప్ప ప్రజలపై ప్రేమతో కాదన్నారు. గతంలో అనేక ప్రాంతాల్లో ఆయన పర్యటనకు ఎలా సాగాయో చూశాం. మెడికల్ కాలేజీలపై జగన్‌కు ఎలాంటి చిత్తశుద్ధి లేదు. కేవలం ఆర్భాటం, హడావుడి కోసమే పర్యటనలు చేస్తున్నారు. పిపిప మోడల్‌లో యాజమాన్య హక్కులు ప్రభుత్వం వద్దే ఉంటాయి.. పీపీపీ విధానంతో వచ్చిన నష్టమేంటన్నారు. ప్రైవేటుపరం చేస్తున్నారని చెప్పడం తప్పు.. అది వాస్తవమని నిరూపించారా? మెడికల్ కాలేజీలకు రూ.8500 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉండగా రూ.1,550 కోట్లే వెచ్చించారు. ఒక్క పులివెందుల కాలేజీకే మొత్తం నిధులు ఇచ్చారు. జగన్ రాష్ట్రానికి సీఎంగా చేశారా.. ఒక్క పులివెందులకేనా? వికృత మనస్తత్వం ఉన్న జగన్‌కు ఏపీ అభివృద్ధి కావడం ఇష్టం లేదు. 5.కి.మీకు హెలికాప్టర్‌లో వెళ్లిన ఆయన.. 60కి.మీ రోడ్డుపై వెళ్లేందుకు అనుమతి అడుగుతున్నారు. విశాఖలో గతంలో ఎన్ని దారుణాలు చేశారో ప్రజలు చూశారు. ఉత్తరాంధ్రలో గిరిజనవర్సిటీ రాకుండా అడ్డుకున్నారు. ఇప్పుడు ఆ ప్రాంతాలకు వెళ్లి పరిశీలిస్తే జగన్‌కి వాస్తవం తెలుస్తుందని సత్యకుమార్ యాదవ్ అన్నారు.

# పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలో అప్పుల బాధతో రైతు హత్మ అత్య





**వరంగల్ అక్టోబర్ 9. (సమయం న్యూస్) :** పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన మద్దెల శ్రీనివాస్ (42) అప్పుల బాధతో మనస్తపనికి గురై బుధవారం రాత్రి ఇంట్లో ఊరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు ఈరోజు ఉదయం MGM మార్చుర్ కి తరలించగా ఈ విషయం తెలియగానే అక్కడికి వెళ్లి వైద్యులతో మరియు పోలీస్ అధికారులతో మాట్లాడి శవ పంచనామా చర్యలు తీసుకొమ్మని కుటుంబ సభ్యులను పరామర్శించిన సొసైటీ ఛైర్మెన్ యం. మనోజ్ గౌడ్ గారు మాజీ వైస్ ఎంపీపీ మరియు BRS మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు గారు మాజీ సర్పంచ్ చిన్నపాక శ్రీనివాస్ గారు సొసైటీ డైరెక్టర్ తాళ్లపెల్లి సంపత్ గారు దొమ్మటి రాజు గారు

## మృతురాలు పార్థిక దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపనేని నరేందర్.



**వరంగల్ అక్టోబర్ 9. (సమయం న్యూస్) :** వరంగల్ తూర్పు నియోజకవర్గం మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్ సోదరి గుండెపోటుతో మరణించగా ఈరోజు వారి నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి మరియు వారిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన లిగ్రేటర్ వరంగల్ తొలి మేయర్ మరియు వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ . ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు మహిళ నాయకురాలు మరియు యువజన నాయకులు పరామర్శించడం జరిగినది.

# ప్రయాణికుల సౌకర్యాలే బీజేపీ ప్రభుత్వ ధ్యేయం

● బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు



**ఖమ్మం, అక్టోబర్ 9 : ( సమయం న్యూస్ )** ఖమ్మం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల పురోగతిని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణంలో జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన రైల్వే అధికారులతో కలిసి సమీక్షించి, అవసరమైన సూచనలు చేశారు. ఖమ్మం రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం రూ. 25.41 కోట్ల నిధులు కేటాయించబడి, పనులు దశలవారీగా వేగంగా సాగుతున్నాయి. ఈ స్టేషన్ ద్వారా రోజూ 83 రైళ్లు ప్రయాణికులకు సేవలందిస్తున్నాయి. సూపర్‌ఫాస్ట్ రైళ్లు, ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ప్రధాన నగరాలకు వెళ్లే పలు రైళు ఇక్కడ ఆగుతుండటంతో ఖమ్మం రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది అని తెలిపారు. స్టేషన్ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ప్రధాన భవనం ముఖద్వారం పునర్నిర్మాణం, ఆకర్షణీయమైన ప్రధాన ప్రవేశ ద్వారం నిర్మాణం, 12 మీటర్ల వెడల్పు గల ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం, రెండు ఎస్కలేటర్లు, రెండు లిఫ్టులు ఏర్పాటు, ఆధునిక వేటింగ్ హాల్స్, శుభ్రమైన వాష్‌రూములు, డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు, విస్తృత పార్కింగ్ సదుపాయాలు వంటి పనులు జరుగుతున్నాయి. అదనంగా ప్రయాణికుల భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు, సెక్యూరిటీ కంట్రోల్ రూమ్ వంటి ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ప్రయాణికుల రక్షణ కోసం సిఆర్పిఎఫ్ పోలీస్ స్టేషన్ భవనం నిర్మాణం కూడా కొనసాగుతోంది అని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సేవలు అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతోంది. అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత ఖమ్మం రైల్వే స్టేషన్ తెలంగాణ రాష్ట్రంలో ఒక మోడల్ స్టేషన్‌గా నిలుస్తుంది. ఇది ఖమ్మం ప్రజలకు గర్వకారణంగా మారుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి డి. వాసుదేవరావు, పాలేరు నియోజకవర్గ మాజీ అభ్యర్థి నున్న రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు, జిల్లా సెక్రటరీ తొండెపు సైదేశ్వరరావు, జిల్లా నాయకులు వేల్పుల సుధాకర్, మంద సరస్వతి, మార్తి ప్రసాద్, ఈదుల భద్రం, గడిల నరేష్, ఆర్.వి.ఎస్. యాదవ్, దుద్దుకూరి కార్తీక్, పసుమర్తి సతీష్, డి.కొండ శ్యామ్, శాసనాల సాయిరాం, మండల నాయకులు పాలెపు రాము, కడుదుల ప్రభాకర్, నాగవల్లి రామచంద్రం, గుత్తా వంశీ, భూక్య బాలాజీ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ టికెట్ ధరల పెంపును నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు నిర్వహించిన ఛలో బస్ భవన్.

**మేడ్చల్ మల్కాజిగిరి సమయం న్యూస్ అక్టోబర్ 9. :** మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గారు మల్కాజిగిరి చౌరస్తా నుండి ఆర్టీసీ బస్సులో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్పొరేటర్లు కార్యకర్తలతో కలిసి బస్ భవన్ వైపు ప్రయాణించారు. ప్రజలపై భారంగా మారుతున్న టికెట్ ధరల పెంపు తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ప్రజలకు ప్రయాణ సౌకర్యం కల్పించాల్సిన ఆర్టీసీని లాభాపేక్ష సంస్థగా మార్చి సామాన్యుడి మీద భారం మోపే విధంగా టికెట్ ధరల పెంపు కొనసాగుతోంది. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలుస్తూ దీన్ని తీవ్రంగా ఖండిస్తుంది” అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్ మురుగేష్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, జేఏసీ వెంకన్న జి కె హనుమంతు రావు రాము యాదవ్ అమీనుద్దీన్ చిన్న యాదవ్ మధుసూదన్ రెడ్డి, డోలి రమేష్, శోభన్ బాబులక్ష్మణ్ యాదవ్ శివ గౌడ్, ఉస్మాన్ వంశీ ముదిరాజ్ రాజశేఖర్ రెడ్డి, హేమంత్ పటేల్, నర్సింగ్ రావు సాయి గౌడ్ సుమన్ గౌడ్ సంపత్ యాదవ్



హేమంత్ రెడ్డి ఉపేందర్, అరవింద్ వాసు మల్కాజిగిరి యువజన నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ నాయకులంతా శాంతియుతంగా నిరసన తెలియజేశారు.

# ఆసుపత్రి ఎదుట ధర్నా,నిరసన వ్యక్తం చేసిన బిజెపి నాయకులు

- గజ్వేల్ పట్టణంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అసౌకర్యాల వల్ల, వైద్యుల నిర్లక్ష్యాల వల్ల ప్రజల ఇబ్బందుల దృశ్య..
- గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆస్పత్రిని సందర్శించి, అనంతరం ఆసుపత్రి ఎదుట ధర్నా, నిరసన వ్యక్తం చేసిన బిజెపి నాయకులు..
- వైద్య సేవల కొరకు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ప్రజలను ప్రవేట్ ఆసుపత్రులకు సిఫార్సు చేయడాన్ని నిరసిస్తూ బిజెపి ధర్నా, నిరసన..



**సమయం న్యూస్ గజ్వేల్ అక్టోబర్ 9 :** ఈ సందర్భంగా బిజెపి గజ్వేల్ పట్టణ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, టెలికాం బోర్డ్ మెంబర్ బిజెపి నాయకులు కమ్మరి శ్రీను మాట్లాడుతూ :-చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన పేషెంట్లను ఏదో ఒక కారణంతో ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తూ నిర్లక్ష్య వైఖరిని వైద్యులు ప్రదర్శిస్తున్న విషయం మా దృష్టికి వచ్చిందని, మునుపు ఇదే ఆస్పత్రిలో కనీసం రోజుకు 30 డెలివరీ కేసులు ఉండేటివి కానీ ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా తగ్గడానికి గల కారణాలు ఏంటని ప్రశ్నించారు, ప్రతి చిన్న వైద్య పరీక్షలు కూడా ప్రైవేటు పరీక్షా కేంద్రాలకు పంపి పేద ప్రజల నడ్డి విరిచే ప్రయత్నం చేస్తున్నారని ఇట్టి వైఖరిని వీడకుంటే పై స్థాయిలో అధికారుల వినతిపత్రం ఇచ్చి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వరకు ఈ సమస్యను తీసుకెళ్తామని ఆర్ ఎమ్ ఓ గారికి మీడియా ముఖంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు సుభాష్ చంద్రబోస్ మరియు రామచంద్ర చారి, సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు నత్తి శివకుమార్, సిద్దిపేట జిల్లా కౌన్సిల్ సభ్యులు చేప్యాల వెంకటరెడ్డి, గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శులు,మాదుగురి నరసింహ ముదిరాజ్, నాయిని సందీప్ కుమార్, బిజెపి కార్యదర్శులు తలారి రాజు ముదిరాజు, చిక్కుడు ప్రసాద్ ముదిరాజ్ పంజాల శివ గౌడ్, బిజెపి కోశాధికారి హరికుమార్, సీనియర్ నాయకులు, జిల్లా రమేష్, నాగు ముదిరాజ్, పెండ్యాల శ్రీనివాస్, కదుల దేవేందర్, మంగలపల్లి సత్యనారాయణ, బల మహేందర్, నిరంజన్ రెడ్డి, వేణుగోపాల్ రాజు, నరసింహ చారి, నాగులపల్లి పవన్ కుమార్, మహిళా మోర్చా జిల్లా నాయకురాలు ఆలేటి సుమతి , గజ్వేల్ బిజెపి ఉపాధ్యక్షురాలు చిన్నోజి నీరజ, గజ్వేల్ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి శివలింగ్ వినోద్, ఉపాధ్యక్షురాలు మంతూరి మమత కార్యదర్శి చింత సరిత, బూత్ అధ్యక్షులు కాలసాయి ముదిరాజ్, తుప్పతి నరేష్, సీనియర్ మహిళ నాయకురాలు స్వరాజలక్ష్మి భక్తమాల తదితరులు పాల్గొన్నారు.

# స్టే విధించడం బాధాకరం..

● ఉమ్మడి పాలమూరు జిల్లా ముదిరాజ్ సంఘం సీనియర్ నాయకులు చందన గారి వేణుగోపాల్ ముదిరాజ్



**కోస్గి మున్సిపాలిటీ (మం)అక్టోబర్,09(సమయం న్యూస్) :** బీసీ కులాల కు సంబంధించిన 42 శాతం రిజర్వేషన్స్ పై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం స్టే విధించడం బాధాకరమని ఉమ్మడి పాలమూరు జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బీసీ సంఘం సీనియర్ నాయకులు చందన గారి వేణుగోపాల్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం కోస్గి పట్టణ కేంద్రంలో గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లకు అన్ని విధాల వెనుకబడిన బీసీ కులాల వారు అర్హులని ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రిజర్వేషన్స్ పై కొందరు కోర్టుకు వెళ్లడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు జరిగే వరకు పోరాటం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. 42 శాతం రిజర్వేషన్ సాధించేవరకు రాష్ట్రంలోని బీసీల అందరితో కలిసి పోరాటం సాగుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కొడంగల్ తాలూకా బీసీ సంఘం అధ్యక్షులు బసవరాజు యాదవ్, బీసీ సంఘం నేతలు బాలకృష్ణ గౌడ్, వెంకటేష్, కాశి ,రమేష్ తదితరులు పాల్గొన్నారు

# నివాళులర్పించిన టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు.



**వరంగల్ అక్టోబర్ 9. (సమయం న్యూస్):** పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన బల్లె రాజు (పోస్ట్ ) వారి తండ్రి బల్లె వెంకటయ్య గారు ఈ రోజు హటాత్తు గుండెపోటుతో మధ్యాహ్నం మరణించగా వారి పార్థివదేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగడ సానుభూతి వ్యక్తం చేసిన బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాజీ వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్ గారు, మాజీ మండల రైతుబంధు అధ్యక్షుడు చిన్నపాక శ్రీనివాస్ , పర్వతగిరి మాజీ ఎంపీటీసీ మాదుగుల రాజు , మాజీ కల్లెడ సర్పంచ్ సంపెల్లి పరమేశ్వరరావు, మండల కోశాధికారి దబ్బేట నరేష్ మండల సీనియర్ నాయకులు జంగిలి బాబు,చిరుత విజయ్ గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు...

# బీసీ రిజర్వేషన్ లపై ప్రభుత్వలోపభూయిష్ట విధానాలతోనే హైకోర్ట్ స్టే విధించింది

● బిఆర్ఎస్ ఎల్పీ విప్ కెపి.వివేకానంద్ గారు.




**కుత్బుల్లాపూర్ సమయం న్యూస్ అక్టోబర్ 9 :** కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో జీ.వో.నెం.9 ను శాస్త్రీయ పద్ధతిలో కాకుండా తమకు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించడం వల్లే హైకోర్టు స్టే ఇవ్వాల్సి వచ్చిందని బిఆర్ఎస్ ఎల్పీ విప్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో ప్రభుత్వ విధానం శాస్త్రీయంగా, సరిగ్గా లేదని బిఆర్ఎస్ పార్టీ తరపున అసెంబ్లీ వేదికగా మా నాయకులు మేము ఎన్నోసార్లు ప్రభుత్వానికి హితవు పలికామని రేవంత్ సర్కార్ మాత్రం మా సలహాలను సూచనలను పెడచెవిన పెట్టడం వల్లే నేడు హైకోర్టులో స్టే విధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుతో పాటు అనేక హామీలను కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సాక్షిగా ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు కావస్తున్న బీసీ రిజర్వేషన్ల అమలు వారికి ఇచ్చిన హామీల అమలులో తూతూ మంత్రంగా వ్యవహరిస్తూ చేతులు దులుపుకుంటున్నారే తప్పా హామీల అమలులో ప్రభుత్వానికి ఎటువంటి చిత్తశుద్ధి కనిపించడం లేదు. బీసీ రిజర్వేషన్లపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని చెప్పిన రేవంత్ సర్కార్ మాటతప్పి ఢిల్లీకి పోయి ధర్నాల పేరుతో నాటకాలు ఆడారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ వేదికగా చేయాల్సిన పోరాటాలను గల్లీలో చేస్తూ బీసీలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కామారెడ్డి వేదికగా బిసి డిక్లరేషన్ అమలు విషయంలో అఖిలపక్షం సభ్యుల సూచనలను సలహాలను పెడచెవిన పెట్టకుండా శాస్త్రీయబద్ధంగా రూపొందించాలి. లేకపోతే వెనుకబడిన వర్గాల తరపున పోరాడేందుకు బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది.

## మా మండలానికి వచ్చిన మెడికల్,వెటర్నరీ కళాశాల, ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఇతర ప్రాంతాలకు తరలించొద్దు

● కొడంగల్ మైనారిటీ నాయకులు ఎస్.ఎం గౌసన్



**కొడంగల్ మండలం, అక్టోబర్,09(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ కు మంజూరైన మెడికల్, వెటర్నరీ కళాశాల, పాత కొడంగల్ లో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల ఇతర ప్రాంతాలకు తరలించొద్దని మైనారిటీ నాయకులు ఎస్.ఎం.గౌసన్ అన్నారు. విద్య పరంగా వెనక బడిన ఈ ప్రాంతంలో మెడికల్, వెటర్నరీ కళాశాలలు, ఇంటిగ్రేటెడ్ గురుకులాలు సీఎం రేవంత్ రెడ్డి మంజూరు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్న తరుణంలో విద్యా సంస్థలు లగచర్ల కు తరలిస్తే అన్యాయం జరుగుతుందన్నారు.విద్య సంస్థలు తరలి పోకుండా పార్టీలకతీతంగా ప్రతీ ఒక్కరూ కొడంగల్ లో అఖిల పక్షం సమావేశం తో సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్దామని పిలుపు నిచ్చారు.

## బీసీలపై కపట ప్రేమ చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

● ఒకవైపు నామినేషన్లు మరొకవైపు హైకోర్టు స్టే
● ఇదంతా రాష్ట్ర ప్రభుత్వ నాటకం అంటున్న
● బిఆర్ఎస్ మండల నాయకులు కోదండ కృష్ణ గౌడ్



**వెల్దుర్తి అక్టోబర్09,( సమయం న్యూస్ ):** ఆరు గ్యారెంటీల లాగే, కాంగ్రెస్ 42% బీసీ రిజర్వేషన్ల అంత డ్రామా.. అని మండిపడు తున్న మెదక్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోదండ కృష్ణ గౌడ్. వెల్దుర్తి మండల కేంద్రంలో ఈరోజు ఎలక్షన్ లపై హైకోర్టు స్టే విధించడంతో మండల స్థాయి నాయకులు అలాగే ప్రజలు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండి పడుతున్నారు. ప్రజాపాలన అం టూ ప్రజలకు ఆరు గ్యారంటీ లు కూడా పూర్తిస్థాయిలో ఇవ్వక పోవడం, అలాగే ఒకవైపు నామినే షన్లు జిల్లా మండల కేంద్రలలో నాయకులు ఇస్తుండగానే ఇట్టి ఎలక్షన్లపై హైకోర్టు స్టే విధించడం రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనకు సిగ్గుచేటు అని మండిపడ్డారు. మీ ప్రభుత్వానికి నిజంగా బీసీల పట్ల ప్రేమ ఉంటే 55 ఏళ్లు కేంద్రంలో అధికారంలో ఉండి కాంగ్రెస్ ఏనాడైనా బీసీ రిజర్వేషన్ల కోసం పాటు పడిందా..?చిత్తశుద్ధి ఉంటే మీ జాతీయ నాయకులతో డిల్లీ వేదికగా కొట్లాట పెట్టండి.. అని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు.మాయ మాటలు చెప్పి గత ఎన్నికల్లో బీసీలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ లబ్ధి పొందాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయి. 22 నెలలుగా బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కొట్లాడాల్సిన రాష్ట్ర ముఖ్యమంత్రి గల్లీలో కొట్లాడుతున్నట్లు డ్రామా క్రియేట్ చేసారు తప్ప, బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధించడం పట్ల ఏనాడూ చిత్తశుద్ధి ప్రదర్శించలేదు.బీసీల పట్ల తమకు నిజంగానే ప్రేమ ఉన్నట్లు చాటుకునేందుకు తూతూ మంత్రంగా జీవో ఇచ్చి కొత్త నాటకానికి తెరతీసారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేసారు. ఇప్పటికైనా మీ డ్రామాలు ఆపండి. మీకు, మీ పార్టీకి బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే 42శాతం పెంపు విషయమై ఢిల్లీలో కొట్లాడండి. పార్లమెంట్ లో చట్టం చేయించి, షెడ్యూల్ 9లో చేర్చండి. అని రాష్ట్ర ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# సీఎం రేవంత్ డిప్యూటీ సీఎం భట్టితో మంత్రి తుమ్మల సమావేశం

● ఖమ్మం జిల్లాలో అభివృద్ధి పనులు పై కీలక చర్చ
● తుమ్మల ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్


**కొత్తగూడెం , అక్టోబర్ 9 : ( సమయం న్యూస్ ) :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరుగుతున్న ప్రధాన అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, పెండింగ్ పనుల పరిష్కారం పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. గురువారం సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి దిశానిర్దేశకంగా నిలిచింది. ఖమ్మం జిల్లా అభివృద్ధి బాటలకు మంత్రి తుమ్మల సూచించిన అన్ని ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉపముఖ్యమంత్రి భట్టి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.నేషనల్ హైవే పనుల పురోగతి, ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ స్థాపన, భద్రాచలం కరకట్ట విస్తరణ పనుల, పలు గ్రామీణ రహదారులు, నీటిపారుదల, విద్యుత్ , భూసేకరణ సంబంధిత అంశాలు కూడా చర్చకు వచ్చాయి. అభివృద్ధి ఎజెండాగా సాగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూ సేకరణ అంశం ప్రధాన చర్చగా నిలిచింది. మంత్రి తుమ్మల ఈ అంశాలపై పూర్తి వివరాలు అందించి, సంబంధిత శాఖలు తక్షణ చర్యలు చేపట్టేలా సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. ప్రాజెక్టు పరిధిలో రైతుల భూ సేకరణలో ఎదురవుతున్న సమస్యలను మంత్రి తుమ్మల వివరంగా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. భూ సేకరణ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మంత్రి తుమ్మల సీఎంను కోరగా తక్షణమే విడుదల చేయాలని ఆదేశించారు. రైతుల ప్రయోజనాలు కాపాడుతూ, పనులను వేగంగా పూర్తి చేసే దిశగా స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వాలని ఆయన కోరారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం%-%భద్రాద్రి జిల్లాల్లో సాగునీరు విస్తీర్ణం గణనీయంగా పెరగడం, వ్యవసాయ రంగం బలపడడం, రైతుల ఆదాయాలు పెరగడం వంటి అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రానికి ఆర్థిక, సామాజికంగా సీతారామ ప్రాజెక్టు కీలక మలుపుగా నిలవనుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఖమ్మం - దేవరపల్లి, అమరావతి - నాగపూర్ గ్రీన్ ఫీల్డ్హైవేల భూసేకరణకు అడ్డంకులు తొలగించాలని రెవిన్యూ యంత్రాంగాన్ని సీఎం ఆదేశించారు. ఈ నూతన హైవేల ఇరువైపులా ఎలక్ట్రికల్ పోల్స్ షిఫ్టింగ్ ను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి గారు విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్ ప్రాజెక్టులపై సమన్వయంతో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు, అవసరమైతే ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించి సీతారామ ప్రాజెక్టు కెనాల్ పనులను శరే వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

కొత్తగూడెం ఎర్త్ సైన్స్ స్యూనివర్సిటీ నూతన భవనాల నిర్మాణానికి రూ.1000 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్టు మంత్రి తెలిపారు. మొదటి సరిగా ప్రారంబిస్తున్న మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ స్ యూనివర్సిటీ తరగతులను గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు మంత్రి తుమ్మల ఆహ్వానించగా, ఎన్నికల కోడ్ ముగియగానే తగు సమయం చూసుకొని వస్తానని తెలిపారు. భద్రాచలం కరకట్ట విస్తరణ పనుల గురించి గౌరవ ముఖ్యమంత్రి , ఉపముఖ్యమంత్రి కి వివరించి భద్రాచలం పట్టణాన్ని శాశ్వతంగా గోదావరి వరద నుండివిముక్తి చేయడానికి తగిన నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి తుమ్మల చేసిన ప్రతిపాదనలపై సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. ప్రజల అంచనాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగించడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుల సంక్షేమం కోసం అవసరమైన నిధులు మంజూరు చూస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# నేను రాను బిడ్డో భర్కత్ పురా పి ఎఫ్ ఆఫీసుకు

● అర్జీ దారులకు ఇబ్బందులు
● అన్ని సబ్మిట్ చేసిన రీజెక్ట్ చేస్తున్న వైనం
● వ్యక్తిగతంగా వచ్చినప్పుడు పూర్తి గా వివరించ నీ అధికారులు.
● సుదూరం నుండి వచ్చిన అర్జీ దారులు ఇబ్బందిలు





**భర్కత్ పురా అక్టోబర్ 09( సమయం న్యూస్).:** పి ఎఫ్ ఆఫీస్ కు అవసరమున్న సుదూరం నుండి వచ్చిన వారే కాకుండా స్థానికంగా ఉన్న వారికి కూడా ఇబ్బందులు.కార్మికల కష్టాలు వర్ణనానితం. కార్మికుల కు పి ఎఫ్ మంజూరు గాని. పెన్షన్ మంజూరు కు కార్మికుల ఆయా ప్రాంతం నుండి ఆన్ లైన్ ద్వారా గాని సమీప జోనల్ ఆఫీస్ లో విన్న విస్తారుజోనల్ ఆఫీస్ లో అన్ని ఉన్న హైదరాబాద్ ఆఫీస్ క్లెయిమ్ కోసం సిఫార్సు చేస్తారు ఎందుకంటే ఆయా కార్పొరేషన్ లో పని చేసి పదవి విరమణ పొందిన వారు హైదరాబాద్ లో ఉంటుంది కాబట్టి ఇక్కడ కి పంపిస్తారు అయితే ఇక్కడ ఒక తమాషా ఉంటుంది దొరక దొరక గా కష్టాలు పడి ఇక్కడి వస్తె ముందుగా సెక్యూరిటీ గార్డ్ ఒక స్లిప్ ఇస్తారు అట్టి స్లిప్ తీసుకొని క్లెయిమ్ ఎంక్వైరీ వద్దకు వెళ్ళితే వివరాల తో కూడిన స్లిప్ ఇస్తారు అట్టి స్లిప్ లను మళ్ళీ పి ఆర్ ఓ వద్ద వెళ్ళాలి.ఇక ఇక్కడే ఉంది తమాషా అట్టి స్లిప్ తీసుకొని పోవాలంటే లైన్ లో ఉండాలి సుదూరం నుండి వచ్చే వారికీ పి ఆర్ ఓ వద్ద చిట్టి తీసుకోవడానికి లైన్ లో నిలబడి రెండు రెండు గంటల వరకు నిలబడి తర్వాత పి ఆర్ ఓ దగ్గర స్లిప్ తీసుకోవడానికి మధ్యాహ్యం 3 అవుతుంది సంతోషం తో పి ఆర్ ఓ వద్ద నుండి స్లిప్ తీసుకొని సెక్షన్ వరకు పోయే వరకు అక్కడ సెక్షన్ వాళ్ళు ఇది నాది కాదు ఆ సెక్షన్ కు పోండి అంటారు.తిరిగి ఆ సెక్షన్ ఈ సెక్షన్ తిరిగే సరికి సాయత్రం4 అవుతుంది సిబ్బంది ఇంటికి వెళ్ళేదానికి సదురుకుంటూ ఉంటారు రేపు రాండి అంటారుఅర్జీ దారునికి ఇదే దుస్థితి అర్జి దారునికి ఒకే సారి చెప్పలేక తరచుగా రామ్మడం వాళ్లించే పెన్షన్ అప్పుల కే పోతున్నది.

అంటూ ఇప్పటి వరకు ఈ ఆఫీస్ ఎన్ని సార్లు వచ్చానో నాకే తెలియదంటూ మంచిర్యాల కు చెందిన ఒక మహిళ ఆరోపిస్తున్నారు. క్లెయిమ్ ఎంక్వైరీ ఇచిన స్లిప్ ద్వారా అర్జీ దారులను పంపిస్తే సెక్షన్ లో పని ముగించుకొని తిరుగు ప్రయాణానికి వెళ్ళ అవకాశం ఉంటుందని అర్జొందారులు అభిప్రాయ పడుతున్నారు.మరొక పి ఆర్ ఓ నైనా ఏర్పాటు చేయాలంటూ అర్జీ దారులు ఉన్నతాధికారుల ను కోరుతున్నారు. రోజు ఇదే తంతు గా ఉందని అర్జీ దారులు ఆరోపిస్తున్నారు.

10-10-25 Samayam_Layout 1 10/10/2025 6:13 AM Page 8



# కొత్తగూడెం లో ముగిసిన పాఠశాలల క్రీడలు



**కొత్తగూడెం అక్టోబర్ 9 : ( సమయం న్యూస్ ) :** స్థానిక ప్రకాశం స్టేడియంలో ప్రారంభమైన పాఠశాలల ఎస్ జి ఎఫ్ క్రీడలు గురువారం ముగిశాయి. విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. వాటి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.అండర్ 17 బాలుర విభాగం లో )కబడ్డీ )మొదటి బహుమతి ఇల్లందు, ద్వితీయ స్థానం అశ్వారావుపేట, తృతీయ స్థానం కొత్తగూడెం జోన్లు దక్కించుకున్నాయి అదేవిధంగా ఖోఖో క్రీడలో ప్రథమ బహుమతి అశ్వారావుపేట, ద్వితీయ బహుమతి కొత్తగూడెం, తృతీయ బహుమతి పాల్వంచ జోన్లు దక్కించుకోగా, వాలీబాల్ క్రీడలో పాల్వంచ ప్రథమ బహుమతి ఇల్లందు ద్వితీయ బహుమతి కొత్తగూడెం తృతీయ బహుమతులు దక్కించుకున్నాయి అండర్ 17 బాలికల విభాగంలో...కబడ్డీ క్రీడలో. ఇల్లందు ప్రథమ బహుమతిని అశ్వారావుపేట ద్వితీయ బహుమతిని భద్రాచలం తృతీయ బహుమతిని, ఖో ఖో క్రీడలో భద్రాచలం ప్రథమ బహుమతిని అశ్వారావుపేట ద్వితీయ బహుమతి ఇల్లందు తృతీయ బహుమతిని దక్కించుకుకోగా, వాలీబాల్ క్రీడలో ప్రథమ బహుమతి ని అశ్వారావుపేట ద్వితీయ బహుమతి ఇల్లందు తృతీయ బహుమతి భద్రాచలం దక్కించుకున్నాయి.. అండర్ 14 బాలుర విభాగంలో... కబడ్డీ క్రీడలో పాల్వంచ మొదటి బహుమతి, అశ్వరావుపేట ద్వితీయ బహుమతి , పినపాక తృతీయ బహుమతి దక్కించుకున్నాయి .ఖో. ఖో. విభాగంలో అశ్వరావుపేట మొదటి బహుమతి, పాల్వంచ ద్వితీయ బహుమతి ,తృతీయ బహుమతి దక్కించుకున్నాయి వాలీబాల్ లో పాల్వంచ మొదటి ,ఇల్లందు ద్వితీయ బహుమతి,కొత్తగూడెం జోన్లు తృతీయ బహుమతి దక్కించుకున్నాయి.అదేవిధంగా అండర్ 14 బాలికల విభాగంలో....వాలీబాల్ క్రీడలో ప్రథమ బహుమతిని పాల్వంచ ద్వితీయ బహుమతిని, అశ్వరావుపేట ద్వితీయ బహుమతి, ఇల్లందు జోన్లు దక్కించుకోగా బాలికల కబడ్డీ క్రీడలో ప్రథమ బహుమతిని ఇల్లందు, ద్వితీయ బహుమతి పాల్వంచ ,తృతీయ బహుమతి అశ్వరావుపేట దక్కించుకోగా, ఖో ఖో క్రీడలో ప్రథమ బహుమతిని ఇల్లందు, ద్వితీయ బహుమతిని భద్రాచలం తృతీయ బహుమతి ని అశ్వరావుపేట జోన్లు దక్కించుకోవడం జరిగినది బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి డిఇఓ నాగలక్ష్మి, డి వై ఎస్ ఓ పరంధామ రెడ్డి ,వ్యాయామ ఉపాధ్యాయులైన సీత,సుజాత, బుగ్గ వెంకటేశ్వర్లు, భావ్ సింగ్, లక్ష్మణ్,శేఖర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు

## మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ టి రాజయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ లో చేరిన వందమంది





**వరంగల్ అక్టోబర్ 9. (సమయం న్యూస్) :** ఈరోజు తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య ఆధ్వర్యంలో చిల్పూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ నుండి మరియు ఇతర పార్టీల నుండి 100 మంది %దీ=ా% పార్టీలో జాయిన్ అవ్వడం జరిగింది అందులో వేల్పుల గట్టయ్య మరియు మారపాక రమేష్ మరియు చిర్ర లక్ష్మణ్ వీరితోపాటు 100 మంది బి.ఆర్.ఎస్ పార్టీ కండువా కప్పుకోవడం జరిగింది . ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ కేసిరెడ్డి మనోజ్ రెడ్డి మండల పార్టీ ఇన్చార్జి మాలో రమేష్ నాయక్ మరియు మండల ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు అన్ని గ్రామాల బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మనసు ప్రశాంతంగా,జీవితం సంతోషంగా!

- నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం
- మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం




**ముషీరాబాద్, అక్టోబర్ 10 (సమయం న్యూస్):** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంప్రపంచ ఆరోగ్య సంస్థ మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంగా జరుపుకుంటుంది. ఈ దినోత్సవం ఉద్దేశ్యం ం మానసిక ఆరోగ్యం చుట్టూ ఉన్న అపోహలను తొలగించడం, ప్రజల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, విద్యను ప్రోత్సహించడం.నేటి వేగవంతమైన జీవనశైలిలో మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలు పెరుగుతున్నాయి. కానీ ఇప్పటికీ చాలామందికి మానసిక ఆరోగ్యంపై సరైన అవగాహన లేదు. ప్రతి ఒక్కరికీ మానసిక ఆరోగ్య సంరక్షణ అందుబాటులో ఉండాలని కోరుతూ ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని నిర్వహించడం సాంప్రదాయంగా మారింది.వ్యాయామం నిపుణుల ప్రకారం, ఒత్తిడిని తగ్గించే ఉత్తమ మార్గాల్లో వ్యాయామం ఒకటి. ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా ఎండార్ఫిన్‌లు విడుదల అవుతాయి ం ఇవి మనసు ప్రశాంతంగా ఉండేలా చేస్తాయి, ఒత్తిడిని తగ్గిస్తాయి. అలాగే వ్యాయామం కార్టిసాల్ అనే ఒత్తిడి హార్మోన్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. రోజూ కొంత సమయం వ్యాయామం చేస్తే శరీరం, మనస్సు రెండూ విశ్రాంతి పొందుతాయి.

**ప్రశాంతంగా నిద్రపోవాలి /..**ఒత్తిడిని నియంత్రించడానికి పరిపూర్ణ నిద్ర చాలా ముఖ్యం. నిద్ర సరిగా లేకపోతే చిరాకు, అలసట, ఆందోళన వంటి సమస్యలు వస్తాయి. నిద్రలేమి కారణంగా కార్టిసాల్ స్థాయిలు పెరిగి ఒత్తిడి మరింత ఎక్కువవుతుంది. నిపుణుల సూచన ప్రకారం ప్రతిరోజూ కనీసం 8 గంటలు నిద్రపోవడం అవసరం.

**శ్వాస వ్యాయామాలు చేయండి..**ఒత్తిడికి గురైనప్పుడు లోతైన శ్వాస వ్యాయామాలు చేయడం వల్ల మనసుకు విశ్రాంతి లభిస్తుంది. రోజుకు 10 నిమిషాలు దీన్ని ప్రాక్టీస్ చేస్తే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. శ్వాసపై దృష్టి పెట్టడం ద్వారా మనస్సు స్థిరంగా, ప్రశాంతంగా ఉంటుంది.

**పోషకాహారం తీసుకోండి...**శరీరం సక్రమంగా పనిచేయడానికి సమతుల్య పోషకాహారం చాలా అవసరం. ఒత్తిడిని కంట్రోల్‌లో ఉంచడానికి కూడా ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్ వంటి సంపూర్ణ ఆహారాలను తీసుకోవాలి. ప్రాసెస్ చేసిన ఫుడ్స్, చక్కెర అధికంగా ఉన్న ఆహారాలను తగ్గించడం మంచిది.

**ఇష్టమైన వారితో మాట్లాడండి...**ఒత్తిడిని తగ్గించడంలో సామాజిక మద్దతు కూడా ఎంతో అవసరం. కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఎక్కువ సమయం గడపడం, మనసులో ఉన్న విషయాలను పంచుకోవడం ద్వారా ఒంటరితనం దూరమవుతుంది, మనసుకు ఊరట లభిస్తుంది.ఈ సమాచారం ఆరోగ్య నిపుణుల అభిప్రాయాలు, అధ్యయనాల ఆధారంగా అందించబడింది. ఫలితాలు వ్యక్తిగతంగా మారవచ్చు. ఆరోగ్య సమస్యలపై మార్పులు చేసేముందు తప్పనిసరిగా మీ డైటీషియన్ లేదా వైద్యుడిని సంప్రదించండి.

# జల్సాలు అప్పులు అనైతిక చర్యలు ఒక హత్య.. నిందితుల అరెస్ట్

## ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి






**ఖమ్మం అక్టోబర్ 9 : ( సమయం న్యూస్ ) :** జల్సాలు అప్పులు అనైతిక చర్యలు వెరసి ఒక హత్య.... ఉదంతం అసాంతం , ఏ సర్టిఫికెట్ తో కూడినసస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ సినిమా ను తలంపించిన సంఘటనలో నిందితులను ఖమ్మంరూరల్ పోలీసులు అరెస్టు చేయగా సంబంధిత వివరాలను ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ లోఖ్మరి రూరల్ ఏసిపితిరుపతి రెడ్డి వెల్లడించారు.ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం చిట్యాలకు చెందిన పరిమి అశోక్ (36) ఎం.ఫార్మసీ చదువుకున్నాడు. నాలుగైదేళ్ల క్రితం అతని తల్లిదండ్రులు అనారోగ్యంతో మరణించారు. అప్పటి నుంచి అశోక్ ప్రయివేట్ గా పని చేసుకుంటున్నప్పటికీ, తద్వారా వచ్చే డబ్బు అతని జల్సాలకు, అటవాట్లకు ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో వ్యవసాయం చేయాలని నిర్ణయించుకుని వంగతోట సేద్యంలోకి దిగాడు. ఇందుకోసం తనకు తెలిసిన కొందరి వద్ద అప్పులు చేసి సేద్యం చేయగా, నష్టాలు రావడంతో ఆర్థిక భారం పెరిగిపోయింది.ఈ నేపథ్యంలోనే అశోక్ కు ఖమ్మంలోని క్యూర్ హాస్పిటల్ లో ఆయాగా పనిచేస్తున్న కొమ్ము నగ్మా(32)తో ఏర్పడిన పరిచయం కాస్తా ఇద్దరి మధ్య శారీరక సంబంధానికి దారి తీసింది. ఇదే దశలో ఖమ్మం గ్రంథాలయంలో పనిచేస్తున్న కామేపల్లి మండలం కెప్టెన్ బంజరకు చెందిన గట్ల వెంకటేశ్వర్లు అలియాస్ వెంకట్ (40)తో అశోక్ కు ఏర్పడిన పరిచయం స్నేహంగా మారి, ఇద్దరి మధ్య స్వలింగ సంపర్కానికి దారి తీసింది. అశోక్ రూంకు వెళ్లిన పుడల్లా వెంకట్ అతని ఖర్చులకు డబ్బు ఇస్తుండేవాడు. ఇదే దశలో బల్లేపల్లి సమీపంలోని బాలప్పేటకు చెందిన పెంటి కృష్ణయ్య అలియాస్ కృష్ణ రామస్వామి అనే వ్యక్తితోనూ అశోక్ కు పరిచయం కలిగింది. వీరి మధ్య స్నేహం కూడా బలంగా మారింది.అయితే ధనవంతుడిలా కనిపించే వెంకట్ తన గదికి ఈసారి వచ్చినపుడు అతన్ని ఎలాగైనా చంపి, అతని వద్దగల బంగారం, డబ్బు తీసుకోవాలని అశోక్ తోపాటు కృష్ణ, నగ్మాలు కుట్ర పన్నారు. కానీ ఓ మనిషిని చంపడం ఏ విధంగా సులభతరమనే అంశంపై కృష్ణను అశోక్ అడిగాడు. కత్తితో గొంతు భాగంలో నరకడం వల్ల అరవకుండా చంపవచ్చని కృష్ణ అశోక్ కు సూచించాడు. ఆ తర్వాత మనిషిని చంపడం గురించి, చంపిన మనిషిని విడిభాగాలుగా ఎలా చేయాలి? అనే అంశాలపై తన సెల్ ఫోన్ ద్వారా యూ ట్యూబ్ లో అశోక్ తెలుసుకున్నాడు. హత్యకు అవసరమైన కత్తులను అశోక్ కొనుగోలు చేశాడు. గత నెల 15వ తేదీన రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఇవేవీ తెలియని వెంకటేశ్వర్లు అలియాస్ వెంకట్ అశోక్ గదికి వచ్చి పడుకున్నాడు. తెల్లవారుజామున, అంటే గత నెల 16వ తేదీన వెంకట్ నిద్రిస్తున్న సమయంలో నగ్మాను అశోక్ బయట కాపలాగా ఉంచాడు. నిద్రలో వెల్లకిలా పడుకున్న వెంకట్ గొంతుపై తాను తెచ్చుకున్న కత్తితో బలంగా నరకడంతోప్నా మెడపైనా పలుసార్లు అశోక్ కత్తివేట్లు వేశాడు. దీంతో వెంకట్ తలా, మొండెం వేరయ్యాయి. ఆ తర్వాత అదే కత్తితో వెంకట్ శరీరాన్ని ముక్కలుగా నరికి కవర్లలో శరీరభాగాలను కూర్చి, దుప్పటిలో మూటగా కట్టాడు అశోక్. ఆ తర్వాత మోటార్ సైకిల్ పై దుప్పటి మూటను తీసుకువెళ్లి, కవర్లలో కూర్చిన వెంకట్ శరీర భాగాలను కరుణగిరి ప్రాంతంలోని పొదల్లో, చెత్తలో విసిరేశాడు. ఆ తర్వాత ఘటనకు పాల్పడిన గదిని రక్తపు మరకలు లేకుండా శుభ్రం చేశాడు. అయితే తన అన్న కనిపించడం లేదంటూ వెంకట్ తమ్ముడు కొండ యాదగిరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 'మిస్సింగ్' ఘటనగా కేసున నమోదు చేసుకున్న పోలీసులు వెంకట్ ను అశోక్, నగ్మా, కృష్ణలు కలిసి దారుణంగా హత్య చేసినట్లు దర్యాప్తులో తేల్చారు. కేసును సవాల్ గా స్వీకరించిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితులను పట్టుకోవడం విశేషం. వెంకట్ ను దారుణంగా హత్య చేసిన పరిమి అశోక్ ను, కొమ్ము నగ్మాను, పెంటి కృష్ణను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ఒక బైక్ ను, హత్యకు గురైన వ్యక్తి నుంచి దోచుకున్న 2.7 తులాల బంగారు గొలుసును, నాలుగు సెల్ ఫోన్లను, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు.కేసు పరిశోధనలో ప్రతిభను కనబర్చిన సింగరేణి సీ ఐ తిరుపతిరెడ్డిని, కామేపల్లి, కారేపల్లి ఎస్ఐలు. బి. సాయికుమార్, బి. గోపి, కానిస్టేబుళ్లు సంపత్, ఆనంద్, ఆంజీ, రాజేష్, ఉపేందర్, సైదాలను ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఏసీపీ తిరుపతిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, నేరాలకు పాల్పడేవారు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోలేరని చెప్పారు. ఎంత తెలివైన నేరస్థుడైనా ఎక్కడో ఓచోట తప్పు చేస్తాడని, ప్రస్తుత సాంకేతికత కాలంలో అసలే తప్పించుకోలేరని చెప్పారు. అందువల్ల నేర యోచనే మంచిది కాదని ఏసీపీ తిరుపతిరెడ్డి పేర్కొన్నారు.

# మనమంతా తెలుగుదేశం కుటుంబ సభ్యులం

- పాల్వాయిగేట్ ఈవీఎం ధ్వంసం ఘటనలో నంబూరి శేషగిరిరావు వీరోచితంగా పోరాడారు
- కుటుంబ సభ్యులను ఉండవల్లి నివాసానికి పిలిపించుకుని మాట్లాడిన మంత్రి లోకేష్

**ఉండవల్లి అక్టోబర్09( సమయం న్యూస్) :** మనమంతా తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులం అని, కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా ఆదుకుంటామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కార్యకర్తలను నేరుగా కలిసి వారి సమస్యలను పరిష్కరిస్తున్న మంత్రి లోకేష్.. నేడు ఉండవల్లి నివాసంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం పాల్వాయిగేట్ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నంబూరి శేషగిరిరావు కుటుంబ సభ్యులను పిలిపించుకుని మాట్లాడారు. 2024 ఎన్నికల సమయంలో పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేస్తుండగా పోలింగ్ ఏజెంట్ గా ఉన్న శేషగిరిరావు వీరోచితంగా పోరాడి అడ్డుకున్నారు. దీంతో వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడి ఆయనను తీవ్రంగా గాయపరిచారు. రెండు నెలల క్రితం ఆయన గుండె పోటుతో మరణించారు. ఈ నేపథ్యంలో దివంగత శేషగిరిరావు సతీమణి కృష్ణవేణితో పాటు కుమారుడు, కుమార్తె, ఇతర కుటుంబ సభ్యులను ఉండవల్లి నివాసానికి పిలిపించుకున్న మంత్రి లోకేష్.. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నంబూరి శేషగిరిరావు మా అందరికీ స్ఫూర్తిగా నిలిచారుఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. పాల్వాయిగేట్ ఈవీఎం ధ్వంసం ఘటనలో నంబూరి శేషగిరిరావు చాలా గట్టిగా పోరాడి మా అందరికీ స్ఫూర్తిగా నిలిచారన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడ్డారన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, తామంతా శేషగిరిరావు కుటుంబానికి అండగా ఉంటామని, కుటుంబ బాధ్యతను వ్యక్తిగతంగా తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు.



10-10-25 Samayam_Layout 1 10/10/2025 6:13 AM Page 9







# అంతా మా ఇష్టం!

## కల్తీ కల్లు మాఫియా ఆగడాలు ఆగడమే

## నిబంధనలకు పాతర - అందిన కాడికి దోచేస్తున్న ముస్తేదారులు

**కామారెడ్డి జిల్లా నరసుర్లాబాద్, బీర్కూర్ మండలాల్లో కల్తీ కల్లు మాఫియా ఆగడాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. గీత కార్మికుల జీవనాధారంగా ఉన్న ఈ వృత్తిని కొందరు ముస్తేదారులు స్వార్థపూరితంగా ఆక్రమించుకొని, లాభాల కోసం నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. గీత పారిశ్రామిక నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో కల్లు డిపోలు, దుకాణాలు ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయి. అధికారులకు ఈ అన్నీ కళ్ల ముందే కనిపిస్తున్నా, చర్యలు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు.**

### వేలాల్లో ముస్తేదారులే ముస్తాబు

దసరా ముందు నరసుర్లాబాద్, బీర్కూర్ మండలాల్లో కొత్త కల్లు దుకాణాల కోసం బహిరంగంగా వేలంపాటలు జరిగాయి. అందులో నరసుర్లాబాద్ మండల కేంద్రంలోని ఓ కల్లు దుకాణాన్ని స్థానికంగా ఉన్న ప్రముఖ పత్రిక విలేకరి రూ.18 లక్షలకు పైగా వేలం వేసి దక్కించుకున్నారని సమాచారం. ఇతర ఖర్చులు కలుపుకుంటే రూ.25 లక్షలకు పైగా వెచ్చించాల్సి వస్తుందని చెబుతున్నారు. ఇంత భారీ మొత్తాలతో షాప్‌లు కైవసం చేసుకోవడం వెనుక ఉన్న మాఫియా బలాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇంత డబ్బు పెట్టి షాప్ తీసుకునే వారు లాభాల కోసం ఎంతవరకు కల్తీకి పాల్పడతారో ఊహించుకోవచ్చు.

### కళ్లముందే ఆగడాలు - అధికారుల నిశ్శబ్దం

బీర్కూర్, నరసుర్లాబాద్ మండలాల్లోని గ్రామాల్లో కల్తీ కల్లు వ్యాపారం బహిరంగంగానే నడుస్తున్నా, ఎక్సైజ్ అధికారులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు పట్టించుకోని ధోరణి ప్రజల్లో ఆగ్రహం రేపుతోంది. బొమ్మందేవ్‌పల్లి చౌరస్తా వద్ద హైవే పక్కనే రాత్రిపూట రేకుల షెడ్డులో కల్తీ కల్లు కలపడం, అక్కడి నుంచి బొమ్మందేవ్‌పల్లి, నెమలి, బరంగేడ్గి గ్రామాలకు అర్ధరాత్రి సరఫరా చేయడం జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. హైవేల పక్కన కల్లు షాప్‌లు నడపకూడదని నిబంధన ఉన్నా, ఇక్కడ ఆ నిబంధనలు పనికిరావు.

### గౌడల వృత్తి - ముస్తేదారుల వ్యాపారం

గౌడ కులానికి చెందిన పేద గీత కార్మికుల జీవనాధారం అయిన కల్లు వృత్తి కొంతమంది ముస్తేదారులకు కల్పవృక్షంగా మారింది. గత 25 ఏళ్లుగా బాన్సువాడకు చెందిన పొట్టేళ్ల కాషా గౌడ్, అతని కుమారుడు రాజా గౌడ్ ఆధిపత్యం కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు. గీత కార్మికులు స్వయంగా కల్లు విక్రయించాలంటే కేసులు పెడతామనే బెదిరింపులు ఎదుర్కొంటున్నారని గౌడ సమాజం ఆవేదన వ్యక్తం చేస్తోంది. సొసైటీ లైసెన్సుల కేటాయింపులోనూ ఆప్కారీ శాఖ అధికారులు ముస్తేదారులపక్షానే వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

### స్కూల్ పక్కనే కల్లు దుకాణాలు

బొమ్మందేవ్‌పల్లి గ్రామంలో ఒక కల్లు షాప్ పాఠశాల సమీపంలో, మరొకటి గ్రామ మధ్యలో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మత్తులో ఉన్నవారు ప్రతిరోజూ అల్లరి చేయడం, విద్యార్థులకు ఇబ్బందులు కలిగించడం జరుగుతోందని గ్రామస్తులు అంటున్నారు. స్కూల్ పరిసరాల్లో వైన్స్, బెల్ట్ షాపులు, కల్లు దుకాణాలు ఉండకూడదని నిబంధన ఉన్నా, ఇక్కడ ఆ నిబంధనలు ఎవరికీ పట్టడం లేదు.

### సొసైటీ నిబంధనలు ఉల్లంఘన

బొమ్మందేవ్‌పల్లి సొసైటీకి 12 మంది డైరెక్టర్లు ఉండాలి. అయితే ఆరుగురు మరణించినప్పటికీ, కొత్త డైరెక్టర్లను నియమించకుండానే 3 సంవత్సరాలుగా సొసైటీ కొనసాగుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ప్రభుత్వం జోక్యం అవసరం

"గౌడ వృత్తిని నమ్ముకుని జీవించే వారికి న్యాయం చేయాలి. కల్తీ మాఫియా, అధికారుల నిర్లక్ష్యంపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి," అని గౌడ సమాజం డిమాండ్ చేస్తోంది.

# రైతులకు మద్దతు ధర అందించడమే లక్ష్యం



- రెవెన్యూ, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ధాన్యం సేకరణలో ఇబ్బందులు లేకుండా చూడాలి
- సిరిసిల్ల కలెక్టర్ ఎం. హరిత
- ధాన్యం సేకరణపై సమీక్ష

**సిరిసిల్ల, అక్టోబర్ 9 (సమయం న్యూస్) :** రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర అందించడమే లక్ష్యమని కలెక్టర్ ఎం. హరి త స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్ 2025-26 ధాన్యం సే కరణపై పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, వ్యవసాయ శా ఖ, రవాణా, మార్కెటింగ్, సహకార, ఐకేపీ, మెప్మా ఇతర శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల స ముదాయంలోని ఆడిటోరియంలో గురువారం సమీక్ష స మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ గత ఖరీఫ్ సీజన్లో జిల్లాలో 2,11,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, ఈ సీజన్‌లో దాదాపు 2,70,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని తెలిపారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు అ ప్రమత్తంగా ఉండాలని, ఏదైనా గ్రామాల్లో వరి కోతలు మొదలు అయితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వెంటనే ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే రైతులకు ధాన్యం కేంద్రాలకు ఎలా తరలించాలి, తేమ శాతం వివరాలు తెలిపి టోకెన్లు ఇవ్వాలని ఆదేశించారు. సన్న ధాన్యాన్ని నిర్ధారించి, దాని వివరాలు కొనుగోలు కేంద్రాల బాధ్యులకు ఇవ్వాలని సూచించారు. ఐకేపీ, మెప్మా, పీఏసీఎస్, డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ధాన్యం సేకరణ, రైతుల వివరాల నమోదు ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చామని కలెక్టర్ తెలిపారు. పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో ఇబ్బందులు తొలగించాలని సూచించారు. ధాన్యం సేకరణ, రవాణా, లారీలు ఇతర ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2389, కామన్ రకానికి రూ.2369 నిర్ణయించిదని వెల్లడించారు. సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 అదనంగా ఇస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 13 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ధాన్యాన్ని సేకరించేందుకు ఐకేపీ ఆధ్వర్యంలో 144, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 79, మెప్మా, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కలిపి మొత్తం 231 ప్రారంభించనున్నట్లు తెలిపారు.

### అందుబాటులో పరికరాలు

జిల్లాలో అవసరం మేరకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. టార్పాలిన్లు 7592, తూకం వేసే యంత్రాలు 764, ప్యాడీ క్లీనర్లు 731, తేమ శాతం చూసే మెషిన్లు 603, గ్రైన్ కాలిపర్స్ 270 ఇతర యం త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్, సిరిసిల్ల, వేము లవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ డీసీఎవ్వో చంద్రప్రకాశ్, జిల్లా మేనేజర్ రజిత డీఏఓ అఫ్జల్ బేగం, డీఆర్డీఓ శేషాద్రి, డీసీఓ రామకృష్ణ, డీఎంఓ ప్రకాష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.



# ఎంబీబీఎస్ సీట్లు సాధించిన పోలీసుల పిల్లలకు సీపీ అభినందన

**వరంగల్, అక్టోబర్ 9 (సమయం న్యూస్) :** విద్యా రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన పోలీస్ కుటుంబాల పిల్లలను వరంగల్ పోలీస్ కమిషనర్ డా. సన్‌ప్రీత్ సింగ్ ఘనంగా సత్కరించారు. ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన ముగ్గురు పోలీస్ సిబ్బంది పిల్లలను గురువారం జరిగిన కార్యక్రమంలో సీపీ అభినందిస్తూ పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ 'పోలీస్ విధుల్లో ఒత్తిడి ఎంత ఉన్నా, పిల్లల చదువుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దు. విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానాలను చేరుకోవచ్చు. పోలీస్ సిబ్బంది పిల్లలు మెడికల్ సీట్లు సాధించడం గర్వకారణం' అని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత విద్యలో మరింత ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఎంబీబీఎస్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా కుమార్తె తాన్య సభ హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో సీటు సాధించగా, హెూం గార్డ్ బాలకిషన్ కుమారుడు ముప్పా చందు మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలో, మరో హెూం గార్డ్ మోహన్ కుమార్తె భవాని ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలో సీట్లు పొందారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీలు శ్రీనివాస్, ప్రభాకర్ రావు, ఏసీపీ నాగయ్య, ఆర్.ఐ చంద్రశేఖర్తో పాటు హెూం గార్డ్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర సైబర్ నిందితుడి అరెస్టు

**సిరిసిల్ల, అక్టోబర్ 9 (సమయం న్యూస్) :** క్రెడిట్ కార్డు యాక్టివేషన్ పేరుతో వాట్సాప్‌కి లింక్ షేర్ చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నిందితుడు అంకిత్ కుమార్ (32)ను రాజన్న సిరిసిల్ల జిల్లా సైబర్ టీమ్, పట్టణ పోలీసులు జార్ఖండ్‌లో అరెస్టు చేసి, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి వివరాలను గురువారం సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ కే.చంద్రశేఖర రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని చింతల్, వెంకటరామిరెడ్డి నగర్‌కు చెందిన మొహమ్మద్ కలీం పాషా, రషీద్ ఇద్దరు కూడా చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. ఎలాగైనా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఆన్‌లైన్ ద్వారా ప్రజలను సులువుగా మోసగించి డబ్బులు సంపాదించాలనుకున్నారు. అనుకున్నట్లుగానే కోల్‌కతాకు చెందిన అంకిత్ వద్దకు ఈ ఏడాది ఫిబ్రవరిలో వెళ్లి ఆన్‌లైన్ ద్వారా ప్రజలను ఎలా మోసం చేయాలో తెలుసుకున్నారు. ఈ క్రమంలో అంకిత్ వారికి ఆర్‌బీఎల్ క్రెడిట్ కార్డు కోసం దరకాస్తు చేసుకొని కార్డు వచ్చిన తరువాత యాక్టివేషన్ కోసం చూస్తున్న వారి పేర్లు, ఫోన్ నంబర్లు, క్రెడిట్ కార్డు నంబర్లతో పాటు పాన్ కార్డ్ నెంబర్లను వారిద్దరికీ వాట్సాప్ ద్వారా పంపిస్తానని చెప్పాడు. వీరిద్దరూ కలిసి క్రెడిట్ కార్డు కోసం దరకాస్తు చేసుకొన్న వారితో క్రెడిట్ కార్డు కస్టమర్ కేర్‌లా మాట్లాడి వారిని నమ్మించి వీరిద్దరూ మోసాలకు పాల్పడ్డారు. అందులో భాగంగా క్రెడిట్ కార్డ్ యాక్టివేషన్ కోసం బాధితులతో మాట్లాడి వారికి అంకిత్ పంపిన లింక్స్‌ను పంపేవారు. బాధితులు ఈ లింక్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్న వెంటనే వారి ఫోన్ హ్యాక్ కావడం, క్షణాల్లో అంకిత్ వారి క్రెడిట్ కార్డుల్లో ఉన్న డబ్బులను ఈ-కామర్స్ ద్వారా కొనుగోళ్లు జరిపి డబ్బులన్నీ కాజేసేవాడు. అంకిత్ చెపినట్లు మహమ్మద్ కలిమ్, రషీద్ చేసినందుకు ప్రతి లక్ష రూపాయలకు రూ.2,500 చొప్పున రాపిడో కొరియర్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా డబ్బులు పంపించేవారు. అంకిత్ కేవలం వీరితో వాట్సాప్ ద్వారా మాత్రమే మాట్లాడుతూ క్రెడిట్ కార్డుదారుల వివరాలను పంపేవాడు. వీరిద్దరూ ఉపయోగించడానికి రాపిడో కొరియర్, గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా మొబైల్ ఫోన్లు, సిమ్‌కార్డులను ప్రతి 10 రోజులకు ఒకసారి పంపేవాడు. ఈక్రమంలో సిరిసిల్ల పట్టణానికి చెందిన సురేశ్ కుమార్ అనే వ్యక్తి వీరి చేతిలో మోసపోగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సిరిసిల్ల పట్టణ పోలీసులు జిల్లా సైబర్ టీం ఆర్ఎస్ఐ జునైద్, గంగరెడ్డి, కిట్టు, మహేశ్ ఆధ్వర్యంలో టీమ్ ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా జార్ఖండ్ రాష్ట్రంలో నిందితుడు



అంకిత్‌ను పట్టుకున్నారు. మరో ఒక నిందితుడిని త్వరలో పట్టుకుంటామన్నారు. అంతర్ రాష్ట్ర సైబర్ నిందుతుడిని పట్టుకోవడంలో కృషిచేసిన సైబర్ ఆర్ఎస్ఐ జునైద్, సైబర్ టీమ్ గంగరెడ్డి, కిట్టు, మహేశ్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్‌లను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఇదిలాఉంటే నిందితులపై దేశవ్యాప్తంగా ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో 327 ఫిర్యాదులున్నాయి.

10-10-25 Samayam_Layout 1 10/10/2025 6:13 AM Page 10



## ఆయుర్వేద ప్రకారం ఈ నియమాలను పాటిస్తే

# ఎలాంటి రోగాలు ఉండవు..



ఆయుర్వేదానికి ఎన్నో వేల ఏళ్ల చరిత్ర ఉంది. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రాచీనమైన వైద్య విధానాల్లో ఆయుర్వేదం ఒకటిగా పేరుగాంచింది. గతంలో ఆయుర్వేద వైద్యానికి అంతగా ప్రాధాన్యత ఉండేది కాదు. కానీ ప్రస్తుతం చాలా మంది ఈ వైద్య విధానంలో చికిత్స పొందేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. భారతీయ సంప్రదాయ వైద్య విధానమైన ఆయుర్వేదానికి ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఆదరణ సైతం లభిస్తోంది. అయితే ఆయుర్వేద అంటే కేవలం ఔషధాలు మాత్రమే కాదు, మన జీవన విధానానికి సంబంధించి అనేక సూత్రాలను అందించింది. కానీ చాలా మంది వాటిని పాటించడం లేదు. ఆహారపు అలవాట్లతోపాటు ఆరోగ్యం విషయంలోనూ ఆయుర్వేదం పలు సూత్రాలను, నియమాలను రూపొందించింది. వాటిని పాటిస్తే మన జీవన విధానం మెరుగు పడడమే కాదు, రోగాలు రాకుండా చూసుకోవచ్చు. 100 ఏళ్ల పాటు ఎలాంటి రోగాలు రాకుండా దీర్ఘాయుష్షుతో జీవనం సాగిస్తారు. ఇక మన ఆరోగ్యానికి ఆయుర్వేదం అందిస్తున్న ఆ నియమాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**పరగడుపునే..**

చాలా మంది ఉదయం నిద్రలేచిన వెంటనే టీ లేదా కాఫీలను పరగడుపునే సేవిస్తుంటారు. కానీ ఆయుర్వేద ప్రకారం గోరు వెచ్చని నీళ్లను తాగాల్సి ఉంటుంది. అలా కాకుండా టీ, కాఫీలను తాగితే పొట్టలో యాసిడ్ల ప్రభావం పెరిగి దీర్ఘకాలంలో అల్సర్లు, ఇతర జీర్ణాశయ సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయి. కనుక ఉదయం పరగడుపున గోరు వెచ్చని నీళ్లను తాగితే ఎంతో మేలు జరుగుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండడంతోపాటు శరీరంలోని వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. అలాగే బరువు కూడా తగ్గుతారు. ఇక చాలా మంది తమ బరువును చెక్ చేసుకోరు. ఆయుర్వేద చెబుతున్న ప్రకారం కనీసం 3 లేదా 4 రోజులకు ఒకసారి అయినా లేదా వారానికి ఒకసారి అయినా శరీర బరువును కచ్చితంగా చెక్ చేసుకోవాలి. దీని వల్ల మీరు ఎంత బరువు ఉన్నారు, తగ్గాలా, పెరగాలా అన్న విషయం సులభంగా అర్థమవుతుంది. దాన్ని బట్టి బరువును నియంత్రణలో ఉంచుకోవచ్చు.

**బరువుకు తగినట్లుగా..**


చాలా మంది తమ శరీర బరువుకు తగిన విధంగా ఆహారాలను తినరు. బరువు ఎక్కువగా ఉన్నవారు ఇంకా ఎక్కువ ఆహారాలను తింటారు. తక్కువ బరువు ఉన్నవారు సరిగ్గా ఆహారం తినరు. ఈ పద్ధతిని మార్చుకోవాలి. మీ శరీర బరువుకు తగినట్లుగా రోజూ ఆహారం తినాల్సి ఉంటుంది. ఆయుర్వేద ప్రకారం రోజూ ఒకే సమయానికి భోజనం చేయాలి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఒకే సమయానికి ఆహారాన్ని తినాలి. తీసుకునే భోజనంలో ద్రవ, ఘనాహారాలు ఉండాలి. జీర్ణాశయంలో పావు వంతు ఖాళీ ఉంచాలి. అప్పుడే ఆహారం సరిగ్గా జీర్ణం అవుతుంది. భోజనానికి, భోజనానికి మధ్య కనీసం 4 నుంచి 5 గంటల వ్యవధి ఉండాలి. రోజులో ఒక్కసారి అయినా కుటుంబ సభ్యులతో లేదా స్నేహితులతో కలసి భోజనం చేయాలి.

**వ్యాయామం తప్పనిసరి..**

భోజనం చేసేటప్పుడు నీరు అస్సలు తాగరాదు. తప్పదనుకుంటే చాలా స్వల్పంగా నీటిని తాగాలి. భోజనానికి ముందు, భోజనం చేసేటప్పుడు, చేశాక ఎట్టి పరిస్థితిలోనూ చల్లని నీరు, పానీయాలను తాగరాదు. వారంలో ఒక్కసారి నూనెతో శరీరాన్ని మసాజ్ చేయాలి. ఇందుకు నువ్వుల నూనెను వాడితే మంచిది. దీని వల్ల శరీరం తేలిగ్గా మారుతుంది. చక్కని వర్చస్సు సొంతమవుతుంది. వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. అలాగే శరీరం ఉన్న స్థితిని బట్టి నిత్యం వ్యాయామం చేయాల్సి ఉంటుంది. ఆరోగ్యవంతమైన వ్యక్తులు వారంలో కనీసం 3 రోజులు వ్యాయామం చేసేలా ప్లాన్ చేసుకోవాలి. ఇతర వ్యక్తులు వారంలో కనీసం 5 రోజులు, రోజుకు 30 నిమిషాల పాటు అయినా వ్యాయామం చేయాల్సి ఉంటుంది. దీని వల్ల అనేక వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. ఇలా ఆయుర్వేద ప్రకారం పలు నియమాలను పాటిస్తుంటే ఆరోగ్యంగా ఉంటారు. 100 ఏళ్ల వరకు ఆరోగ్యానికి ఎలాంటి ఢోకా లేకుండా జీవిస్తారు.







# ఈ పండ్లను తొక్క తీయకుండానే తినాలి.. ఎందుకంటే..?

తరచూ పండ్లను తినడం వల్ల మనకు ఎలాంటి లాభాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. ఒక్కో రకమైన పండును తినడం వల్ల అనేక విధాలైన ఆరోగ్యకర ప్రయోజనాలు కలుగుతాయి. మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు కూడా లభిస్తాయి. పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు. శరీరానికి పలు పోషకాలు లభించి పలు వ్యాధులు సైతం నయం అవుతాయి. అయితే దాదాపుగా అన్ని రకాల పండ్లను మనం తొక్క తీసి తింటాం. కానీ మీకు తెలుసా.. కొన్ని రకాల పండ్లను మాత్రం మనం తొక్క తీయకుండానే తినాలి. అవును, మీరు విన్నది నిజమే. కొన్ని రకాల పండ్ల తొక్కల్లో కూడా అనేక పోషకాలు ఉంటాయి. అలాంటప్పుడు ఆ పండ్లను తొక్క తీసి తింటే మనకు పోషకాలు లభించవు. కనుక కొన్ని రకాల పండ్లను మనం తొక్క తీసే తినాల్సి ఉంటుంది. ఇక ఆ పండ్లేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**యాపిల్..**

యాపిల్ పండ్లలో పోషకాలు అధికంగా ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో న్యూట్రియెంట్లు ఉంటాయి. అయితే ఇవి యాపిల్ పండ్లలో ఎలా ఉంటాయో వాటి తొక్కలో కూడా అంతే విధంగా ఉంటా యి. కనుక యాపిల్ పండ్లను తొక్క తీయకుండా అలా గే తినాలి. దీని వల్ల యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా లభిస్తాయి. తద్వారా శరీర రోగ నిరోధక శక్తి పెరుగు తుంది. యాపిల్ పండ్లను చాలా మంది తొక్క తీసి తింటారు. కానీ ఈ పండ్లను శుభ్రంగా కడిగి తొక్కతో సహా తినాలి. అప్పుడే మనకు పూర్తి స్థాయిలో లాభాలు కలుగుతాయి. అలాగే పియర్స్ అనే పండ్లను కూడా మనం తొక్క తీయకుండానే తినాలి. దీని వల్ల ఆ తొక్కలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో న్యూట్రి యంట్లు మన శరీరానికి అందుతాయి. అంతేకాదు, పియర్స్ పండ్ల తొక్కలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణా లు మెండుగా ఉంటాయి. అందువల్ల అవి మనకు కలిగే వాపులను, నొప్పులను తగ్గించుకునేందుకు ఉపయోగపడతాయి. కనుక ఈ పండ్లను తొక్కతో సహా తినాల్సి ఉంటుంది.

**సపోటా..**

చాలా మంది సపోటా పండ్లను తొక్క తీసి తింటారు. అయితే అలా కాకుండా తొక్కతోనే నేరుగా తినాలి. దీని వల్ల జీర్ణాశయం శుభ్రమవుతుంది. దీంతోపాటు పొటాషియం, ఐరన్, ఫోలేట్, పాంటోథెనిక్ యాసిడ్ వంటి పోషకాలు మనకు లభిస్తాయి. కివీ పండ్లను తొక్క తీయకుండా తింటే దాంతో ఆ తొక్కలో ఉండే ఔషధ గుణాలు ఆందోళనను, ఒత్తిడిని దూరం చేస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉండడం వల్ల శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. మలబద్దకం తొలగిపోతుంది. జీర్ణ సమస్యలు తగ్గుతాయి. కివి పండ్ల తొక్క చూసేందుకు అంత ఆకర్షణీయంగా ఉండదు. కానీ ఈ తొక్కలోనూ అనేక పోషకాలు ఉంటాయి. కనుక కివి పండ్లను కూడా తొక్క తీయకుండానే తినాల్సి ఉంటుంది.

**మామిడి..**

మామిడి పండ్లను కూడా చాలా మంది తొక్క తీసి తింటారు. కానీ అలా చేయకూడదు. ఈ పండ్లను తొక్కతోనే తినాలి. దీంతో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. శరీర రోగ నిరోధక శక్తి రెట్టింపు అవుతుంది. ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోతాయి. అలాగే మామిడి పండ్లను తొక్కలో ఉండే కెరోటినాయిడ్లు, పాలీఫినాల్స్ అనే సమ్మేళనాలు క్యాన్సర్, డయాబెటిస్, గుండె జబ్బులను దూరం చేస్తాయి. కనుక మామిడి పండ్లను తొక్కతో సహా తినాల్సి ఉంటుంది.

# మొటిమలు ఇబ్బంది పెడుతున్నాయా..?

## అయితే ఈ ఇంటి చిట్కాలను పాటించండి..!

మొటిమలు అనేవి సాధారణంగా అందరికీ వస్తుంటాయి. యుక్త వయస్సులో ఉన్నవారికి ఇవి ఎక్కువగా వస్తాయి. మొటిమలు వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. అయితే ఆ కారణాలు ఏమున్నప్పటికీ ముఖంపై మొటిమలు ఉంటే మాత్రం ఇబ్బందిగా అనిపిస్తుంది. నలుగురిలో ముఖం చూపించాలంటే ఇబ్బంది పడుతుంటారు. కేవలం స్త్రీలనే కాదు, పురుషులను కూడా మొటిమలు ఇబ్బంది పెడుతుంటాయి. అయితే పలు ఇంటి చిట్కాలను పాటిస్తూ, పలు ఆహారాలను తీసుకుంటుంటే మొటిమలను తగ్గించుకోవచ్చు. దీని వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. ముఖం అందంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. చర్మం సురక్షితంగా ఉంటుంది. అలాగే మొటిమలు ఉన్నవారు పలు జాగ్రత్తలను కూడా పాటించాల్సి ఉంటుంది. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.



**టీ ట్రీ ఆయిల్, కలబంద గుజ్జు..**

మొటిమలను తగ్గించేందుకు టీ ట్రీ ఆయిల్ ఎంతగానో పనిచేస్తుంది. ఇందులో శక్తివంతమైన యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. కనుక దీన్ని ఉపయోగిస్తే మొటిమలను తగ్గించుకోవచ్చు. ఇందుకు గాను కొద్దిగా కొబ్బరినూనెను తీసుకుని అందులో కొన్ని చుక్కల టీ ట్రీ ఆయిల్‌ను వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని రాత్రి పూట ముఖంపై అప్లై చేయాలి. మరుసటి రోజు ఉదయం కడిగేయాలి. ఇలా చేస్తుంటే మొటిమలను తగ్గించుకోవచ్చు. ఇక మొటిమలు తగ్గేందుకు కలబంద గుజ్జు కూడా పనిచేస్తుంది. దీన్ని కూడా కాస్త తీసుకుని రాత్రి పూట మొటిమలు ఉన్న చోట రాసి మరుసటి రోజు ఉదయం కడిగేయాలి. దీని వల్ల కూడా ఈ సమస్య తగ్గుతుంది. గ్రీన్ టీలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకాలుగా పనిచేస్తాయి. కనుక గ్రీన్ టీ బ్యాగులను కూడా వాడవచ్చు. గ్రీన్ టీ బ్యాగ్‌ను తీసుకుని చల్లార్చి మొటిమలు ఉన్న చోట 10 నుంచి 15 నిమిషాల పాటు ఉంచాలి. తరువాత కడిగేయాలి. ఇలా చేస్తున్నా కూడా ఉపయోగం ఉంటుంది.

**తేనె, దాల్చిన చెక్క మిశ్రమం..**


తేనె, దాల్చిన చెక్కలలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి మొటిమలను తగ్గిస్తాయి. కొద్దిగా తేనె, దాల్చిన చెక్క పొడి తీసుకుని బాగా కలిపి మిశ్రమంగా చేయాలి. దీన్ని మొటిమలపై రాయాలి. 15 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. ఇలా చేస్తున్నా కూడా మొటిమలను తగ్గించుకోవచ్చు. మొటిమలు తగ్గేందుకు యాపిల్ సైడర్ వెనిగర్ కూడా పనిచేస్తుంది. ఇది చర్మంపై ఉండే బ్యాక్టీరియాను తొలగిస్తుంది. చర్మం పీహెచ్ స్థాయిలను నియంత్రిస్తుంది. కొద్దిగా యాపిల్ సైడర్ వెనిగర్‌ను తీసుకుని దానికి 3 రెట్లు ఎక్కువ మొత్తంలో నీళ్లను కలపాలి. ఈ మిశ్రమాన్ని మొటిమలపై రాసి 10 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. ఇలా చేస్తున్నా కూడా మొటిమలు తగ్గిపోతాయి.

**ఆహారాల విషయంలోనూ..**

మొటిమల సమస్య ఉన్నవారు ఆహారం విషయంలోనూ పలు మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా జింక్ అధికంగా ఉండే ఆహారాలను తినాల్సి ఉంటుంది. జీడిపప్పు, బాదంపప్పు, గుమ్మడికాయ విత్తనాలు, నువ్వులు, శనగలు, పప్పు దినుసులను తినాలి. అలాగే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉండే చేపలు, అవిసె గింజలు, చియా విత్తనాలు, వాల్ నట్స్‌ను తినాలి. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే బెర్రీలు, పాలకూర, గ్రీన్ టీలతోపాటు ప్రొ బయోటిక్ ఆహారాలు అయిన పెరుగు, పాలు, మజ్జిగ వంటివి తీసుకుంటుండాలి. ఇక మొటిమలు ఉన్నవారు కొన్ని ఆహారాలకు దూరంగా ఉంటే మంచిది. చక్కెర అధికంగా ఉండే పానీయాలు, స్వీట్లు, ఆవు పాలు, వేపుళ్లు, చిప్స్, నూనె పదార్థాలు, జంక్ ఫుడ్, బేకరీ ఆహారాలు వంటివి తీసుకోకూడదు. అలాగే పొగ తాగడం మానేయాలి. మద్యం సేవించకూడదు. రాత్రి పూట త్వరగా నిద్రించి ఉదయం త్వరగా నిద్ర లేవాలి. ఇలా పలు చిట్కాలను పాటిస్తూ ఆహారపు అలవాట్లను మార్చుకుంటే మొటిమలను చాలా సులభంగా తొలగించుకోవచ్చు. అలాగే చర్మ సౌందర్యం కూడా మెరుగు పడుతుంది.

# చక్కెర వస్తువులు తెగ తినేస్తున్నారా..?

## డయాబెటిస్ మాత్రమే కాదు కండ్లకు ప్రమాదమే..!



మానవ శరీరంలో ప్రతి అవయవానికీ ప్రత్యేక స్థానం ఉంది. అయినప్పటికీ కళ్లకు మరింత ప్రాముఖ్యం ఉంది. కళ్లు మనకు అనిర్వచనీయమైన అనుభూతిని అందిస్తాయి. చదవడం, ప్రపంచాన్ని చూడడం, ప్రకృతిని ఆస్వాదించడంలో కళ్లు కీలక పాత్ర పోషిస్తాయి. ఆందోళనకరమైన విషయం ఏమిటంటే.. అయితే కళ్లు అనేక విధాలుగా ప్రమాదంలో ఉన్నాయి. దినచర్య, ఆహారపు అలవాట్లు, మొబైల్, ల్యాప్‌టాప్ వంటి స్క్రీన్‌లపై ఎక్కువగా సమయం గడుపుతుండడంతో కళ్ల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న లక్షలాది మంది పిల్లలు కూడా స్పష్టంగా చూడలేకపోతున్నారు. వారంతా చిన్న వయసులోనే అద్దాలను పెట్టుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా సుమారు 2.2 బిలియన్ల మంది ప్రజలు ఏదో ఒక రకమైన కంటి సమస్యతో బాధపడుతున్నారు. ఈ కేసుల్లో సగానికి పైగా సరైన సంరక్షణ, ఆహారం తీసుకోవడం ద్వారా ఈ సమస్యలను తగ్గించే అవకాశం ఉంది. ముఖ్యంగా పిల్లలలో, యువకులో కండ్లు పొడిబారడం సర్వసాధారణంగా ఉంది. కొన్ని అలవాట్లను మెరుగుపరచుకోవడంతో ప్రమాదం తగ్గించే అవకాశం ఉంది. జీవనశైలికి సంబంధించిన అనేక అంశాలు కంటి సమస్యలకు కారణమవుతాయని, వీటిని చిన్న వయస్సు నుంచే తీవ్రంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. డిజిటల్ స్క్రీన్‌లను నిరంతరం ఉపయోగించడం, పోషకాహార లోపం, జంక్ ఫుడ్ వినియోగం, నిద్ర లేకపోవడం, కాలుష్యం, దుమ్ము ధూళి ప్రధాన కారణాలుగా పరిగణిస్తారు. అయితే, కండ్లకు హాని కలిగించే ఒక ప్రమాదకరమైన అలవాటు చాలా అరుదుగా గుర్తిస్తారు.

చక్కెర, తీపి పదార్థాలు అధిక మొత్తంలో తీసుకోవడం వల్ల మధుమేహం పెరగడమే కాకుండా కంటి సమస్యలు కూడా పెరుగుతాయి. అధిక చక్కెర తీసుకోవడం వల్ల డయాబెటిక్ రెటినోపతి, అస్పష్టమైన దృష్టి, అకాల కంటిశుక్లం వచ్చే ప్రమాదం పెరుగుతుందని అధ్యయనాల్లో నిపుణులు గుర్తించారు. ఎక్కువ చక్కెర, స్వీట్ పానీయాలు తీసుకోవడం వల్ల కాలక్రమేణా డయాబెటిక్ రెటినోపతి ప్రమాదం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది రెటీనా నరాలను ప్రభావితం చేస్తుంది. సకాలంలో జాగ్రత్త తీసుకోకపోతే, అది క్రమంగా అంధత్వానికి దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. అధిక చక్కెర వినియోగం కంటి లెన్స్‌ను కూడా ప్రభావితం చేస్తుందని.. ఇది కంటిశుక్లం వచ్చే ప్రమాదాన్ని పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. అధిక చక్కెర ఆహారం రక్తంలో చక్కెర స్థాయిలను కూడా వేగంగా పెంచుతుందని అధ్యయనాల్లో తేలింది. దీర్ఘకాలికంగా హై షుగర్ లెవల్స్ మీ కంటిలోని లెన్స్ వాపు ప్రమాదాన్ని పెంచుతాయి. ఇది దాని ఆకారాన్ని మారుస్తుంది. దాంతో సరిగ్గా దృష్టి పెట్టడం కష్టతరం చేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణ స్థితికి చేరుకున్న తర్వాత ఈ సమస్య తగ్గుతుంది. చక్కెర అధికంగా ఉండే ఆహారం, అధిక రక్తంలో చక్కెర కలయిక కన్నీటి ఉత్పత్తిని తగ్గిస్తుంది. దాంతో కళ్ళు పొడిబారడం, కంటి చికాకు, జలదరింపు, దృష్టి మసకబారడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. బ్రిటిష్ జర్నల్ ఆఫ్ ఆప్తాల్మాలజీలోని ఒక నివేదిక ప్రకారం.. తరచుగా అధికంగా చక్కెర తీసుకునే వ్యక్తుల్లో కంటి సంబంధిత వ్యాధుల బారినపడే ప్రమాదం 30శాతం ఉంది. పిల్లలు, యువకులు శీతల పానీయాలు, స్వీట్స్, ప్యాకేజ్డ్ జ్యూస్‌లు, చాక్లెట్ వినియోగాన్ని తగ్గించి, పండ్లు వంటి సహజ తీపి ఉండే వాటిని తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. విటమిన్ ఏ, విటమిన్ సీ, విటమిన్ ఇ, జింక్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ కంటి ఆరోగ్యానికి చాలా అవసరం. ఆహారంలో చక్కెరను తగ్గించి.. ఈ పోషకాలు అధికంగా ఉండే ఆహార పదార్థాల తీసుకోవడం మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు.

10-10-25 Samayam_Layout 1 10/10/2025 6:13 AM Page 11



# కోహ్లీ, రోహిత్ కొనసాగుతారు..

## వారి అనుభవం మాకు కావాలి : టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్



టీమిండియా సీనియర్ ఆటగాళ్లు అయిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ జట్టులో కొనసాగుతారని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు. వన్డే ప్రపంచకప్ 2027 లక్ష్యంగా వారి సన్నద్ధత కొనసాగుతోందని తెలిపాడు. వారి అనుభవం తమకు అవసరమని తెలిపాడు. వన్డే కెప్టెన్సీ బాధ్యతల నుంచి రోహిత్ శర్మను తొలగించి శుభ్‌మన్ గిల్‌ను నయా సారథిగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. వన్డే ప్రపంచకప్ 2027ను దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకున్నామని భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తెలిపాడు. దాంతో కోహ్లీ, రోహిత్ వన్డే ప్రపంచకప్ ఆడటంపై సందేహాలు మొదలయ్యాయి. ఆస్ట్రేలియా పర్యటన అనంతరం ఈ ఇద్దరూ రిటైర్మెంట్ ప్రకటిస్తారనే వాదన కూడా తెరపైకి వచ్చింది. గురువారం నుంచి వెస్టిండీస్‌తో రెండో టెస్ట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో శుభ్‌మన్ గిల్ బుధవారం మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా వన్డే సారథ్యంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మలా ప్రశాంతంగా ఉంటూ.. జట్టులో స్నేహపూర్వకమైన వాతావరణాన్ని సృష్టిస్తానని తెలిపాడు. 'రోహిత్ శర్మ చాలా కూల్‌గా ఉంటాడు. కెప్టెన్‌గా అతను జట్టులో నెలకొల్పిన స్నేహపూర్వక వాతావరణాన్ని సారథిగా నేను కొనసాగిస్తా. చాలా మంది బయటి నుంచి చాలా రకాలుగా మాట్లాడుతుంటారు. రోహిత్, విరాట్ ప్రస్తుతం వన్డేల్లో కొనసాగుతున్నారు. వారిద్దరి భవితవ్యంపై కూడా ఊహాగానాలు వస్తున్నాయి. టీమిండియా కోసం ఎన్నో మ్యాచ్‌లు గెలిపించారు. వీరిద్దరూ అద్భుతమైన నైపుణ్యం కలిగిన క్రికెటర్లు. జట్టుకు వారి అవసరం చాలా ఉంది. వచ్చే వన్డే ప్రపంచ కప్ లక్ష్యంగా వారి సన్నద్ధత జరుగుతోంది. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చెప్పలేం. నేను కూడా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. అయితే నేనెప్పుడూ వర్తమానంలో ఉండేందుకు ఇష్టపడుతా. అలాగే తంలో సాధించిన విజయాలు పట్టించుకోను. ప్రతీ మ్యాచ్‌లోనూ విజయం సాధించాలనే లక్ష్యంతో ముందుకుసాగుతాం. రాబోయే కొన్ని నెలలు మాకు చాలా ముఖ్యం.'అని గిల్ చెప్పుకొచ్చాడు. వెస్టిండీస్‌తో తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో గెలిచిన టీమిండియా.. రెండో టెస్ట్‌లోనూ అదే జోరు కొనసాగించాలనుకుంటుంది. ఈ మ్యాచ్ గెలిచి రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో ఉంది. మరోవైపు రెండో టెస్ట్‌లో టీమిండియా ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగుతుందని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తెలిపాడు. బుమ్రాకు రెస్ట్ ఇస్తారని ప్రచారం జరగ్గా.. ఈ వార్తలను అతను ఖండించాడు.



## కెప్టెన్‌గా తిలక్ వర్మకు ప్రమోషన్

ఆసియా కప్‌లో అదరగొట్టిన టీమ్‌ఇండియా యంగ్ బ్యాటర్ తిలక్ వర్మ ఇప్పుడు మరో టోర్నీకి సిద్ధం అవుతున్నాడు. అంతేకాదు ఓ జట్టుకు కెప్టెన్‌గా కూడా నియమితుడయ్యాడు. 2025- 26 సీజన్ రంజీ ట్రోఫీ టోర్నీలో 15 మందితో కూడిన హైదరాబాద్ జట్టును ప్రకటించారు. ఇందులో తిలక్ సారథిగా ఎంపికయ్యాడు. రాహుల్ సింగ్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ జట్టులో గత సీజన్‌లో ఆడిన సీవీ మిలింద్, రాహుల్ రాదేశ్, అభిరత్ రెడ్డి, తన్మయ్ అగర్వాల్, హిమ తేజ, అలీ కాచి డైమండ్, రోహిత్ రాయుడు, తనయ్ త్యాగరాజన్, నిశాంత్, కార్తికేయ, అనికేత్ రెడ్డి స్థానాలు కాపాడుకున్నారు. వీరంతా ఈ సీజన్‌లోనూ బరిలోకి దిగనున్నారు. ఇక నితీశ్ రెడ్డి, రక్షన్ రెడ్డి, నితేష్ కనాలా, మిఖిల్ జైస్వాల్, సాయి ప్రజ్ఞయ్ రెడ్డి స్టాండ్ బైగా ఎంపికయ్యారు. ఇదే నెలలో భారత్ క్రికెట్ జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్‌లో ఆతిథ్య ఆసీస్‌తో భారత్ ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌కు తిలక్ వర్మ ఎంపికయ్యాడు. 2026 టీ20 వరల్డ్‌కప్ నేపథ్యంలో ఆసీస్ గడ్డపై ఈ సిరీస్ యువ భారత్?కు అత్యంత కీలకం. అక్టోబర్ 29న తొలి టీ20 జరగనుంది. అయితే టీ20 సిరీస్? కోసం తిలక్ ఆసీస్? బయల్దేరాల్సి ఉంటుంది. నవంబర్ 08 దాకా మ్యాచ్?లు ఉడడంతో అక్కడే ఉంటాడు. ఈ క్రమంలోనే తిలక్ రంజీలో రెండో మ్యాచ్? సహా పలు గేమ్‌లకు దూరం అవుతాడు. అక్టోబర్ 25నే అతడు ఆస్ట్రేలియా వెళ్తాడు. గత సీజన్‌లో హైదరాబాద్ జట్టు ఎలైట్ గ్రూప్- బిలో ఆడింది. ఇందులో 7 మ్యాచ్‌ల్లో రెండే విజయాలు సాధించింది. మూడింట్లో ఓడింది. మరో రెండు మ్యాచ్‌లు డ్రా చేసుకుంది. దీంతో లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది.

# కోహ్లీ, రోహిత్‌శర్మకు సరైన గౌరవం ఇవ్వండి

### టీమిండియా మేనేజ్‌మెంట్‌కు అశ్విన్ సలహా



ఆస్ట్రేలియా పర్యటనకు ముందు టీమిండియా మేనేజ్‌మెంట్‌కు మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక సలహా ఇచ్చాడు. కెరీర్ చివరి దశలో ఉన్న విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మకు సరైన గౌరవం ఇవ్వాలని సూచించాడు. టెస్ట్, టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన కోహ్లీ, రోహిత్.. వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు. ఈ ఇద్దరూ వన్డే ప్రపంచకప్ 2027 ఆడే లక్ష్యంతో ఉన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలోని మూడు వన్డేల సిరీస్‌కు ఈ ఇద్దరూ సీనియర్ ఆటగాళ్లు ఎంపికయ్యారు. అయితే ఈ ఇద్దరూ వన్డే ప్రపంచకప్ వరకు జట్టులో కొనసాగలేరనే సందేహంలో టీమిండియా మేనేజ్‌మెంట్ ఉంది. దాంతో వన్డే కెప్టెన్సీ బాధ్యతల నుంచి రోహిత్ శర్మను తప్పించింది. తద్వారా మెరుగైన ప్రదర్శన చేస్తేనే జట్టులో కొనసాగుతారనే హెచ్చరికను జారీ చేసింది. తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. కోహ్లీ, రోహిత్‌తోనైనా సరిగ్గా వ్యవహరించాలని సూచించాడు. హర్షిత్ రాణా ఎంపికపై కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'నాణానికి ఒకవైపు సెలెక్షన్ కమిటీ.. మరోవైపు కోహ్లీ, రోహిత్ ఉన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వన్డే కెప్టెన్సీ బాధ్యతల నుంచి రోహిత్‌ను తప్పించినట్లు అర్థమవుతుంది. అయితే ఈ ఇద్దరూ ఆటగాళ్లు కెరీర్ చివరి దశలో ఉన్నారు. ఈ సందర్భంగా నేను చెప్పేది ఒక్కటే. కనీసం ఈ ఇద్దరి విషయంలోనైనా మెరుగైన రీతిలో వ్యవహరించాలి. అభిమానులు కోరుకునేది కూడా ఇదే. మేనేజ్‌మెంట్ మాత్రం వారు త్వరగా వీడ్కోలు చెప్పాలని కోరుకుంటుంది. ఎందుకంటే కొత్త కుర్రాళ్లకు అవకాశం ఇవ్వాలనేది వారి ఉద్దేశం. ఇలాంటప్పుడే సీనియర్లతో సరైన కమ్యూనికేషన్ ఉండాలి. మీరు భారత్ ఏ తరఫున ఆడితేనే వరల్డ్ కప్ జట్టులో చోటు ఇస్తామని సమాచారం ఇవ్వండి. దేశవాళీలోనూ ఆడాలని చెప్పండి.హర్షిత్ రాణా గురించి సోషల్ మీడియాలో బాగానే చర్చే జరుగుతోంది. అతని ఎంపిక గురించి అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే అతన్ని ఎవరూ ట్రోల్ చేయవద్దు. ఆస్ట్రేలియా గడ్డపై బ్యాటింగ్ సామర్థ్యం కలిగిన బౌలర్ కావాలి. హర్షిత్ రాణా బ్యాటింగ్ చేస్తాడా? అని ప్రశ్నించవచ్చు. కానీ అతను బ్యాటింగ్ చేయగలడు. 8వ స్థానంలో పరుగులు చేసే సత్తా అతనికి ఉంది. టీమ్‌మేనేజ్‌మెంట్ కూడా అదే నమ్మకంతో ఉంది. అతని బౌలింగ్‌పై సందేహాలు వ్యక్తం చేయడం సరికాదు. అతను జట్టులో అర్హుడా? కాదా? అనేది మరో విషయం. రాణించగలడా? లేదా? అనేది కూడా ఇప్పుడేం చెప్పలేం. కాబట్టి అతనిపై బ్యాడ్ కామెంట్స్ చేయకూడదు.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు. ఈ వ్యాఖ్యలతో టీమ్‌మేనేజ్‌మెంట్ తనతో సరిగ్గా వ్యవహరించలేదనే విషయాన్ని అశ్విన్ పరోక్షంగా వెల్లడించాడు. ఆస్ట్రేలియా పర్యటన మధ్యలోనే అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచిన విషయం తెలిసిందే. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తీరుకు విసుగు చెందే అశ్విన్ వీడ్కోలు పలికాడనే అభిప్రాయం అప్పట్లో వ్యక్తమైంది. తాజాగా అశ్విన్ చేసిన వ్యాఖ్యలు ఆ వాదనకు బలం చేకూరుస్తోంది.



## చరిత్ర సృష్టించిన రషీద్ ఖాన్

అఫ్గానిస్థాన్ స్టార్ బౌలర్ రషీద్ ఖాన్ అరుదైన రికార్డు సాధించాడు. బంగ్లాదేశ్?తో జరుగుతున్న వన్డే సిరీస్?లో అద్భుతమైన ఘనత అందుకున్నాడు. వన్డే సిరీస్?లో భాగంగా తాజాగా జరిగిన తొలి వన్డేలో బంగ్లాదేశ్?పై అఫ్గాన్ 5 వికెట్ల తేడాతో ఓడించింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో అఫ్గాన్ 1- 0 తో ఆధిక్యంలో నిలిచింది. ఈ క్రమంలోనే రషీద్ ఆసియా క్రికెట్? చరిత్రలో సూపర్ రికార్డు సాధించాడు. ఈ మ్యాచ్‌లో స్టార్ స్పిన్ బౌలర్ రషీద్ ఖాన్ 3 వికెట్లు పడగొట్టాడు. దీంతో ఇప్పటివరకు ఏ బౌలర్‌కు సాధ్యం కాని ఘనత సాధించాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో తొలి ఆసియా బౌలర్‌గా నిలిచాడు. తన కెరీర్?లో చరిత్రాత్మక మైలురాయిని చేరుకున్నాడు. అతను వన్డే ఇంటర్నేషనల్ క్రికెట్‌లో 200 వికెట్లు పూర్తి చేశాడు. 27ఏళ్ల రషీద్ ఖాన్ బంగ్లాదేశ్ బ్యాటర్ మెహిదీ హసన్ మిరాజ్‌ను 38.5 వద్ద %ాదీఔ%గా ఔట్ చేశాడు. ఈ వికెట్?తో %ాణ×% క్రికెట్‌లో 200 వికెట్లు తీసిన అఫ్గానిస్థాన్ తొలి బౌలర్?గా రికార్డు సృష్టించాడు. 2015లో వన్డేల్లో అరంగేట్రం చేసిన రషీద్ 115 మ్యాచ్?ల్లోనే ఈ ఘనత అందుకున్నాడు. అతడి తర్వాత జట్టులో సీనియర్ ప్లేయర్ మహ్మద్ నబీ (174 మ్యాచుల్లో 176 వికెట్లు) ఉన్నాడు. ఇక వరల్డ్?వైడ్?గా వన్డేల్లో అత్యంత వేగంగా ఈ మైలురాయి అందుకున్న రెండో బౌలర్?గా రషీద్ ఘనత సాధించాడు. ఈ క్రమంలోనే దిగ్గజాలు షేన్ వార్న్, ఆదిల్ రషీద్, అనిల్ కుంబ్లే రికార్డును రషీద్ బద్దలు కొట్టాడు. అలాగే వైట్ బాల్ క్రికెట్‌లో అంటే వన్డేలు, టీ20ల్లో 200ం వికెట్లు, 150ం వికెట్లు పడగొట్టిన ఏకైక బౌలర్?గా రషీద్ ఖాన్ అరుదైన ఘనత సాధించాడు. అంతర్జాతీయంగానే కాకుండా ఇటు ఐపీఎల్‌లోనూ రషీద్ ఖాన్ 150ం వికెట్లు పడగొట్టడం విశేషం. అంతర్జాతీయ టీ20ల్లో 179 వికెట్లు, ఐపీఎల్‌లో 158 వికెట్లు తీశాడు. కాగా, ఈ మ్యాచ్‌లో, టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 48.5 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 221 పరుగులు చేసింది. నాలుగు, ఐదు స్థానాల్లో బ్యాటింగ్ చేసిన తౌహిద్ హృదయ్ (56 పరుగులు), కెప్టెన్ మెహిదీ హసన్ (60 పరుగులు) అర్ధ సెంచరీలు సాధించి జట్టుకు గౌరవప్రదమైన స్కోర్ అందించారు. ఆఫ్గానిస్థాన్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్జాయ్, రషీద్ ఖాన్ చెరో 3 వికెట్లు పడగొట్టగా, గజన్‌ఫర్ 2, కరోటే 1 వికెట్ తీసుకున్నారు. 222 పరుగుల లక్ష్యాన్ని అఫ్గాన్ 47.1 ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించింది. రహ్మానుల్లా గుర్బాజ్ (50 పరుగులు), రహ్మత్ షా (50 పరుగులు) అర్ధ సెంచరీలు సాధించారు. ఆరో స్థానంలో బ్యాటింగ్ చేసిన అజ్మతుల్లా ఒమర్జాయ్ 40 పరుగులు అందించి జట్టును విజయ అంచులకు చేర్చాడు.

## చరిత్ర సృష్టించిన స్మృతి మంధాన

ఫుల్ ఫామ్‌లో ఉన్న భారత మహిళల జట్టు ఓపెనర్ స్మృతి మంధాన రికార్డులతో దూసుకెళ్తోంది. ఇప్పటికే ఏడాదిలో నాలుగు శతకాలతో రికార్డు నెలకొల్పిన ఈ క్రికెట్ క్వీన్.. మరో రికార్డును తన అకౌంట్‌లో వేసుకుంది. ఒకే ఏడాది వన్డేల్లో అత్యధిక పరుగులతో రికార్డు నెలకొల్పింది. సొంత దేశంలో జరుగుతున్న మహిళల వన్డే వరల్డ్ కప్ రెండు మ్యాచుల్లో స్మృతి మంధాన విఫలమైంది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో 12 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఈ ఘనత సాధించింది. ఈ క్రమంలో స్మృతి మంధాన ఆస్ట్రేలియా దిగ్గజ ప్లేయర్ బెలిండా క్లార్క్ రికార్డును బద్దలు కొట్టింది. 1997లో బెలిండా మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి డబుల్ సెంచరీ సాధించింది. ఆ ఏడాది మొత్తంగా బెలిండా 16 మ్యాచ్‌లు ఆడింది. 14 ఇన్నింగ్స్‌ల్లో 80.83 సగటు 98.11 స్ట్రైక్‌రేటుతో 970 పరుగులు సాధించింది. ఇందులో మూడు శతకాలు, నాలుగు అర్ధశతకాలు ఉన్నాయి. అత్యధిక స్కోరు 229 నాటౌట్. స్మృతి మంధాన.. ఈ ఏడాది ఇప్పటి వరకు దక్షిణాఫ్రికాతో మ్యాచ్ కలుపుకుని 17 ఇన్నింగ్స్‌ల్లో 59.93 సగటుతో 113 కంటే ఎక్కువ స్ట్రైక్‌రేటుతో 971 పరుగులు సాధించింది.

# రింకూ సింగ్‌కు బెదిరిపులు..

### రూ.5 కోట్లు డిమాండ్




టీమ్ ఇండియా స్టార్ ఆటగాడు రింకూ సింగ్‌కు అండర్ వరల్డ్ నుంచి బెదిరింపులు వచ్చినట్లు వార్తలు వచ్చాయి. ముంబై క్రైమ్ బ్రాంచ్ ఈ విషయాన్ని వెల్లడించింది. దివంగత ఎన్సీపీ నేత, మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ కుమారుడు జీషన్ సిద్ధిఖీని బెదిరించిన కేసులో అరెస్టు అయిన నిందితుడు మహ్మద్ దిల్‌షాద్ నౌషాద్ భారత క్రికెటర్ రింకూ సింగ్‌ను కూడా రూ.10 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. సోర్సెస్ ప్రకారం, విచారణలో నిందితుడు రింకూ సింగ్ ఈవెంట్ మేనేజర్‌కు కూడా బెదిరింపు ఇమెయిల్ పంపినట్లు తెలిసింది. రెండు కేసుల్లోనూ నిందితుడు తనను తాను డీ-కంపెనీ సభ్యుడిగా చెప్పుకుంటూ డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించాడు. ముంబై పోలీసులు ఈ కేసులో మొదటిసారిగా విపరీత చర్యగా భావించి బీహార్‌లోని దర్భంగాకు చెందిన 33 ఏళ్ల మహ్మద్ దిల్‌షాద్ నౌషాద్‌ను ట్రినిడాడ్ అండ్ టొబాగో నుంచి ఎక్స్‌ట్రాడిట్ చేశారు. నిందితుడు ఎన్సీపీ ఎమ్మెల్యే జీషన్ సిద్ధిఖీకి డీ-కంపెనీ పేరుతో బెదిరింపు ఇమెయిల్స్ పంపి రూ.10 కోట్లు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దిల్‌షాద్, వాస్తవానికి బీహార్‌లోని దర్భంగాకు చెందినవాడు, ఇంటర్‌పోల్ ద్వారా జారీ చేసిన లుక్ అవుట్ సర్క్యులర్ ఆధారంగా ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్టు అయ్యాడు. ఏప్రిల్ 2025లో జీషన్ సిద్ధిఖీ తనకు ఇమెయిల్ ద్వారా చంపేస్తామని బెదిరింపులు వచ్చాయని ఫిర్యాదు చేశారు. ఈ మెయిల్‌లో డబ్బులు ఇవ్వకపోతే తన తండ్రి బాబా సిద్ధిఖీకి జరిగినట్టే జరుగుతుందని రాసి ఉంది. ఈ బెదిరింపు ఇమెయిల్స్ ఏప్రిల్ 19 నుంచి 21, 2025 మధ్య పంపారు. ఈ ఇమెయిల్స్‌లో బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి డీ-కంపెనీ పేరును ఉపయోగించడమే కాకుండా, పోలీసుల దర్యాప్తును తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించాడు. బాబా సిద్ధిఖీ హత్యతో లారెన్స్ బిష్ణోయ్‌కి ఎలాంటి సంబంధం లేదని కూడా అతను తన మెయిల్‌లో రాశాడు, దీనివల్ల దర్యాప్తు సంస్థలు కావాలనే దర్యాప్తును తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని అనుమానించాయి. బాంద్రా పోలీసులు ఈ కేసులో గుర్తు తెలియని ఇమెయిల్ పంపిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం క్రైమ్ బ్రాంచ్ యాంటీ ఎక్స్‌టార్షన్ సెల్ సైబర్ సెల్, గూగుల్ అధికారుల సహాయంతో దర్యాప్తు ప్రారంభించింది. బెదిరింపు ఇమెయిల్స్ చిరునామా ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చెందినదని దర్యాప్తులో తేలింది. సాంకేతిక విచారణ, నిఘా ద్వారా నిందితుడు మహ్మద్ దిల్‌షాద్‌గా గుర్తించారు. పోలీసులు ఇంటర్‌పోల్ ద్వారా ఆ దేశానికి అనధికారిక అభ్యర్థన పంపి అతనిని అరెస్టు చేయాలని కోరారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ సహాయంతో ముంబై పోలీసులు నిందితుడిని భారతదేశానికి తీసుకురావడంలో విజయం సాధించారు. ముంబైకి చేరుకున్న వెంటనే దిల్‌షాద్ నౌషాద్‌ను ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినల్‌లో అరెస్టు చేశారు. నిందితుడు సైబర్ టెక్నాలజీలో నిపుణుడని, విదేశాల నుంచి బెదిరింపు ఇమెయిల్స్ పంపి భారతదేశ చట్టాన్ని సవాలు చేశాడని పోలీసు అధికారులు తెలిపారు. ఇప్పుడు పోలీసులు అతని వెనుక ఏదైనా వ్యవస్థీకృత నెట్‌వర్క్ లేదా ముఠా పనిచేస్తుందా, ఇది దేశంలోని ప్రముఖులను లక్ష్యంగా చేసుకుంటోందా అని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడికి ఏ ముఠాతోనూ సంబంధం లేదని, ఇలాంటి ఇమెయిల్స్ పంపి అవకాశాన్ని ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఈ కేసులో నిందితుడు నేరుగా రింకూ సింగ్‌ను సంప్రదించలేదు, కానీ అతని ఈవెంట్ మేనేజర్‌కు ఇమెయిల్ పంపి బెదిరించి రూ.10 కోట్లు డిమాండ్ చేశాడు. ఇప్పటి వరకు అందుతున్న సమాచారం ప్రకారం, నవీద్ అంతర్జాతీయ క్రికెటర్ రింకూ సింగ్‌ను మొదటిసారిగా ఫిబ్రవరి 5, 2025 ఉదయం 7:57 గంటలకు పంపిన సందేశం ద్వారా రూ.5 కోట్లు డిమాండ్ చేశాడు. "మీరు బాగున్నారని ఆశిస్తున్నాను. నేను మీ పెద్ద అభిమానిని, మీరు %ఖఖ=% జట్టు కోసం ఆడుతున్నందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. రింకూ సర్, మీరు మీ అవిశ్రాంత ప్రయత్నాలను కొనసాగిస్తారని నేను ఆశిస్తున్నాను. ఒక రోజు మీరు మీ కెరీర్ ఉన్నత స్థాయికి చేరుకుంటారు. సర్, నాకు ఒక రిక్వెస్ట్ ఉంది, మీరు నాకు ఆర్థికంగా సహాయం చేయగలిగితే, అల్లా మీకు మరింత ఆశీర్వాదం ఇస్తాడు, ఇన్షా అల్లాహ్." అని రాసాడు. సమాధానం రాకపోవడంతో నవీద్ ఏప్రిల్ 9, 2025 రాత్రి 11:56 గంటలకు మరో మెయిల్ పంపాడు"నాకు రూ. 5 కోట్లు కావాలి. నేను సమయం, స్థలాన్ని చెబుతాను. దయచేసి మీ కన్ఫర్మేషన్ చెప్పండి."అయినా సమాధానం రాకపోవడంతో నవీద్ ఏప్రిల్ 20, 2025 ఉదయం 7:41 గంటలకు ఆంగ్లంలో మూడో మెయిల్ పంపాడు,

10-10-25 Samayam_Layout 1 10/10/2025 6:13 AM Page 12







# త్రివిక్రమ్-వెంకీ కాంబో

## హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్

నువ్వు నాకు నచ్చావ్ సినిమా తర్వాత వెంకటేశ్ , త్రివిక్రమ్ శ్రీనివాస్ క్రేజీ కాంబోలో ఫుల్ లెంగ్త్ సినిమా రాబోతుందని తెలిసిందే. ఇటీవలే గ్రాండ్‌గా లాంచ్ అయిన ఈ మూవీ త్వరలోనె సెట్స్‌పైకి వెళ్లనుంది. అయితే కొన్నాళ్లుగా సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్లుగా రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్, ఎస్ థమన్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. కానీ త్రివిక్రమ్ మాత్రం ఈ సారి రెగ్యులర్ మ్యూజిక్ కంపోజర్లు కాకుండా కాస్త రూటు మార్చబోతున్నాడట. ఈ చిత్రం కోసం మ్యూజిక్ లవర్స్‌కు మరింత నయా ఫీల్ అందించేందుకు యానిమల్ కంపోజర్‌ను తెరపైకి తీసుకువచ్చేందుకు ప్లాన్ చేస్తున్నాడని వార్తలు వస్తున్నాయి. తాజా టాక్ ప్రకారం ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ పేరును పరిగణనలోకి తీసుకుంటున్నాడని ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. పాన్ ఇండియా మూవీ లవర్స్‌ను ఎంటర్‌టైన్ చేసేలా ఆల్బమ్‌ను ఎ÷-లాన్ చేస్తున్నట్టు తాజా వార్తలు హింట్ ఇచ్చేస్తున్నాయి. మరి వెంకీ కోసం హర్షవర్ధన్ రామేశ్వర్ ఎలాంటి బీజీఎం, మ్యూజిక్ ఆల్బమ్ రెడీ చేశాడనేది చూడాలి. ఈ ప్రాజెక్ట్‌లో రుక్మిణి వసంత్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో మెరువబోతుండగా..మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. త్రివిక్రమ్ మరోవైపు అల్లు అర్జున్‌తో మైథలాజికల్ ఫిల్మ్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. అల్లు అర్జున్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో వచ్చే సినిమా పూర్తయిన తర్వాత త్రివిక్రమ్ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందట.



# మోహన్ లాల్ చిత్ర రికార్డులు బ్రేక్

## 300 కోట్లు వసూలు చేసిన కొత్తలోక

చిన్న చిత్రంగా విడుదలై రికార్డులు తిరగరాస్తోంది 'కొత్తలోక: చాప్టర్ 1' కేవలం మౌత్ టాక్‌తోనే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. 300 కోట్ల క్లబ్‌లో చేరినట్లు టాక్. విడుదలైన నెల రోజులకే ఓటీటీకి వచ్చేస్తున్న తరుణంలో 'కొత్తలోక' మాత్రం ఇంకా థియేటర్‌లోనే ప్రేక్షకులను అలరిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ మూవీ రూ.300 కోట్ల క్లబ్‌లో చేరింది. అంతేకాదు, అత్యధిక వసూళ్లు రాబట్టిన తొలి మలయాళీ చిత్రంగానూ రికార్డు సృష్టించింది. కల్యాణి ప్రియదర్శన్ కీలక పాత్రలో డొమినిక్ అరుణ్ ఈ చిత్రాన్ని రూపొందించారు. కేవలం రూ.30 కోట్ల బ్జడెట్‌తో రూపొందిన ఈ మూవీ విడుదలైన 40 రోజుల్లో రూ.300 కోట్లు వసూలుచేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. మోహన్‌లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో ఈ ఏడాది వచ్చిన 'ఎల్2: ఎంపురాన్' ఇప్పటివరకూ మలయాళంలో అత్యధిక వసూళ్లు (రూ.265.5 కోట్లు) రాబట్టిన చిత్రంగా ఉండేది. ఆ రికార్డును 'కొత్తలోక' బద్దలు కొట్టింది. వీటి తర్వాత 'తుడురమ్' రూ.242 కోట్లతో మూడో స్థానంలో ఉంది. డొమినిక్ అరుణ్ కథను నమ్మి నటుడు దుల్కర్ సల్మాన్ పెద్ద సాహసం చేశాడు. 'కొత్తలోక' నటీనటులు, సాంకేతిక వర్గంపై రూ.30 కోట్లు ఖర్చు చేయడం చూస్తే, దుల్కర్ ఆ కథను ఎంతగా నమ్మాడో అర్థమవుతుంది. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్రబృందం కష్టపడింది. ఇప్పటివరకూ కల్యాణి ప్రియదర్శన్ నటించిన సినిమాలకు పూర్తి భిన్నంగా కథ, కథనాలు వైవిధ్యంగా ఉండటంతో కేవలం మౌత్ టాక్‌తోనే దూసుకుపోయింది. ఇప్పుడు ఏకంగా మలయాళ సినీ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఇక ఈ చిత్రం ఓటీటీలో ఎప్పుడొస్తుందా? అని సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీపావళి కానుకగా అక్టోబరు 20వ తేదీ నుంచి జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్‌కు తీసుకొచ్చే అవకాశాలున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మరోవైపు 'లోక' యూనివర్స్ కొనసాగుతుందని ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. ఇందులోభాగంగా 'లోక: చాప్టర్2'ను నిర్మాత దుల్కర్ సల్మాన్ ఇటీవల ప్రకటించారు. ఇందులో టొవినో థామస్ కీలక పాత్ర పోషిస్తున్నాడు.




# బ్లాక్ గౌన్‌లో శోభితా ధూళిపాల క్లాసీ చార్మ్

సినీ ఇండస్ట్రీలో ఫ్యాషన్ కి కొత్త అర్థం చెప్పే హీరోయిన్స్ లలో శోభితా ధూళిపాల పేరు తప్పనిసరిగా ఉంటుంది. ఇటీవల ఆమె షేర్ చేసిన బ్లాక్ డ్రెస్ ఫోటోలు ఆ గ్లామర్ కు మరో అర్థం చెప్పాయి. జారా బ్రాండ్‌కి సంబంధించిన ఈ ఫోటోషూట్‌లో ఆమె లుక్ సింపుల్ అయినా స్టైలిష్‌గా ఉంది. మినిమల్ మేకప్, స్పెషల్ హీల్స్, గోల్డ్ క్లచ్‌తో ఆమె లుక్ స్టన్నింగ్ అనేలా ఉంది.శోభితా కెరీర్‌ని చూస్తే, మోడలింగ్‌తో ప్రారంభించి తర్వాత సినిమాల వైపు అడుగుపెట్టింది. 2016లో 'రామన్ రాఘవ్ 2.0'తో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఆమె, ఆ తర్వాత 'గుడ్‌చారి'తో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించింది. నటనలోనూ, ఫ్యాషన్‌లోనూ తాను వేరే స్థాయిలో ఉన్నానని నిరూపించుకుంది. 'మేడ్ ఇన్ హెవెన్' వెబ్ సిరీస్ ద్వారా ఆమె గ్లోబల్ లెవెల్‌లో గుర్తింపు పొందింది. ఆ సిరీస్‌లో ఆమె పాత్రలో ఉన్న స్ట్రాంగ్, ఎమోషనల్ వైబ్స్ ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేశాయి. ఆ తర్వాత హాలీవుడ్ ప్రాజెక్ట్ 'పొన్నియిన్ సెల్వన్'లో కూడా ఆమె నటనకు మంచి ప్రశంసలు అందాయి. ఈ ప్రయాణం ఆమె వెర్సటిలిటీకి నిదర్శనం. తాజాగా ఆమె సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో తెరకెక్కుతున్న "చీకట్లో" వెబ్ మూవీతో మళ్లీ తెలుగులోకి వస్తోంది. ఇది అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదల కానుందని సమాచారం. ఈ ప్రాజెక్ట్ గురించి ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ అయ్యింది. శోభితా యొక్క పాత్ర ఈసారి కూడా కొత్త షేడ్స్‌లో కనిపించనుందని టాక్. మొత్తం మీద శోభితా ధూళిపాల ప్రతి సారి తన ఫోటోషూట్స్, సినిమా ఎంపికలతో ఫ్యాన్స్‌కి కొత్త ఫీలింగ్ ఇస్తోంది. ఇక రానున్న రోజుల్లో ఆమె సినిమాలు ఎలాంటి క్రేజ్ ను అందుకుంటాయో చూడాలి.



# జోరు పెంచిన సమంత.. సినిమాలే కాదు, అలా కూడా!

టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సమంత, హీరోయిన్ గా నటించడమే కాకుండా లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో కూడా అందరినీ ఆకట్టుకుంటున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చేస్తూ ఆడియన్స్ ను అలరిస్తున్న సమంత, పర్సనల్ రీజన్స్ వల్ల గత కొంతకాలంగా సైలెంట్ అయిన విషయం తెలిసిందే. ఇప్పుడు మళ్లీ ఇండస్ట్రీలో కంబ్యాక్ ఇవ్వాలని వరుస సినిమాలకు, వెబ్‌సిరీస్‌లకు సైన్ చేస్తున్నారు సమంత. అయితే సమంత కేవలం నటిగానే కాకుండా ఎంట్రప్రెన్యూర్ గా కూడా రాణిస్తున్నారు. ఆల్రెడీ సాకి, ఓ పెర్ఫ్యూమ్ లైన్ మరియు ఏకాం లాంటి స్కూల్ బ్రాండ్స్ కు ఓనర్ అయిన సమంత ఇప్పుడు తాజాగా బ్రాండ్ అంబాసిడర్ గా బాధ్యతలు చేపట్టారు. ప్రముఖ ఆభరణాల సంస్థ జోయాలుక్కాస్ తాజాగా తమ ప్రచారకర్తగా సమంతను నియమించింది. ఇంటర్నేషనల్ మార్కెట్ లో తమ డిజైన్లు, ఆభరణాల నైపుణ్యాన్ని సమంత తనదైన శైలిలో పరిచయం చేస్తారని సంస్థ చైర్మన్ జాయ్ ఆలుక్కాస్ అన్నారు. నేటి మహిళల ఆత్మవిశ్వాసం, శైలి, ప్రత్యేక గుర్తింపును సమంత ప్రతిబింబించనున్నారని, ఆమె జోయాలుక్కాస్ ఫ్యామిలీలో భాగమవడం చాలా సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. కాగా జోయాలుక్కాస్ కు బ్రాండ్ అంబాసిడర్ గా ఉన్న సమంత, ఆభరణాలు ఎప్పుడూ వ్యక్తిగత శైలిని తెలియచేసే మార్గంగా తాను భావిస్తానని, ప్రతీ జ్యుయలరీ వెనుక ఎన్నో ఎమోషన్స్, సెలబ్రేషన్స్ తో లాంటివి జోయాలుక్కాస్ లో ఉన్నాయని, అందానికి ప్రాధాన్యతనిచ్చే ప్రతీ మహిళను ఆత్మవిశ్వాసంతో ప్రకాశించేలా ప్రోత్సహించే బ్రాండ్ తో కలిసి వర్క్ చేయడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు.



# బద్రీనాథ్‌తో 40 కోట్లు బొక్క: అల్లు అరవింద్

అల్లు అర్జున్ ఇప్పుడు ఐకాన్ స్టార్ గా ఇండియా రేంజ్ లో దూసుకుపోతున్నాడు. పుష్ప సినిమా తర్వాత ఆయనకు పాన్ ఇండియా మార్కెట్ బాగా పెరిగింది. వందల కోట్ల బిజినెస్ చేస్తోంది ఆయన సినిమా. అయితే ఈ స్థాయిలో బన్నీ సినిమాలు చేస్తుంటే.. ఆయన వల్ల అల్లు అరవింద్ 40 కోట్లు నష్టపోయాడు. బద్రీనాథ్ మూవీ విషయాన్ని అల్లు అరవింద్ స్వయంగా ఓ ఇంటర్వ్యూలో తెలిపాడు. అల్లు అర్జున్ హీరోగా వివి వినాయక్ డైరెక్షన్లో వచ్చిన భారీ బ్జడెట్ మూవీ బద్రీనాథ్. అయితే ఈ సినిమాను ముందు అల్లు అరవింద్ రిజెక్ట్ చేశాడంట. కానీ అల్లు అర్జున్ ఇందులోని యాక్షన్ సీన్స్ కోసం పట్టుబట్టి మరి చేశాడు. ఈ సినిమా రిజల్ట్ ఎందుకో తేడా కొడుతుందని ముందు నుంచి అరవింద్ చెబుతూనే ఉన్నాడంట. సినిమాకు బ్జడెట్ అనుకున్న దానికంటే రెండింతలు ఎక్కువైంది. అప్పుడున్న బన్నీ మార్కెట్ కుమించి బ్జడెట్ అయింది. రిలీజ్ కి ముందు కూడా అరవింద్ కు ఈ సినిమా గురించి తేడాగానే ఉందని అనిపించింది. అనుకున్నట్టు గానే సినిమా డిజాస్టర్ అయింది. బ్జడెట్ భారీగా ఉండడంతో నష్టాలు ఎక్కువగానే వచ్చాయి. ఆ సినిమాకు ఎంత లేదన్న 40 కోట్ల వరకు నష్టాలు వచ్చాయని అల్లు అరవింద్ స్వయంగా తెలిపాడు. ఆ దెబ్బతోనే చాలా రోజులు పెద్ద సినిమాలు నిర్మించలేదని స్పష్టం చేశాడు. తిరిగి కోలుకోవడానికి కొంచెం టైం పట్టిందని.. కెరీర్ లో ఇలాంటి అనుభవాలు కూడా మంచివే అంటూ తెలిపాడు అరవింద్.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**